S TV SAMAYAM

epaper.samayamdaily.net APTEL/2006/18267

# సమయం

మన గొంతుకకే.. మన పత్రిక — తెలుగు దినపత్రిక

విలేకరులు కావలెను

ఫోన్ నెం : 99483 13985/ 89789 80131

సంపుటి: 18 | సంచిక: 328 | ఎడిటర్ : విక్రం కుమార్ | శనివారం 9 ఆగస్టు 2025 | ప్రచురణ : హైదరాబాద్ | పేజీలు: 12 | వెల:రూ.5 |

## ప్రేమానురాగాలకు ప్రతీక
# రక్షాబంధన్

ఒక కొమ్మ పువ్వులు.. ఒక గూటి దివ్వెలు

అన్నా చెల్లులు, అక్కాతమ్ముళ్లు జరుపుకునే ప్రత్యేక పండుగ

నేడు రాఖీ పౌర్ణమి.. శ్రావణ పౌర్ణమియే రాఖీ పండగ



06

అన్నా చెల్లెలి అనుబంధం.. జన్మజన్మలా సంబంధం.. జాబిలమ్మకిది జన్మదినం.. కోటి తారకల కోలాహలం' అంటూ ఎన్నో పాటలు అన్నాచెల్లిలి అనుబంధం గురించి వివరిస్తున్నాయి. అన్నయ్య లేదా తమ్ముడు తనకు ఎలాంటి కష్టం వచ్చినా తోడుగా నిలుస్తాడని చెల్లిలి నమ్మకం. తన అన్నకు ఎలాంటి నష్టం రాకూడదని, సమస్యల చిక్కుముడి నుంచి విడుదల కలగాలని, జీవితాంతం సుఖసంతోషాలతో ఉండాలని కోరుకుంటూ చెల్లెలు రాఖీని కడుతుంది. తన సంతోషాన్ని కోరుకొని రాఖీ కట్టిన చెల్లిలికి అన్నయ్య ఏదో ఒక కానుకను బహూకరించి చెల్లెలి ముఖంలో సంతోషాన్ని చూస్తాడు..



## రేపు బీజేపీలో చేరుతున్నా

బిఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజు

బీజేపీ రాష్ట్ర రాష్ట్ర అధ్యక్షుడుతో భేటీ

03



## హైదరాబాద్ వరదనీరంతా
# మూసీలో చేరాలి

### ప్రణాళికలు సిద్ధం చేయండి

- భారీ వర్షాలతో నగరంలో ఇక్కట్లు
- సీఎం రేవంత్ రెడ్డి కీలక ఆదేశాలు
- అప్రమత్తంగా ఉండాలని సూచన
- ఈదులవాగులో కొట్టుకపోతున్న కారును కాపాడిన స్థానికులు

“ఔటర్ రింగ్ రోడ్ (ఓఆర్ఆర్) పరిధిలోని కోర్ అర్బన్ ప్రాంతంలో వరద సంబంధిత సమస్యలను పరిష్కరించడానికి శాశ్వత చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. వర్షపు నీటిని మూసీ నదిలోకి మళ్లించడానికి సమగ్ర ప్రణాళికను రూపొందించాలి. ముఖ్యంగా అన్ని చెరువులు, నాలాలు, కాలువలు, ఇతర నీటి మార్గాలను మూసీకి క్రమపద్ధతిలో అనుసంధానించాలి”

**హైదరాబాద్, ఆగస్ట్ 8 :** హైదరాబాద్ ఔటర్ రింగ్ రోడ్ (ఓఆర్ఆర్) పరిధిలోని కోర్ అర్బన్ ప్రాంతంలో వరద సంబంధిత సమస్యలను పరిష్కరించడానికి శాశ్వత చర్యలు తీసుకోవాలని అధికారులను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశించారు. హైదరాబాద్ నగరంలో వర్షాలతో తలెత్తుతున్న ఇబ్బందులు, వరద సమస్యకు శాశ్వత పరిష్కారంపై ఉన్నతాధికారులతో సీఎం శుక్రవారం సమీక్ష సమావేశం నిర్వహించారు.

మిగతా 2 లో

## బీజేపీకి తొత్తుగా ఎన్నికల సంఘం



- ఓట్ల దొంగతనానికి ఈసీ సహకారం
- తన ఆరోపణలపై ఎందుకు మౌనం
- వెంటనే ప్రజలకు నిజాలు వెల్లడించాలి
- బెంగళూరులో రాహుల్ తీవ్ర విమర్శలు

**బెంగళూరు, ఆగస్ట్ 8:** ఎన్నికల సంఘం తన బాధ్యతల్ని విస్మరిస్తోందని, రాజ్యాంగాన్ని గౌరవించాల్సిన సంస్థ ఇప్పుడు బీజేపీకి అనుకూలంగా పనిచేస్తోందని కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ తీవ్ర ఆరోపణలు చేశారు. ఓట్లను దొంగిలించేందుకు ఎన్నికల సంఘం సహకరిస్తోందని ఆయన విమర్శించారు. బెంగళూరులోని ఫ్రీడమ్ పార్క్‌లో జరిగిన బహిరంగ సభలో ఆయన మాట్లాడుతూ శుక్రవారం మరోసారి ఎన్నికల సంఘాన్ని తీవ్రంగా విమర్శించారు. ప్రజాస్వామ్యాన్ని రక్షించాలంటే ప్రజలు చైతన్యంతో ఉండాలని, ఈ ఎన్నికల్లో న్యాయం

మిగతా 4లో



02

## సాయంత్రంలోగా చంపేస్తాం

- ఎంపీ రఘునందన్‌కు బెదిరింపులు

మెదక్ బీజేపీ ఎంపీ రఘునందన్ రావుకు మరోసారి బెదిరింపు ఫోన్ కాల్ వచ్చింది. హైదరాబాద్‌లోనే ఉన్నాం.. సాయంత్రంలోగా చంపేస్తామని ఎంపీని గుర్తు తెలియని వ్యక్తులు బెదిరించారు.

## ఎస్ఎల్‌బీసీ పనులను ప్రారంభించాలి

ఎస్ఎల్‌బీసీ సొరంగం పనులను తిరిగి త్వరగా ప్రారంభించాలని అధికారులను రాష్ట్ర నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డిఆదేశించారు. అవసరమైన అనుమతులపై త్వరలో సీఎం రేవంత్‌రెడ్డి భేటీ నిర్వహిస్తారని చెప్పారు.



- పనులు ఆగిపోవడంతో ఎత్తిపోతలకు ఏటా రూ.750 కోట్లు
- అధికారులతో మంత్రి ఉత్తమ్ సమీక్ష



04

## ట్రంప్ సుంకాల వడ్డింపు వేళ



## జడ్పీటీసి ఓటమి భయంలో వైకాపా

అందుకే అరాచక కార్యక్రమాలకు తెర

మండిపడ్డ మంత్రి సవిత

**కడప :** పోలీసులను అడ్డం పెట్టుకుని రాజకీయం చేయాల్సిన అవసరం తెలుగుదేశం పార్టీకి లేదని మంత్రి సవిత అన్నారు. గత వైకాపా ప్రభుత్వం ఇలాంటి పనులు చేసిందని అన్నారు. ఆనాడు ఎంత దారుణంగా రాక్షస పాలన

మిగతా 5 లో



## సిట్ విచారణతో ఒరిగేదేమీ లేదు

- సీబీఐ విచాణతోనే దొంగలను పట్టుకునే ఛాన్స్
- ప్రభాకర్, రాధాకిషన్‌కు వేసినా తక్కువే
- సిట్ విచారణ అనంతరం బండి సంజయ్

03

## వైఎస్ఆర్ గారు వైసీపీ సొంతం కాదు


- వైసీపీపై ఉన్న కోపాన్ని వైఎస్ఆర్ విగ్రహాల మీద చూపిస్తారా?
- నందిగామ గాంధీ సెంటర్‌లో వైఎస్ఆర్ విగ్రహాన్ని తొలగించారన్న షర్మిల
- కూటమి ప్రభుత్వ దిగజారుడుతనానికి నిదర్శనం అని విమర్శలు





**అమరావతి:** నందిగామ గాంధీ సెంటర్‌లో వైఎస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహాన్ని తొలగించిన ఘటనపై ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల మండిపడ్డారు. కూటమి ప్రభుత్వం వైసీపీపై ఉన్న రాజకీయ కోపాన్ని ప్రజానాయకుడు వైఎస్ఆర్ విగ్రహాలపై చూపించడం దారుణమని ఆమె విమర్శించారు. “వైఎస్ఆర్ గారు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా చివరి క్షణం వరకు ప్రజల కోసం తన ప్రాణాలను అర్పించారు. ఆయన అమలు చేసిన సంక్షేమ పథకాలు దేశానికి దిశానిర్దేశం

మిగతా 5 లో





## నేడు ప్రపంచ ఆదివాసీ దినోత్సవం

- పాడేరులో పెద్ద ఎత్తున గిరజిన సంక్షేమ కార్యక్రమాలు
- హాజరువుతున్న ముఖ్యమంత్రి చంద్రబాబు
- గిరిజనుల సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యం
- రూ.7557 కోట్లు షెడ్యూల్డ్ - ట్రైబ్ కాంపోనెంట్ కింద ఖర్చు

.. వివరాలు 5లో





# మహిళకు సీఎం రాఖీ శుభాకాంక్షలు

**హైదరాబాద్, ఆగస్ట్ 8:** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాష్ట్రంలోని మహిళలందరికీ రాఖీ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. అన్నాచెల్లెళ్ల అనుబంధానికి ప్రతీక అయిన రాఖీ పండుగను అందరూ ఆనందంగా జరుపుకోవాలని అన్నారు. మహిళల సాధికారతతో పాటు మహిళలను కోటీశ్వరులను చేసే సంకల్పంతో ప్రజా ప్రభుత్వం వినూత్న కార్యక్రమాలు, పథకాలు అమలు చేస్తోందని అన్నారు. గృహజ్యోతి, కొత్త రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, ఇందిరా క్యాంటీన్లు, ఇందిరమ్మ ఇళ్ల మంజూరులోనూ మహిళలకే పెద్దపీట వేయడం జరిగిందన్నారు. రాష్ట్రాభివృద్ధిలో మహిళలందరూ భాగస్వాములయ్యే వరకు ప్రజా ప్రభుత్వం వారికి అండగా ఉంటుందన్నారు. మహిళల రక్షణ, భద్రత విషయంలో ప్రభుత్వం తగిన చర్యలు చేపడుతుందని, మహిళల అభివృద్ధి, సంక్షేమం విషయంలో ఎక్కడా రాజీ పడేది లేదని అన్నారు. అక్కా చెల్లెళ్లందరికీ తమ ప్రభుత్వం ఎల్లవేళలా అందుబాటులో ఉంటుందని, అందరి దీవెనలతో విజయవంతంగా ప్రజా పాలన సాగిస్తుందని ముఖ్యమంత్రి భరోసా ఇచ్చారు.

# కాళేశ్వరం నివేదిక ఇవ్వండి

**సీఎస్‌ను కోరిన హరీష్ రావు**

**హైదరాబాద్, ఆగస్ట్ 8:** కాళేశ్వరం ప్రాజెక్టుపై జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ సమర్పించిన పూర్తి నివేదికను ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావును మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీష్ రావు కోరారు. శుక్రవారం ఆయన సచివాలయానికి వెళ్లి సీఎస్ రామకృష్ణరావును కలిశారు. జస్టిస్ ఘోష్ ఇచ్చిన 665 పేజీల నివేదిక ప్రతులను ఇవ్వాలని కోరుతూ.. కేసీఆర్, హరీష్‌రావు పేరుతో వేర్వేరు వినతి పత్రాలను అందజేశారు. అనంతరం వినతిపత్రాలు ఇచ్చినట్లు రశీదులు తీసుకున్నారు. హరీశ్‌రావు విజ్ఞప్తిని పరిశీలించి చెబుతామని సీఎస్ చెప్పినట్లు- సమాచారం. భారత రాష్ట్ర సమితి ఎమ్మెల్యేలు కాలేరు వెంకటేశ్, ముఠా గోపాల్, బండారు లక్ష్మారెడ్డి, ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్ తదితరులు హరీష్ రావు వెంట ఉన్నారు.

# ఆవరిస్తున్న క్యుములో నింబస్

**భారీ వర్షాలు పడతాయని హెచ్చరిక**

**హైదరాబాద్, ఆగస్ట్ 8:** రాష్ట్ర వ్యాప్తంగా వర్షాలు విస్తారంగా కురుస్తున్నాయి. అయితే దక్షిణ తెలంగాణకు భారీ వర్ష సూచన ఉన్నట్టు-వాతావరణ శాఖ తెలిపింది. ఉపరితల ఆవర్తనంతో మరో నాలుగు రోజులు వానలు దంచికొట్టనున్నాయని పేర్కొంది. నల్లగొండ, యాదాద్రి, నాగర్‌కర్నూల్, వనపర్తి, మహబూబ్‌నగర్, నారాయణపేట, గద్వాల జిల్లాలకు వాతావరణ శాఖ ఎల్లో అలర్ట్ జారీ చేసింది. ఈ జిల్లాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అత్యవసర పరిస్థితుల్లోనే బయటకు రావాలని వాతావరణ శాఖ హెచ్చరించింది. ఇక క్యుములో నింబస్ మేఘాల వల్ల రాష్ట్ర వ్యాప్తంగా వర్షాలు కురిసే అవకాశం ఉంది. ఇవాళ సాయంత్రం, రాత్రి సమయాల్లో వర్షాలు కురిసే అవకాశం ఉంది. శుక్రవారం సాయంత్రం కూడా నగరంలో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించింది. నిన్నటి అంత వర్షం కురిసే అవకాశం లేదని స్పష్టం చేశారు. మధ్యాహ్నం వరకు ఎలాంటి వర్ష సూచన లేదన్నారు. సాయంత్రం వేళ పలుచోట్ల ఉరుములు, మెరుపులు సంభవించనున్నాయి. మరో ఐదు రోజులపాటు- తెలంగాణలోని పలు జిల్లాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ శాఖ తెలిపింది. 9, 10 తేదీల్లో నల్గొండ, మహబూబ్ నగర్, నాగర్ కర్నూల్, వనపర్తి, నారాయణపేట్, జోగులాంబ గద్వాల్ జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొంది. 11, 12వ తేదీల్లో తెలంగాణవ్యాప్తంగా అన్ని జిల్లాల్లో మోస్తరు వర్షాలు కరిసే అవకాశం ఉందని తెలిపింది. 13వ తేదీన తెలంగాణలోని అన్ని జిల్లాలో అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వెల్లడించింది.

# మెదక్ ఎంపీ రఘునందన్‌కు బెదిరింపులు

**సాయంత్రంలోగా చంపేస్తామంటూ ఫోన్ కాల్**

**హైదరాబాద్, ఆగస్ట్ 8:** బిజెపి మెదక్ ఎంపీ రఘునందన్‌రావుకు మరోసారి దుండగులు ఫోన్ చేసి బెదిరించారు. హైదరాబాద్‌లోనే ఉన్నామని, సాయంత్రంలోగా చంపేస్తామని హెచ్చరించారు. ఆయనకు ఇలా బెదిరింపు ఫోన్ కాల్ రావడం ఆరోసారి. తాజాగా 9404348431 నెంబర్ నుంచి ఫోన్ వచ్చినట్లు పోలీసులకు ఫిర్యాదు అందింది. రంగంలోకి దిగిన పోలీసులు దర్యాప్తు ముమ్మరం చేశారు. మొదటిసారి రఘునందన్ రావుకు జూన్ 23న బెదిరింపు కాల్ వచ్చింది. మావోయిస్టుల పేరుతో ఆయన్ను సాయంత్రంలోగా చంపేస్తామంటూ బెదిరించారు. దీంతో ఆయనకు భద్రతను పెంచారు. ఆ తర్వాత పలు మార్లు బెదిరింపు కాల్స్ వచ్చాయి. ప్రతీసారి కూడా ఆయనకు కాల్ చేసి ఇదే విధంగా దుండగులు బెదిరిస్తున్నారు. ముఖ్యంగా ఆపరేషన్ కగార్ ఆపాలని లేకుండా చంపేస్తామని.. దమ్ముంటే కాపాడుకోవాలని దుండగులు హెచ్చరిస్తున్నారు. దీంతో పోలీసులు ఆయనకు కట్టుదిట్టమైన భద్రతను కల్పించారు.

# సృష్టి కేసులో ఇద్దరు కేజీహెచ్ డాక్టర్లు

**తవ్వినకొద్దీ బయట పడుతున్న అక్రమాలు**

**హైదరాబాద్, ఆగస్ట్ 8:** 'సృష్టి' ఫెర్టిలిటీకేసులో విశాఖపట్నంలోని కింగ్ జార్జ్ హాస్పిటల్ (కేజీహెచ్)కు చెందిన ఇద్దరు వైద్యులను గోపాలపురం పోలీసులు అరెస్ట్ చేశారు. అరెస్ట్ అయిన వారిలో మత్తు వైద్య విభాగాధిపతి డాక్టర్ వాసుపల్లి రవి కుమార్, ప్రసూతి విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ ఉషాదేవి ఉన్నారు. ఇక వాసుపల్లి రవి కుమార్ మాజీ ఎమ్మెల్యే తమ్ముడు కావడంతో ఈ కేసులో మరో రాజకీయ కోణాన్ని తీసుక రాబోతుంది. ఇదివరకు ఇదే కేసులో అరెస్టయి, బెయిల్ పై విడుదలైన డాక్టర్ విద్యుల్లత కూడా కేజీహెచ్ పిల్లల విభాగంలో పనిచేశారు. ఈ వైద్యులు కేజీహెచ్‌లో విధులు నిర్వహిస్తూనే 'సృష్టి' ఫెర్టిలిటీ-ఆసుపత్రిలో వైద్య సేవలు అందించేవారని ఆరోపణలు ఉన్నాయి. కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ వాణి ఈ అరెస్టులపై తనకు వివరాలు తెలియవని తెలిపారు. డాక్టర్ వాసుపల్లి రవి కుమార్ గత మూడు రోజులుగా సెలవులో ఉన్నట్లు- సమాచారం. మరో వైపు, ప్రధాన నిందితురాలు డాక్టర్ నమ్రతతో సంబంధాలు కలిగి ఉన్న ఇద్దరు వైద్యులు డాక్టర్ రమ్య, డాక్టర్ రవిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. దీంతో ఇప్పటివరకు ఈ కేసులో అరెస్టయిన వారి సంఖ్య 28కి చేరింది. దర్యాప్తులో బయటపడ్డ వివరాల ప్రకారం, సరోగసి పేరుతో డాక్టర్ నమ్రత ఇప్పటి వరకు సుమారు 50 మంది బాధితుల వద్ద నుంచి రూ.20 కోట్లకు పైగా వసూలు చేశారు. మరో కీలక నిందితురాలు సంతోషి ఏజెంట్ల ద్వారా 18 మంది శిశువులను సేకరించినట్లు- తేలింది. ముఖ్యంగా గిరిజన మహిళలను ప్రలోభపెట్టి వారి నుంచి శిశువులను కొనుగోలు చేసి, తమ క్లయింట్లకు ఒక్కో శిశువును రూ.50 లక్షలకు విక్రయించినట్లు- వెల్లడైంది. మొత్తం 80 మంది పిల్లలను అమ్మిన ఘటన వెలుగులోకి వచ్చింది. ఈ నేపథ్యంలో పోలీసులు డాక్టర్ నమ్రత బ్యాంక్ ఖాతాలను ఫ్రీజ్ చేశారు. తల్లులను గుర్తించి శిశువులను తిరిగి వారికి అప్పగించేందుకు ప్రత్యేక ఏర్పాట్లు- చేస్తున్నారు.

# హైదరాబాద్ వరద నీరంతా మూసీలో చేరాలి

మొదటి పేజీ తరువాయి



నగరంలో వర్షాలతో తలెత్తుతున్న ఇబ్బందులు, వరద సమస్యకు శాశ్వత పరిష్కారంపై తగు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఎక్కడా ప్రాణ నష్టం లేకుండా చూడాలన్నారు. సమీక్షకు సీఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డి, సెక్రటరీ ఇలంబర్తి, సీఎం సెక్రటరీ మాణిక్ రాజ్, ఈవీ నర్సింహా రెడ్డి, జేఎండీ పి.గౌతమి, రంగారెడ్డి జిల్లా కలెక్టర్ నారాయణ రెడ్డి, ఇతర ఉన్నతాధికారులు హాజరయ్యారు. హైదరాబాద్‌లో గురువారం కురిసిన భారీ వర్షానికి యాదాద్రి భువనగిరి జిల్లాలో మూసీ ఉద్ధృతంగా ప్రవహిస్తోంది. వలిగొండ మండలం సంగెం సమీపంలోని భీమలింగం వద్ద లోలెవల్ బ్రిడ్జిపై నుంచి మూసీ ప్రవాహం కొనసాగుతోంది. వరద ప్రవాహం ప్రమాదకర స్థాయిలో ఉండటంతో వంతనపై ఎవరూ ప్రయాణించకుండా పోలీసులు బ్రిడ్జికి ఇరువైపులా బారికేడ్లు ఏర్పాటు చేశారు. దీంతో సంగెం పరిసర గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. భువనగిరి నియోజకవర్గవ్యాప్తంగా గురువారం భారీ వర్షం కురిసింది. బీబీనగర్ మండలం రుద్రవెల్లి వద్ద బ్రిడ్జి కింద నుంచి మూసీ ప్రవహిస్తోంది. రంగారెడ్డి, హైదరాబాద్. యాదాద్రి భువనగిరి జిల్లాల్లో భారీ వర్షాలు కురవడంతో మూసీ నది ఉప్పొంగి ప్రవహిస్తోంది. చౌటుప్పల్ మండలంలో ఈదుల వాగు పొంగి ప్రవహించడంతో కారు కొట్టుకుపోయింది. స్థానికులు గమనించి ఏడుగురిని స్థానికులు కాపాడారు. కారు ఈదుల వాగు నుంచి వెళుతుండగా ఒక్కసారిగా వరదలో కొట్టుకుపోయింది. స్థానికులు తాడు వేసి ఏడుగురిని బయటకు లాగారు. దీంతో పెను ప్రమాదం తప్పింది. యాదాద్రి భువనగిరి జిల్లా సంగం భీమలింగం దగ్గర మూసీ లెవెల్ వంతెన పైనుంచి ప్రవహిస్తుంది. మూసీ నది వంతెనపై రాకపోకలను అధికారులు నిలిపివేశారు. హిమాయత్ సాగర్ రిజర్వాయర్ నీటి మట్టం పూర్తిస్థాయికి పెరగడంతో నాలుగు గేట్లు ఎత్తి దిగువకు నీటిని అధికారులు విడుదల చేశారు. దీంతో మూసీ ఉప్పొంగి ప్రవహిస్తుండడంతో పరీవాహక ప్రజలకు అధికారుల హెచ్చరికలు జారీ చేశారు. హుస్సేన్ సాగర్ కూడా పూర్తిస్థాయి నీటి మట్టానికి చేరింది.

# కమీషన్ల కోసమే కాళేశ్వరం నిర్మాణం

**ప్రతి పథకం వెనకా కమిషన్ల బాగోతం**

**ఏ పనిచేసినా దోచుకేవడమే లక్ష్యం**

**ఎదురుదాడితో తప్పించుకునే ఎత్తుగడ**

**ఇందిరమ్మ ఇళ్ల పంపిణీలో మంత్రి పొంగులేటి**



**హనుమకొండ, ఆగస్ట్ 8:** గత బీఆర్ఎస్ ప్రభుత్వం కాళేశ్వరం ప్రాజెక్ట్‌ను కమిషన్ల కోసమే కట్టిందని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆరోపించారు. వారు ఏ పని చేసినా కమిషన్ల కోసమే చేశారని అన్నారు. తెలంగాణను అడ్డంగా దోచుకున్నారని మండిపడ్డారు. ప్రతి పథకంలో కమిషన్ కోసమే నాటి ప్రభుత్వం పని చేసిందని మంత్రి పొంగులేటి ఆరోపించారు. హన్మకొండ జిల్లాకేంద్రం బాలసముద్రంలో డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను పంపిణీ చేసిన సందర్భంగా ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో బీసీ రిజర్వేషన్లను ఆపేందుకు బీఆర్ఎస్, బీజేపీ పార్టీలు కుట్రచేస్తున్నాయని విమర్శించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం కట్టిన కాళేశ్వరం కూలిపోయిందని మంత్రి పొంగులేటి తెలిపారు. కాళేశ్వరం కమిషన్ ఇచ్చిన రిపోర్ట్ చూసి, బీఆర్ఎస్ నేతలను తెలంగాణ ప్రజలు అసహ్యించుకుంటున్నారని చెప్పారు. అయినా కూడా బీఆర్ఎస్ నేతలు నిస్సిగ్గుగా తమపై ఎదురుదాడి చేస్తున్నారని పేర్కొన్నారు. గత ప్రభుత్వం పేదవాళ్లకు సక్రమంగా ఇల్లు ఇస్తే ఇవాళ ఇల్లు అడిగేవారు కాదని స్పష్టం చేశారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం కట్టిన కాళేశ్వరం కూలిపోయిందని మంత్రి పొంగులేటి తెలిపారు. కాళేశ్వరం కమిషన్ ఇచ్చిన రిపోర్ట్ చూసి, బీఆర్ఎస్ నేతలను తెలంగాణ ప్రజలు అసహ్యించుకుంటు-న్నారని చెప్పారు. అయినా కూడా బీఆర్ఎస్ నేతలు నిస్సిగ్గుగా తమపై ఎదురుదాడి చేస్తున్నారని పేర్కొన్నారు. గత ప్రభుత్వం పేదవాళ్లకు సక్రమంగా ఇల్లు ఇస్తే ఇవాళ ఇల్లు అడిగేవారు కాదని స్పష్టం చేశారు. కులం, మతం, పార్టీలతో సంబంధం లేకుండా జిల్లా కేంద్రంలో 592 మందికి డబుల్ బెడ్రూం ఇళ్లు పంపిణీ చేసినట్లు స్పష్టం చేశారు. తమ ప్రభుత్వం వచ్చిన 18 నెలలుగా సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లుగా దూసుకుపోతున్నాయని ధీమా వ్యక్తం చేశారు. తెలంగాణ ఉద్యమకారిణి రహిమున్నీసాబేగానికి తొలి పట్టా అందించినట్లు- మంత్రి పొంగులేటి వెల్లడించారు. ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులను పారదర్శకంగా ఎంపిక చేశామని మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ఏ పార్టీ కార్యకర్త అని కూడా చూడకుండా ఎంపిక చేసినట్లు చెప్పారు. 'పార్టీలకు అతీతంగా పేదవాడైతే చాలు.. ఇళ్లు ఇవ్వాలని అధికారులకు చెప్పాం. పేదల ముఖంలో నవ్వు చూడటమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం. గత ప్రభుత్వం రెండు పడక గదుల ఇళ్లను కొందరికి మాత్రమే ఇచ్చింది. పదేళ్ల పాటు- ఎవరికీ రేషన్ కార్డులు ఇవ్వలేదు. కాంగ్రెస్ ప్రభుత్వంలో మొదటి విడతలో 4.50 లక్షల మందికి ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేశాం. 6.50 లక్షల మందికి కొత్త రేషన్ కార్డులు ఇచ్చాం. రైతుభరోసా కింద రైతుల ఖాతాల్లో 9 రోజుల్లోనే రూ.9 వేల కోట్లు- జమ చేశాం. భారత రాష్ట్ర సమితి ప్రభుత్వం వేల కోట్ల కమిషన్ల కోసం కాళేశ్వరం ప్రాజెక్టును నిర్మించింది. రూ.లక్ష కోట్లతో నిర్మించిన ప్రాజెక్టు మూడేళ్లకే కూలింది. నిర్మాణంలో జరిగిన అక్రమాలను విచారణ కమిషన్ బయటపెట్టింది. బీసీలకు రిజర్వేషన్లను పెంచుతూ కాంగ్రెస్ ప్రభుత్వం చట్టం చేసింది. రాష్ట్ర ప్రభుత్వం ఆమోదించిన బిల్లులను కేంద్రంలోని భాజపా ఆమోదించలేదు. బీసీ రిజర్వేషన్లకు అడ్డుపడుతున్న భాజపాకు వచ్చే ఎన్నికల్లో తగిన బుద్ధి చెప్పాలని పొంగులేటి తెలిపారు.



# ఎస్ఎల్‌బీసీ సొరంగం పనులను తిరిగి ప్రారంభించాలి

**పనులు ఆగిపోవడంతో ఎత్తిపోతలకు ఏటా రూ.750 కోట్లు**

**అధికారులతో మంత్రి ఉత్తమ్ సమీక్ష**

**హైదరాబాద్, ఆగస్ట్ 8:** ఎస్ఎల్‌బీసీ సొరంగం పనులను తిరిగి త్వరగా ప్రారంభించాలని అధికారులను రాష్ట్ర నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డిఆదేశించారు. అవసరమైన అనుమతులపై త్వరలో సీఎం రేవంత్‌రెడ్డి భేటీ నిర్వహిస్తారని చెప్పారు. శుక్రవారం నీటిపారుదశాఖ ఉన్నతాధికారులు, ఇంజినీర్లతో మంత్రి సమీక్ష నిర్వహించారు. మూడు దశాబ్దాల తర్వాత నీటిపారుదల శాఖలో పదోన్నతులు, బదిలీలు జరుగుతున్నట్లు- చెప్పారు. ఎస్ఎల్‌బీసీ సొరంగం ప్రమాదం తర్వాత నిపుణుల కమిటీ సిఫార్సు లతో తిరిగి పనులు మొదలు పెట్టాలి. ముఖ్యమైన ప్రాజెక్టు 9 కి.మీ పనికే నిలిచిపోవడం దురదృష్టకరం అన్నారు. ఎస్ఎల్‌బీసీ పూర్తి కానందున ఎత్తిపోతలకు ఏటా రూ.750 కోట్లు- ఖర్చువుతోంది. అత్యాధునిక సాంకేతికతతో ముందుకెళ్లాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఎన్జీఆర్ఐ సర్వేతో భూగర్భం కి.మీ దిగువ వరకు మ్యాపింగ్ చేయొచ్చన్నారు. కచ్చితమైన ప్రణాళిక కోసం లైడార్ సర్వే కూడా చేస్తాం. నాణ్యతలో రాజీపడకుండా మంత్రివర్గం ఆమో దించిన అంచనాతో ప్రాజెక్టు పనులు చేపట్టాలని మంత్రి తెలిపారు. మరోవైపు ఎస్ఎల్‌బీసీ సొరంగానికి హెలికాప్టర్‌తో మాగ్నెటిక్ జియోఫిజికల్ సర్వేకు ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. రూ.2.36 కోట్లతో నామినేషన్ పద్ధతిన ఎన్జీఆర్ఐకి పనులు అప్పగించింది. ఎస్ఎల్‌బిసి సొరంగంలో జరిగిన ప్రమాదం తర్వాత అక్కడ పనులు ఆగిపోయాయి. దీంతో ఆ పనులను పునః ప్రారంభించాలని నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి అధికారులను ఆదేశించారు. సొరంగంలో ప్రమాదం తర్వాత నిపుణుల కమిటీ- సిఫార్సులతో పనులు తిరిగి మొదలు పెట్టాలని ఉత్తమ్ అన్నారు. ముఖ్యమైన ప్రాజెక్టు 9 కి.మి పనికే ఆగిపోవడం దురదృష్టకరం. ఎస్ఎల్‌బిసి పూర్తి కాకపోవడంతో ఎత్తిపోతలకు రూ.750 కోట్లు- ఖర్చువుతోంది. అందుకే అత్యాధునిక సాంకేతికతతో ముందుకు వెళ్లాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు.

# ఐదుగురు ఎమ్మెల్యేలు టచ్‌లో ఉన్నారు

**తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు రాంచందర్ రావు**

**హైదరాబాద్, ఆగస్ట్ 8:** బీఆర్ఎస్‌కు రాజీనామా చేసిన మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజు బీజేపీలో చేరబోతున్నారు. ఇప్పటికే ఈ విషయం ప్రకటించారు. అయితే తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు రాంచందర్ రావు బాంబు పేల్చారు. బీఆర్ఎస్ పార్టీకి చెందిన ఐదుగురు ఎమ్మెల్యేలు బీజేపీలో చేరేందుకు తమతో టచ్‌లో ఉన్నారని తెలిపారు. ఆ ఎమ్మెల్యేలు ఎవరనేది త్వరలో చెబుతామన్నారు. ఆ ఎమ్మెల్యేలు.. మా పార్టీలో చేరే తేదీలు సైతం తెలియజేస్తామని చెప్పారు. శుక్రవారం హైదరాబాద్‌లో ఏబీఎన్‌తో రాష్ట్ర బీజేపీ చీఫ్ రాంచందర్ రావు మాట్లాడుతూ.. బీఆర్ఎస్ పార్టీ నాయకత్వంపై నమ్మకం లేక తమ వైపు వారు చూస్తున్నారని పేర్కొన్నారు. అయితే ఆ పార్టీ నుంచి ఐదుగురు ఎమ్మెల్యేలే కాదని.. ఆ సంఖ్య మరింత పెరిగే అవకాశముందన్నారు. ఆగస్ట్ 10వ తేదీన బీజేపీలో అచ్చంపేట మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజు చేరనున్నారని తెలిపారు. బీజేపీలో చేరికలకు ఇది ఆరంభం మాత్రమేనని స్పష్టం చేశారు. స్థానిక సంస్థల ఎన్నికల ముందు ఇలా పార్టీలో చేరే వారి సంఖ్య భారీగా పెరుగుతుందని ఆయన జోస్యం చెప్పారు. ఫోన్ ట్యాపింగ్ కేసును సీబీఐకి అప్పగిస్తేనే అసలు దోషులు బయటకు వస్తారని ఆయన అభిప్రాయపడ్డారు. ఓటమి భయంతోనే రేవంత్ రెడ్డి స్థానిక సంస్థల ఎన్నికలకు వెళ్లడం లేదన్నారు. అయితే ఓటర్ల జాబితా అంశంపై కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ చేసిన వ్యాఖ్యలు అయన అసహనానికి పరాకాష్టగా తెలంగాణ బీజేపీ చీఫ్ అభివర్ణించారు. బీసీల మీద ప్రేమ.. సీఎం రేవంత్ రెడ్డికి కొత్తగా వచ్చిందంటూ వ్యంగ్యంగా వ్యాఖ్యానించారు. ఇదిలావుంటే అచ్చంపేట బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్ రావుతో భేటీ అయ్యారు. తార్నాకలోని నివాసంలో ఆయన సమావేశమయ్యారు. ఇటీవలే గువ్వల బాలరాజు రాజీనామా చేశారు. ఈ నెల 10న ఆయన భాజపాలో చేరనున్నారు.

# సిట్ విచారణతో ఒరిగేదేమీ లేదు

- సీబీఐ విచాణతోనే దొంగలను పట్టుకునే ఛాన్స్
- ఫోన్ ట్యాపింగ్‌లో వేలకోట్ల వల
- వ్యాపార, సినీ, రాజకీయ ప్రముఖుల బ్లాక్‌మెయిల్
- ఎన్నికల్లో పట్టుబడ్డ వందలకోట్లు కెసిఆర్ ఖాతాలోకి
- భార్యాభర్తల ఫోన్లుకూడా ట్యాప్ చేసిన దుర్మార్గులు
- అత్యధికంగా నా ఫోన్ ట్యాప్ జరిగింది
- ప్రభాకర్ రావు, రాధాకిషన్ రావులకు ఉరిశిక్ష వేసినా తక్కువే
- సిట్ విచారణ అనంతరం మీడియాతో బండి సంజయ్



**హైదరాబాద్, ఆగస్టు 8:** ఫోన్ ట్యాపింగ్ కేసు విచారణను సీబీఐకి అప్పగించాలని కేంద్ర మంత్రి బండి సంజయ్ మరోమారు డిమాండ్ చేశారు. ఇందులో లోతుగా విచారణ చేసి నిజాలు నిగ్గు తేల్చాల్సి ఉందన్నారు. హైదరాబాద్‌లోని దిల్‌కుషా అతిథి గృహంలో సిట్ విచారణకు హాజరైన అనంతరం మీడియాతో ఆయన మాట్లాడారు. కేసీఆర్‌తో సీఎం రేవంత్‌రెడ్డి కుమ్మక్కయ్యారని ఆరోపించారు. అందుకే కేసీఆర్ కుటుంబానికి సీఎం క్లీన్ చిట్ ఇచ్చారని విమర్శించారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఈ సిట్‌కు అధికారాలు లేవని, విచారణతో కాలయాపన తప్ప ఇంకేం జరగదని అన్నారు. సిబిఐ విచారణకు ఎందుకు వెనకాడుతున్నారని ప్రశ్నించారు. కేసీఆర్ ప్రభుత్వంలో అత్యధికంగా నా ఫోన్ కాల్స్‌నే ట్యాప్ చేశారు. నా కుటుంబ సభ్యులు, పని మనుషుల ఫోన్లు కూడా ట్యాప్ చేశారు. భార్యాభర్తల ఫోన్లూ ట్యాప్ చేసి విన్నారు. నా వద్ద ఉన్న ఆధారాలు, సమాచారం అధికారులకు ఇచ్చాను. వాస్తవానికి మావోయిస్టులకు సంబంధించిన ఫోన్లు ట్యాప్ చేయాలి. కానీ, ఆ జాబితాలో మా పేర్లు పెట్టి ట్యాపింగ్‌కు పాల్పడ్డారు. రేవంత్‌రెడ్డి, హరీశ్‌రావు ఫోన్లు కూడా ట్యాప్ చేశారు. ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో మొదటిసారి వాంగ్మూలం ఇచ్చింది నేనే. కేసీఆర్ ప్రభుత్వం విచ్చలవిడిగా ఫోన్లు ట్యాప్ చేసింది. కేసీఆర్ కుమార్తె, అల్లుడి ఫోన్లు కూడా ట్యాప్ చేశారు. టీ-ఎస్‌పీఎస్సీ పేపర్ లీకేజీ కేసు విచారిస్తున్న హైకోర్టు జడ్జి ఫోన్ కూడా ట్యాప్ చేశారు. ప్రభాకర్‌రావు, రాధా కిషన్‌రావు బాగోతం చెబుతుంటే నాకే సిగ్గనిపించింది. వారిద్దర్నీ సమాజం క్షమించదు. ఇద్దరికీ ఉరిశిక్ష వేస్తే ఒకేసారి చనిపోతారు.. క్షణక్షణం బాధపడాలి. మా కార్యకర్తలను, ఇతర పార్టీ నాయకులను క్షోభకు గురి చేశారు. ఇద్దరు నిందితులను కాపాడే ప్రయత్నం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం చేస్తోంది. వ్యాపారుల లావాదేవీలు తెలుసుకొని కేటీఆర్ బ్లాక్‌మెయిలింగ్ చేశారని బండి అన్నారు. ఫోన్ ట్యాపింగ్ ద్వారా రూ.వేల కోట్లు దోచుకున్నారు. ఎన్నికల వేళ కాంగ్రెస్ ఖమ్మం ఎంపీ అభ్యర్థి వద్ద రూ.7 కోట్లు-పట్టుకున్నారు. ఆ డబ్బు ఏమైందో తెలియదు. చాలామంది నాయకుల వద్ద రూ.వందల కోట్లు సీజ్ చేసి పట్టుకున్నారు. పట్టుబడిన డబ్బులను కేసీఆర్, కేటీఆర్‌కు ప్రభాకర్‌రావు, రాధాకిషన్‌రావు పంపారు. రూ.20 కోట్లు దొరికితే.. కేసీఆర్, కేటీఆర్ ఫోన్ చేశాక రూ.2 కోట్లు అవుతాయి. రూ. వేల కోట్లు అక్రమాలు జరిగితే.. రేవంత్‌రెడ్డి ప్రభుత్వం చర్యలు తీసుకోదా? ఈడీకి లేఖ రాస్తే విచారణ జరుపుతుంది. సిట్ అధికారులు నిజయితీ పరులు, వారిపై మాకు అనుమానం లేదు. రేవంత్‌రెడ్డి ప్రభుత్వంపైనే మా అనుమానం అంతా. ఫోన్లు ట్యాప్ చేసినట్లు-ఆధారాలున్నా ఎంతకాలం గడుపుతారు. కమిషన్లు వేసి కాలయాపన చేస్తారు. నివేదికలు ఇచ్చినా చర్యలు లేవు. ఏడాది గడిచినా ఒక్క నాయకుడిని అరెస్టు చేయలేదని బండి సంజయ్ అన్నారు. తన ఫోన్ ట్యాపింగ్‌కు సంబంధించి సిట్ అధికారులు అందించిన వివరాలు చూసి తాను షాక్ అయినట్లు మంత్రి బండి సంజయ్ తెలిపారు. తన ఫోన్, తన కుటుంబ సభ్యులతోపాటు-తన ఓఎస్డీ, వ్యక్తిగత సిబ్బంది ఫోన్ ట్యాప్ అయినట్లు-చెప్పారు. మావోయిస్టుల జాబితాలో తమ పేర్లు పెట్టి ట్యాప్ చేశారని మండిపడ్డారు. ఈ ఫోన్ల ట్యాపింగ్ వెనుక బీఆర్ఎస చీఫ్ కేసీఆర్ పాత్ర ఉందని కుండ బద్దలు కొట్టారు. ఈ కేసును ఇంకా ఎంత కాలం సాగదీస్తారు? అంటూ రేవంత్ రెడ్డి ప్రభుత్వాన్ని సూటిగా ప్రశ్నించారు. ఈ కేసులో ఇప్పటివరకు కేసీఆర్ కుటుంబంలో ఒక్కరినైనా అరెస్టు చేశారా? అంటూ రేవంత్ రెడ్డి ప్రభుత్వాన్ని బండి సంజయ్ నిలదీశారు.

### దాదాపు రెండు గంటలపాటు

ఫోన్ ట్యాపింగ్ కేసులో శుక్రవారం ఉదయం హైదరాబాద్‌లోని సిట్ కార్యాలయంలో అధికారుల విచారణకు కేంద్ర మంత్రి బండి సంజయ్ హాజరయ్యారు. దాదాపు రెండు గంటలపాటు బండి సంజయ్‌ను సిట్ అధికారులు ప్రశ్నించారు. ఈ కేసులో సాక్షిగా బండి సంజయ్ అందించిన వాంగ్మూలాన్ని వారు రికార్డు చేశారు. అందుకు సంబంధించిన ఆధారాలను సిట్ అధికారులకు బండి సంజయ్ అందజేశారు. తెలంగాణ బీజేపీ చీఫ్ అయినప్పటి నుంచి మీ ఫోన్ ట్యాప్ అయినట్లు అధికారులు వివరించారు. అలాగే ఎవరితో ఎంత సేపు మాట్లాడారన్న డేటాను సైతం ఆయనకు వారు సాక్ష్యాలతో సహా చూపించారు. మునుగోడు, హుజూరాబాద్ ఉప ఎన్నికల సమయంలో రాజకీయ నేతలతో బండి సంజయ్ మాట్లాడిన డేటాకు సంబంధించిన వివరాలను ఆయనకు సిట్ అధికారులు ఈ సందర్భంగా అందజేశారు.

## చౌకబారు విమర్శలపై క్షమాపణలు చెప్పాలి

### బండి సంజయ్‌కు కేటీఆర్ హెచ్చరిక



**హైదరాబాద్,ఆగస్ట్8(ఆర్ఎన్ఎ):** ఫోన్ ట్యాపింగ్ కేసు వ్యవహారంలో కేంద్ర మంత్రి బండి సంజయ్ చేసిన వ్యాఖ్యలపై భారత రాష్ట్ర సమితి కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ మండిపడ్డారు. ఫోన్ ట్యాపింగ్ ఆరోపణల్లో నిజం ఉంటే నిరూపించాలని సంజయ్‌కు సవాల్ విసిరారు. లేదంటే 48 గంటల్లో వ్యాఖ్యలు ఉపసంహరించుకొని బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. లేదంటే లీగల్ నోటీసులు పంపుతానని హెచ్చరించారు. ఇంటెలిజెన్స్ విభాగంపై ఆయనకు కనీస పరిజ్ఞానం లేదని, కేంద్ర హోంశాఖ సహాయమంత్రిగా పని చేస్తున్నప్పటికీ.. ఆయనకు ఆ మాత్రం పరిజ్ఞానం లేకపోవడం విచారకరమని అన్నారు. ఎక్స్ వేదికగా కేటీఆర్ స్పందిస్తూ.. ఇంటెలిజెన్స్ విభాగం ఎలా పని చేస్తుందో సంజయ్ అర్థం చేసుకోలేరు. నిర్లక్ష్యంతో ఆయన చేసిన ప్రకటనలు హద్దు మీరాయి. చౌకబారు ఆరోపణలతో ఆయన మరింత దిగజారారు. రాజకీయ ఉనికి కోసం రోడ్లపై చౌకబారు నాటకాన్ని ఎంచుకున్నారని విమర్శించారు.

## అలహాబాద్ హైకోర్టు న్యాయమూర్తికి ఊరట

### నిషేధిత ఉత్తర్వులను వెనక్కి తీసుకున్న సుప్రీం



**న్యూఢిల్లీ, ఆగస్ట్ 8:** అలహాబాద్ హైకోర్టు న్యాయమూర్తికి ఊరట దక్కింది. గంతలో విధించిన నిషేధ ఉత్తర్వులను సుప్రీం వెనక్కు తీసుకుంది. హైకోర్టు జడ్జిపై ఆంక్షల విషయంలో గతంలో వెలువరించిన ఉత్తర్వులను సుప్రీంకోర్టు ఉపసంహరించుకుంది. అలహాబాద్ హైకోర్టుకు చెందిన ఓ న్యాయమూర్తి రిటైరయ్యేంతవరకూ ఆయనకు క్రిమినల్ కేసులు అప్పగించకూడదని ఆంక్షలు విధిస్తూ ఈ నెల 4న వెలువరించిన ఉత్తర్వులను ఉప సంహరించుకుంటు న్నట్లు పేర్కొంది. సీజేఐ జస్టిస్ బీఆర్ గవాయ్ అభ్యర్థన మేరకు న్యాయమూ ర్తులు జస్టిస్ జేబీ పార్ధివాలా, జస్టిస్ ఆర్.మహదేవన్‌లతో కూడిన ధర్మాసనం దీనిని వెనక్కి తీసుకున్నట్లు తెలుస్తోంది. ఈ కేసు విషయంలో తీర్పును పునఃపరిశీలించాలని కోరుతూ భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ గవాయ్ నుంచి తమకు లేఖ అందిందని ధర్మాసనం పేర్కొంది. సంబంధిత న్యాయమూ ర్తికి ఇబ్బందులు కలిగించడం తమ ఉద్దేశం కాదని.. అయితే కొన్ని విషయాల్లో పరిమితులు దాటినప్పుడు న్యాయవ్యవస్థ గౌరవాన్ని కాపాడటమే కోర్టు పనిచే స్తుందని జస్టిస్ పార్ధివాలా పేర్కొన్నారు. అంతకు ముందు ఇచ్చిన ఉత్తర్వులను వెనక్కి తీసుకున్నప్పటికీ అలహాబాద్ హైకోర్టు తీర్పు చట్టవిరుద్ధమని ఆందోళన వ్యక్తంచేశారు. న్యాయవ్యవస్థపై ప్రజల విశ్వాసాన్ని దెబ్బతీసే ఇటువంటి ఆదేశాలను విస్మరించలేమని స్పష్టం చేశారు. ఒక సివిల్ వివాదంలో క్రిమినల్ చర్యలకు అనుమతినిస్తూ అలహాబాద్ హైకోర్టుకు చెందిన ఓ న్యాయమూర్తి ఇటీవల జారీచేసిన ఆదేశాలకు సంబంధించిన కేసులో రి-టైరయ్యేంత వరకూ ఆయనకు ఎలాంటి క్రిమినల్ కేసులు అప్పగించవద్దని ఈనెల 4న సుప్రీం ధర్మాసనం ఆదేశించింది. ఈ వ్యవహారంలో సుప్రీంకోర్టు ఆదేశంలోని కొన్ని అంశాలు అమలుకాకుండా నిరోధించేందుకు ఫుల్ కోర్టును సమావేశపర చాలని అలహాబాద్ హైకోర్టుకు చెందిన 13 మంది న్యాయమూ ర్తులు గురు వారం అలహాబాద్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తికి ఒక లేఖ రాశారు. హైకోర్టులపై పాలనాపరమైన పర్యవేక్షణ అధికారం సుప్రీంకోర్టుకు లేదని, అం దుకే ఆగస్టు 4నాటి సుప్రీం ఆదేశాల్లో 24వ, 26వ పేరాల్లోని నిర్దేశాలను అమలు చేయరాదని ఫుల్‌కోర్టు తీర్మానించాలని జడ్జీలు కోరారు. ఈ నేపథ్యంలో 'సుప్రీం' తన ఉత్తర్వులను వెనక్కి తీసుకుంది.

## అలీబాబా.. 40 దొంగలు

### కేసీఆర్ కుటుంబానికి ఇది సరిపోతుంది

### కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి



**హైదరాబాద్, ఆగస్ట్ 8:** తెలంగాణ రాష్ట్రాన్ని కేసీఆర్ అడ్డంగా దోచుకున్నారని కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి మండిపడ్డారు. ఎంత దొరికితే అంత దోచుకున్నారని విమర్శించారు. అప్పులుల తెచ్చి అప్పుల్లోనూ కమిషన్లు దండుకున్న ఫ్యామిలీ వారిదని మండిపడ్డారు. శుక్రవారం గాంధీభవన్‌లో జగ్గారెడ్డి విలేకర్లతో మాట్లాడుతూ.. ఇంకా చెప్పాలంటే అంచనా వేయలేనంతగా రాష్ట్రాన్ని దోచి పడేశారని తెలిపారు. అవినీతి ఎలా చేయాలో అనే యూనివర్సిటీకి కేసీఆర్ ప్రొఫెసర్ అని అభివర్ణించారు. రాష్ట్ర ప్రజల ఖజానా దోచుకోవడంలో కేసీఆర్ ఫ్యామిలీ దిట్ట అని పేర్కొన్నారు. రాష్ట్రాన్ని అడ్డగోలుగా దోచుకొని.. సుద్దపూసలాగా.. నంగనాచి మాటలు మాట్లాడుతున్నారని కేసీఆర్ ఫ్యామిలీపై నిప్పులు చెరిగారు. అలీబాబా నలభై దొంగలు అనే -టైటిల్ కేసీఆర్ ఫ్యామిలీకి కరెక్ట్ సెట్ అవుతుందని స్పష్టం చేశారు. వారు స్థాపించిన పార్టీలోని కొత్త ప్రభాకర్ సుద్దపూసలాగా మాట్లాడుతున్నాడని చెప్పారు. ప్రజలకి ఏమైనా చేద్దామంటే ఖజానాలో మిగుల్చకుండా దోచుకొని పోయారంటూ కేసీఆర్ ఫ్యామిలీపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇదిలావుంటే బీఆర్ఎస్ నేత, దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డిపై జగ్గారెడ్డి మరోసారి నిప్పులు చెరిగారు. నువ్వు నా క్యారెక్టర్ అంచనా వేయలేవంటూ కొత్త ప్రభాకర్ రెడ్డికి సూచించారు. రాష్ట్రంలో ఎవర్ని అడిగినా నా క్యారెక్టర్ గురించి చెబుతారన్నారు. నా క్యారెక్టర్‌కి, ప్రభాకర్ రెడ్డి క్యారెక్టర్‌కి చాలా తేడా ఉంటు-ందని పేర్కొన్నారు. ప్రభాకర్ రెడ్డికి ఉన్నంత ఆస్తి నా వద్ద ఉంటే ప్రజలకి ఎప్పుడో పంచేసే వాడినని తెలిపారు. పంచే గుణం మా అమ్మనాన్న నాకు ఇచ్చిన ఆస్తి అని చెప్పారు. భవిష్యత్తులో నేను రూ. వేల కోట్లు- సంపాదించినా వాటిని ప్రజలకే పంచుతానని ఈ సందర్భంగా ఆయన స్పష్టం చేశారు. నా ఆస్తి నా పిల్లల కోసం కాదని.. ప్రజల కోసమని తెలిపారు. రూ. 1000 కోట్లు కొన్ని గంటల్లోనే పంచేస్తానన్నారు. ప్రభాకర్ రెడ్డికి ఎలా పంచాలో కూడా తెలియదని ఆక్షేపించారు. నేను ఎలాంటి వాడినో కేసీఆర్, హరీష్ రావుని అడిగి తెలుసుకోవాలంటూ ప్రభాకర్ రెడ్డికి సూచించారు. కొత్త ప్రభాకర్ రెడ్డి.. నీవు మగాడవయితే నా ప్రశ్నలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ప్రభాకర్ రెడ్డిది నా స్థాయి కాదన్నారు. కొన్ని విషయాల్లో ఎమోషనల్ కావ్వడం నా బలహీనత అని తెలిపారు. ప్రజల సమస్య వింటే వాళ్ళ కంటే ముందు నాకే ఏడుపు వస్తుందన్నారు. నా చుట్టూ పేదలు ఉంటారని.. నా వద్దకు క్యాన్సర్ పేషెంట్లు సైతం వస్తారని చెప్పారు. నేనేమైనా ప్యాకేజీల లీడర్ నా అంటూ బీఆర్ఎస్ నేతలను ఈ సందర్భంగా జగ్గారెడ్డి సూటిగా ప్రశ్నించారు. నేనేమి బీ ఫారంలు కొనుకొని రాలేదని వ్యంగ్యంగా అన్నారు. దొంగతనాలు మీరు చేసి.. మాపై నిందలు వేస్తారా? అంటూ బీఆర్ఎస్ నేతలను ఆయన సూటిగా ప్రశ్నించారు. కాంగ్రెస్ పార్టీ మీలాగా ప్రైవేట్ కంపెనీనా? అని వారిని నిలదీశారు. ఇసుక దందాలలో మీరు సంపాదించింది ఎంత? అంటూ ఆ పార్టీ నేతలను ఆయన ప్రశ్నించారు. హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లోని భూములు, చెరువులు కబ్జా చేసింది బీఆర్ఎస్ నాయకులేనని ఈ సందర్భంగా ఆయన స్పష్టం చేశారు.



## రేపు బీజేపీలో చేరుతున్నా: గువ్వల

**హైదరాబాద్,ఆగస్ట్8(ఆర్ఎన్ఎ):** బీజేపీ సిద్ధాంతం, లక్ష్యం నచ్చే ఆ పార్టీలో చేరనున్నట్లు బిఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజు తెలిపారు. బీజేపీ రాష్ట్ర కార్యాలయానికి వెళ్లిన ఆయన ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావుతో భేటీ అయ్యారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. ఆదివారం(ఆగస్టు 10న) బీజేపీ రాష్ట్ర చీఫ్ రామచందర్‌రావు సమక్షంలో తాను ఒక్కడినే ఆ పార్టీలో చేరుతానని చెప్పారు. అచ్చంపేటలో ఎవరు ఎన్ని సభలు, సమావేశాలు పెట్టుకున్న తనని ఏమీ చేయలేరని వ్యాఖ్యానించారు. బీజేపీలో గువ్వల చేరికను రాంచందర్ రావు అధికారికంగా ప్రకటించారు. గువ్వల ఈ నెల 10వ తేదీన కమలం పార్టీలో చేరనున్నారు. ఆయనతో పాటు మరికొంతమంది బీఆర్ఎస్ నాయకులు కూడా బీజేపీలో చేరే అవకాశం కనిపిస్తోంది. బీఆర్ఎస్‌ను గువ్వల బాలరాజు వీడిన తర్వాత ఆ పార్టీపై సంచలన ఆరోపణలు చేశారు. తనను చంపుతానంటూ వేలాది ఫోన్లు వచ్చాయని, ఇంత జరిగినా బీఆర్ఎస్‌లో ఎవ్వరూ తనను పట్టించుకోలేదని బాలరాజు ఆవేదన వ్యక్తం చేశారు. ఫామ్ హౌస్ కేసులో వంద కోట్లకు అమ్ముడు పోయానంటూ తనపై అబాండాలు మోపారని చెప్పారు. బీఆర్ఎస్ పార్టీ ఆదేశాల ప్రకారమే తనకు ఇచ్చిన రోల్‌ను ఫాంహౌస్‌లో పోషించానని, ఆ విషయం పార్టీ పెద్దలకూ తెలుసని వెల్లడించారు.

## ప్రైవేట్ డ్రైవర్లనూ వదలని సర్కార్

### బీమా ఎగ్గొట్టారని మండిపడ్డ కేటీఆర్



**హైదరాబాద్, ఆగస్ట్ 8:** కేవలం 20 నెలల్లోనే అన్ని వర్గాలను వంచించిన దగాకోరు రేవంత్ సర్కార్.. ప్రైవేట్ రంగంలోని డ్రైవర్లను సైతం నట్టేట ముంచిందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మండిపడ్డారు. ఎన్నికల ముందు అసంఘటితరంగ కార్మికులకు, గిగ్ వర్కర్లకు అరచేతిలో వైకుంఠం చూపించిన రేవంత్.. గద్దెనెక్కాక ఉన్న పథకాన్ని కూడా ఊడగొట్టాడు! అని ధ్వజమెత్తారు. మహోదాత్త హృదయంతో, మానవీయ కోణంతో కేసీఆర్ ప్రభుత్వం ప్రారంభించిన డ్రైవర్లకు రూ. 5 లక్షల ప్రమాద బీమా పథకానికి ఇన్స్యూరెన్స్ ప్రీమియం ఎగ్గొట్టి, కాంగ్రెస్ ప్రభుత్వం బంద్ పెట్టింది.. నిరుపేద డ్రైవర్ల కుటు-ంబాలకు క్షోభను మిగిల్చింది అని కేటీ-ఆర్ ఆవేదన వ్యక్తం చేశారు. 2024 అక్టోబర్ నుండి పథకాన్ని ఆపేసి.. ప్రమాదవశాత్తు మరణించిన డ్రైవర్ల కుటు-ంబాలను రేవంత్ రోడ్డున పడేశాడు అని కేటీ-ఆర్ పేర్కొన్నారు. రైతు బీమా, నేతన్నకు బీమా, డ్రైవర్లకు బీమా వంటి ఎన్నో పథకాలతో సబ్బండ వర్ణాల ప్రజల భవిష్యత్తుకు కేసీఆర్ ధీమా అందిస్తే.. ఒక్కో పథకానికి మంగళం పాడి పేద కుటు-ంబాల భవిష్యత్తును అగమ్యగోచరంగా మారుస్తోంది ఈ కర్కశ కాంగ్రెస్ ప్రభుత్వం. రూ. 5 లక్షల ప్రమాద బీమా పథకాన్ని తిరిగి ప్రారంభించాలని, పెండింగ్ క్లెయిమ్‌లను వెంటనే సెటిల్ చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నాం.. లేకుంటే డ్రైవర్ల పక్షాన పెద్ద ఎత్తున ఆందోళన చేపట్టి, ఈ అమానవీయ సర్కార్ మెడలు వంచుతామని కేటీ-ఆర్ హెచ్చరించారు.

## మెడిసిటీ కళాశాలలో గంజాయి కేసు

### విద్యార్థులు గంజాయి అమ్ముతున్నట్లు గుర్తింపు



**మేడ్చల్, ఆగస్ట్ 8:** వైద్య విద్యార్థులు కూడా గంజాయి మత్తులో పడ్డారు. ఏకంగా సీనియర్లు అమ్మడం, జూనియర్లు దానికి అలవాటు పడడం జరిగింది. మేడ్చల్ మెడిసిటీ మెడికల్ కళాశాలలో గంజాయి కేసులో కొత్తకోణం బయటపడింది. మూడేళ్లుగా కాలేజీలో చదువు తున్న వైద్య విద్యార్థులు కూడా గంజాయిని విక్రయిస్తున్నట్లు విచారణలో తేలిందని హైద రాబాద్ యాంటీ నార్కోటిక్స్ బ్యూరో పోలీస్ అధికారులు తెలిపారు. డ్రగ్స్‌పై ఈగల్ పోలీ సులు నిర్వహిస్తున్న ఆపరేషన్‌లో మెడిసిటీ వైద్య విద్యార్థులు గంజాయి తీసుకున్నట్లు గురువారం పోలీసులు గుర్తించారు. డ్రగ్స్ టెస్టులో గంజాయి పాజిటివ్ వచ్చిన పలువురు విద్యార్థుల్ని డీ-అడిక్షన్ సెంటర్‌కు పంపించారు. ఈ కేసులో దర్యాప్తు చేపట్టిన ఏఎన్‌బీ అధికారులకు మరిన్ని విషయాలు తెలిశాయి. సీనియర్ విద్యార్థులే జూనియర్లకు గంజాయి అలవాటు చేశారని, వారే వాటిని విక్రయించినట్లు గుర్తించారు. వైద్య విద్యార్థులకు గంజాయి విక్రయించిన డ్రగ్ పెడ్లర్ బొల్లారానికి చెందిన హరాఫత్ అలీఖాన్‌ను అరెస్టు చేసినట్లు తెలిపారు. నిందితుడు అలీఖాన్ బీదర్‌కు చెందిన జరీనా బాను నుంచి గంజాయిని కొనుగోలు చేసి.. వైద్య విద్యార్థులకు అమ్ముతున్నట్లు పోలీసులు చెప్పారు.

## పిడుగుపాటుకు ఎత్తిపోతల పైపులైన్ దిమ్మెలు నేలమట్టం

**నాగర్‌కర్నూల్, ఆగస్ట్ 8:** కొల్లాపూర్ నియోజకవర్గం, పెంట్లవెల్లి మండల పరిధిలోని మెరుపులు ఉరుములతో కూడిన వర్షానికి పిడుగు పడింది. పిడుగుపాటుకు ఎంగంపల్లి తండా గ్రామ సమీపంలో కృష్ణానది తీరాన నిర్మించిన ఎత్తిపోతల పథకం పైపులైన్ దిమ్మెలు నేలమట్టం అయ్యాయి. ఈ మినీ ఎత్తిపోతల పథకాన్ని 1994లో నిర్మించారు. దీని ద్వారా ఎంగంపల్లి తండా మల్లేశ్వరం మంచాలకట్ట కొన్ని గ్రామాలకు దాదాపుగా 650 ఎకరాలకు సాగునీరు సరఫరా జరిగేది. ఎత్తిపోతల పథకం నిర్మించిన మొదలు కొన్నేళ్లపాటు- ఉపయోగంలో ఉన్నా చాలాకాలం నుంచి మోటార్లు రిపేరు అయ్యాయనే నెపంతో నిరుపయోగంగా మారి శిథిలావ్యవస్థకు చేరింది. దీనిని మరమ్మతులు చేపట్టి, మళ్లీ ఉపయోగంలోకి తీసుకురావాలని రైతులు ఎంతో కాలం నుంచి కోరుతునన్నారు. కృష్ణానది చెంతన ఉన్న సాగుకు నీరు అందక రైతులు మాజీ ఎంఎల్‌లకు, ప్రస్తుత మంత్రి జూపల్లి కృష్ణారావుకి వినతిపత్రాలు ఇచ్చినా పట్టించుకోకపోవడంతో ఎత్తిపోతలపై రైతన్నలు ఆశలు వదులుకున్నారు.

## సంపాదకీయం



# ట్రంప్ పరితననంను ఎదురించాల్సిందే!

అమెరికా అధ్యక్షుడు ట్రంప్ హద్దుమీరి ప్రవర్తిస్తున్న తీరు మరోమారు ప్రపంచ వ్యాప్తంగా నిరసనలు వ్యక్తం అవుతున్నాయి. ఏ దేశం ఎవరితో దోస్తానా చేయాలో..ఎవరితో వాణిజ్యం చేయాలో అన్న ఆంక్షలు విధించే హక్కు ట్రంప్‌కు ఎక్కడిదని ప్రశ్నించాలి. ఈ విషయంలో మోడీ దేశ సార్వభౌమాధికారాన్ని నిలబెట్టాలి. ట్రంప్ ఆంక్షలను అంగీకరించేది లేదని గట్టిగానే చెప్పాలి. చర్చలు జరిపేది లేదంటున్న ట్రంప్‌తో మనం కూడా అంతే మొండి వైఖరితో ఉండాలి. 140 కోట్ల జనాభా ఉన్న భారత్‌తో పెట్టుకుంటే ఏమవుతుందో చెప్పగలగాలి. ఒకవైపు మనపై వాణిజ్య ఆంక్షలు విధిస్తూ..మరోవైపు పాక్‌ను దువ్వుతున్న తీరు అమెరికా ద్వంద్వ నీతిని తెలియ చేస్తోంది. రష్యా నుంచి చమురు కొనుగోలు చేస్తున్న భారత్‌పై అమెరికా విధించిన అదనపు సుంకాలు తీవ్ర దుమారం రేపుతున్న వేళ ట్రంప్ ఏ మాత్రం తగ్గేది లేదన్నట్లుగా వ్యవహరిస్తున్నారు. ఈ విషయంలో రెండు దేశాల మధ్య ఓ రకంగా విభేదాలు పొడసూపినట్లుగానే భావించాలి. ట్రంప్ ఏకపక్ష నిర్ణయాలు భారత్‌కు పరీక్షగా మారాయి. ఈక్రమంలో మోడీ కూడా మనదేశ సార్వభౌమాధికారాన్ని కాపాడుకుంటూనే ముందుకు సాగాలి. ప్రపంచంలోనే అత్యధిక సుంకాలను తమపై విధించడంతో భారత్ దీటుగా స్పందించింది. తమ దేశంలోని రైతులు, మత్స్యకారులు, పాల ఉత్పత్తుల రంగంలోని వారి ప్రయోజనాలే ముఖ్యమని స్పష్టం చేసింది. అవసరమైతే ఆ భారాన్ని తామే భరిస్తామని వెల్లడించింది. మరోవైపు భారత్‌పై మరిన్ని ఆంక్షలను విధిస్తామని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రకటించారు. ఇక ఆయన విధించిన సుంకాలు గురువారం నుంచి అమల్లోకి వచ్చాయి. దీనివల్ల అమెరికాలో కొన్నింటి ధరలు పెరగనున్నాయి. అయితే, అమెరికా అదనపు సుంకాల వల్ల రెండు దేశాల మధ్య తలెత్తిన వివాదం తాత్కాలికమేనని, త్వరలోనే సమసిపోతుందని ప్రవాస భారతీయ సంఘాలు అభిప్రాయపడుతున్నాయి. చర్చలు ఫలించి త్వరలో ఒప్పందం కుదరనుందనే ఆశాభావం వ్యక్తం చేశాయి. 50 లక్షల మంది ప్రవాస భారతీయులు అమెరికా అభివృద్ధిలో భాగస్వాములుగా ఉన్నారని పేర్కొన్నారు. భారతీయ ఉత్పత్తులపై 50శాతం సుంకాలను వేయడాన్ని ఇండియన్-అమెరికన్ల నేత, బైడెన్ మాజీ సలహాదారు అజయ్ భుటోరియా ఖండించారు. 'అమెరికాలో తక్కువ ధరలకు లభించే 50శాతం జనరిక్ మందులను భారత్ సరఫరా చేస్తోంది. ఈ సుంకాలు వాటి ధరలను పెంచుతాయి. దీనివల్ల అమెరికాలోని కుటుంబాలు, సీనియర్ సిటిజన్లు, చిన్న వ్యాపారులు ఇబ్బందులు పడతారు. మసాలా దినుసులు, పప్పులు, దీపావళి దుస్తుల ధరలు పెరుగుతాయని పేర్కొన్నారు. దుస్తులు, పాదరక్షల ధరలు 37శాతం దాకా పెరగవచ్చని అభిప్రాయపడ్డారు. ఇది ఎలా ఉన్నా మనం కూడా తగ్గేదేలా లేదన్నట్లుగా వ్యవహ రించాలి. కాంగ్రెస్ ఎంపి శశిథరూర్ ఇదే విషయాన్ని గుర్తుచేశారు.. ట్రంప్ విధించిన అదనపు సుంకాలపై ప్రధాని మోదీ గట్టిగా సమాధానమిచ్చారు. తమ రైతుల ప్రయోజనాల విషయంలో ఎప్పటికీ రాజీ పడబోమని, దానికి ఎంత మూల్యమైనా చెల్లించడానికి సిద్ధంగా ఉన్నామని స్పష్టం చేశారు. రైతుల ప్రయోజనాలే మాకు అత్యంత ముఖ్యం. రైతులు, మత్స్యకారులు, డెయిరీ ఉత్పత్తిదారుల ప్రయోజనాల విషయంలో భారత్ ఎప్పటికీ రాజీ పడబోదు. వారిని కాపాడటం కోసం సుంకాల భారాన్ని సొంతగా భరించడానికీ సిద్ధం అని ప్రధాని స్పష్టం చేశారు. రష్యా నుంచి చమురు కొంటుందన్న కారణంతో భారత్‌పై 50శాతం సుంకాలను విధించిన అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్.. మరో బాంబు పేల్చారు. తదుపరి మరిన్ని ఆంక్షలను చూస్తారంటూ హెచ్చరించారు. శ్వేతసౌధంలోని ఓవల్ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. 'భారత్‌పై మేం 50శాతం సుంకాలను విధించిన విషయం మీకు తెలుసు. ఆ దేశం రష్యా నుంచి చమురు దిగుమతి చేసుకునే దేశాల్లో రెండో స్థానంలో ఉంది. తొలిస్థానంలో ఉన్న చైనాకు అతి దగ్గరగా ఉంది. అందుకే భవిష్యత్తులో మరిన్ని ఆంక్షలను చూడబోతున్నారని పేర్కొన్నారు. ట్రంప్ తీరు చూస్తుంటే పిచ్చోడి చేతిలో రాయిలా ఉంది. తన వైఖరిని నెగ్గించుకోవడమే ఆయనకు ముఖ్యంగా ఉంది. ఎలన్ మస్క్ లాంటి వారినే దూరం పెట్టిన ట్రంప్‌కు భారత్ ప్రయోజనాలు ముఖ్యం కాదు. ఇకపోతే ఆపరేషన్ సింధూర్ తరవాత భారత్ సైనికంగా బలపడడంతో కూడా ట్రంప్ తట్టుకోవడం లేదని తెలుస్తోంది. ఇది కూడా ట్రంప్ వైఖరికి కారణం కావచ్చని వశ్లేషిస్తున్నారు. భారత్‌పై గతంలో విధించిన 25శాతం సుంకాలు గురువారం నుంచి అమల్లోకి వచ్చాయి. అదనంగా విధించిన మరో 25శాతం ఈ నెల 27వ తేదీ నుంచి అమల్లోకి వస్తాయి. మన దేశంతోపాటు అనేక దేశాలపై సుంకాలు గురువారం నుంచే అమల్లోకి వచ్చాయి. దీనివల్ల బిలియన్ల కొద్దీ డాలర్లు అమెరికాకు వస్తాయని ట్రంప్ ప్రకటించారు. ఈ సుంకాలు 10శాతం నుంచి 50శాతం దాకా ఉన్నాయి. మోడీ అధికారంలోకి వచ్చిన తరవాత గత పదకొండేళ్లుగా ఇలా ఎప్పుడూ జరగలేదు. అవినీతిరహితంగా పాలన సాగుతుందన్న పేరు వచ్చింది. అలాగే సాహసోపేత నిర్ణయాలు కూడా తీసుకుని సత్తా చాటింది. అయోధ్య, కాశ్మీర్, ట్రిపుల్ తలాక్ విషాయల్లో సాహసోపేత నిర్ణయాలు తీసుకున్నారు. ఇటీవల ఆపరేషన్ సిందూర్ ద్వారా మన సైనిక సత్తా చాటాం. పాక్‌కు గట్టిగా బుద్ది చెప్పాం. ప్రపంచవ్యాప్తంగా భారత్చర్యలకు గట్టి మద్దతు లభించింది. మోడీ సర్కార్ సాహస నిర్ణయాలకు వెనకాడదని రుజువు చేసుకుంది. సర్జికల్ స్ట్రయిక్స్ తరవాత, ఆపరేషన్ సిందూర్తరవాత కూడా పాక్ వైఖరిలో మార్పు రాలేదు. దాయాది దేశాన్ని ప్రపంచంలో దోషిగా నిలబెట్టిన ఘనత మోడీదే అని చెప్పక తప్పదు. ట్రంప్ విషయంలో ఏ నిర్ణయం తీసుకుంటారో అని దేశం ఆసక్తిగా ఎదురు చూస్తోంది. ఈ క్రమంలో భారత్ తన సార్వభౌమాధికరం ముఖ్యమని చాటి చెప్పాలి.

# ఉజ్వల్ యోజనకు సబ్సిడీ కొనసాగింపు

- చమురు కంపనీలకుకు 30 వేల కోట్ల సబ్సిడీ చెల్లింపు
- కేంద్ర కేబినేట్ కీలక నిర్ణయం



**న్యూఢిల్లీ, ఆగస్ట్ 8 :** ప్రధాని నరేంద్రమోదీ ఆధ్వర్యంలో కేంద్ర కేబినెట్ కీలక నిర్ణయాలు తీసుకుంది. ప్రభుత్వ రంగ చమురు మార్కెటింగ్ కంపనీలకుకు 30 వేల కోట్ల సబ్సిడీని కేంద్ర కేబినెట్ ఆమోదించింది. దేశీయ ఎల్ పీజీ అమ్మకాలపై కంపెనీలకు కలిగే నష్టాలను భర్తీ చేయడానికి ఈ సబ్సిడీని ఉద్దేశించారు. దీనిని 12 భాగాలుగా చెల్లిస్తారు. 2025-26 ఆర్థికసంవత్సరానికి ప్రధాన మంత్రి ఉజ్వల యోజన వినియోగదారులకు రూ. 12 వేల సబ్సీడీని కొనసాగించడానికి కేబినెట్ ఆమోదం తెలిపింది. భారతదేశం అంతటా శుభ్రమైన వంట గ్యాస్ నిరంతరం వినియోగించుకునేలా ప్రోత్సహించడం ద్వారా లబ్దిదారులకు ఎల్ పిజి కనెక్షన్లు మరింత చౌకగా అందించడమే ఈ సబ్సిడీ లక్ష్యం. మూడు ప్రభుత్వ రంగ చమురు మార్కెటింగ్ కంపెనీలకు సబ్సిడీలను అందించనున్నట్లు- పెట్రోలియం, సహజవాయ- ౦వు మంత్రిత్వశాఖ తెలిపింది. ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ (ఐఓసిఎల్) భారత పెట్రోలియం కార్పొరేషన్ (బిపిసిఎల్) హిందుస్తాన్ పెట్రోలియం కార్పొరేషన్ ( హెచ్ పిసిఎల్) మధ్య పంపిణీ చేస్తుంది. అంతర్జాతీయంగా చమురు ధరల్లో మార్పుల నుంచి వినియోగదారులకు రక్షణ కల్పించడడం, ప్రభుత్వ రంగ చమురు కంపెనీలకు మద్దతు ఇవ్వడం ఈ నిర్ణయం లక్ష్యం అని కేబినెట్ సమావేశం అనంతరం కేంద్రమంత్రి అశ్వినీ వైష్ణవ్ వెల్లడించారు. చమురు, గ్యాస్ రంగాల్లో అనిశ్చితి కారణంగా ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకున్నట్లు- తెలిపారు. మధ్యతరగతికి వంటగ్యాస్ అందుబాటులో ఉండేలా చూడడం కోసం, రూ.30 వేల కోట్ల సబ్సిడీ ఆమోదించినట్లు- తెలిపారు అశ్విని వైష్ణవ్ .ప్రధాన్ మంత్రి ఉజ్వల్ యోజన (పిఎంయువై) 2016 మే లో ప్రారంభమైంది. భారతదేశం అంతటా ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాలు, వయోజన మహిళలకు డిపాజిట్ లు లేకుండా ఎల్ పిజి కనెక్షన్లు ఇవ్వడం లక్ష్యంగా సాగుతోంది. 2025 జూలై 1 నాటికి దేశవ్యాప్తంగా 10కోట్ల 33 లక్షల ఎంఎంయువై కనెక్షన్లు పంపిణీ చేశారు. ఉజ్వల యోజన సబ్సిడీ కొనసాగించడం వల్ల వినియోగదారుడు ఎటు-వంటి డిపాజిట్ లేకుండానే ఎల్ పిజి కనెక్షన్ అందుకుంటాడు. అంతేకాదు, సిలెండర్, ప్రెషర్ రెగ్యులేటర్, సేఫ్టీ హోస్, డమెస్టిక్ గ్యాస్ కన్స్యూమర్ కార్డు బుక్ లెట్ అందించడంతో పాటు- ఇన్‌స్టలేషన్ చార్జీలకోసం సెక్యూరిటీ- డిపాజిట్ ను కవర్ చేస్తుంది. ఉజ్వల 2.0 పథకం కింద వినియోగదారుడు తన మొదటి స్టవ్, రీఫిల్ కూడా ఉచితంగా పొందుతారు. అంతర్జాతీయ ఎల్ పిజి ధరల అస్థిరత నుంచి ఉజ్వల్ యోజన వినియోగదారులను కాపాడేందుకు, క్రమబద్దీకరించి ప్రోత్సహించేందుకు ప్రభుత్వం 2022 మేలో లక్ష సబ్సిడీని ప్రవేశపెట్టింది. సంవత్సరానికి 12 రీఫిల్ లకు 14.2 కిలోల సిలెండన్ ను కేవలం 200 రూపాయలకే అందిస్తుంది. ఈ సబ్సిడీని 2023 అక్టోబర్ లో రూ.300 కు పెంచారు. ఉజ్వల యోజన లబ్దిదారులలో ఎల్ పిజి సగటు- తలసరి వినియోగం (పిసిసి) క్రమంగా పెరిగింది. 2019-20లో మూడు రీఫిళ్లనుంచి 2022.23లో సగటు- వినియోగం 3.68 కి పెరిగింది. 2024-25లో సుమారు 4.47 రీఫిల్ లకు చేరింది. ఇది వంటగ్యాస్ వినియోగంలో మహిళలు చూపుతున్న శ్రద్ధను ప్రతిబింబిస్తోంది.

# బీజేపీకి తొత్తుగా ఎన్నికల సంఘం

- ఓట్ల దొంగతనానికి ఈసీ సహకారం
- తన ఆరోపణలపై ఎందుకు మౌనం
- వెంటనే ప్రజలకు నిజాలు వెల్లడించాలి
- బెంగళూరు సమావేశంలో రాహుల్ తీవ్ర విమర్శలు



**బెంగళూరు, ఆగస్ట్ 8:** ఎన్నికల సంఘం తన బాధ్యతల్ని విస్మరిస్తోందని, రాజ్యాంగాన్ని గౌరవించాల్సిన సంస్థ ఇప్పుడు బీజేపీకి అనుకూలంగా పనిచేస్తోందని కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ తీవ్ర ఆరోపణలు చేశారు. ఓట్లను దొంగిలించేందుకు ఎన్నికల సంఘం సహకరిస్తోందని ఆయన విమర్శించారు. బెంగళూరులోని ఫ్రీడమ్ పార్క్‌లో జరిగిన బహిరంగ సభలో ఆయన మాట్లాడుతూ శుక్రవారం మరోసారి ఎన్నికల సంఘాన్ని తీవ్రంగా విమర్శించారు. ప్రజాస్వామ్యాన్ని రక్షించాలంటే ప్రజలు చైతన్యంతో ఉండాలని, ఈ ఎన్నికల్లో న్యాయం నిలవాలంటే అధికార యంత్రాంగం కక్ష సాధింపులు చేయకుండా వ్యవహరించాలంటూ రాహుల్ గాంధీ హితవు పలికారు. అంతేకాదు, కర్ణాటకతో పాటు ఇతర రాష్ట్రాల్లో కూడా ఇలాంటి మోసాలు జరుగుతున్నాయని ఆయన హెచ్చరించారు. ఈ క్రమంలో మీరు రాజ్యాంగాన్ని తాకాలని అనుకుంటే, ఒకసారి ఆలోచించాలని సూచించారు. ఈ విషయంలో మీరు ఎంత తెలివిగా దాక్కున్నా, మేము మిమ్మల్ని పట్టుకుంటామన్నారు. ఇందుకు కొంచెం సమయం పట్టొచ్చు, కానీ, తప్పకుండా పట్టుకుంటామని రాహుల్ గాంధీ ఎన్నికల సంఘానికి వార్నింగ్ ఇచ్చారు. ఎన్నికలు దేశ గుండె చప్పుడని, అలాంటి క్రమంలో ఒక్క ఓటు దొంగిలించబడినా అది జనాభా గొంతును నొక్కేయడమేనని వ్యాఖ్యానించారు. కర్ణాటకలో ఇలాంటి ఘటనలు జరిగితే, అది రాష్ట్ర ప్రజలకు మాత్రమే కాదు, దేశ వ్యాప్తంగా డెమాక్రసీకి సవాల్‌గా మారుతుందన్నారు. నిజంగానే ఎన్నికల సంఘం ఎవరి పక్షం వైపు ఉందని ప్రశ్నలు పలువురిలో వచ్చే అవకాశం ఉంది. ఇది ఒక్క కర్ణాటక సమస్య మాత్రమే కాదు. దేశవ్యాప్తంగా ఎన్నికల సమగ్రత గురించి చర్చకు దారితీస్తుంది. కానీ, రాహుల్ గాంధీ ఇక్కడితో ఆగలేదు. ఆయన రాజ్యాంగాన్ని కాపాడే బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని, దాన్ని కాపాడటానికి తాము ఎంతకైనా సిద్ధమని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా కేంద్ర ఎన్నికల సంఘానికి రాహుల్ గాంధీ ఐదు ప్రశ్నలు సంధించారు. డిజిటల్ ఓటర్ల జాబితాను ఎందుకు దాచి పెడుతున్నారు?. సీసీ పుటేజీని ఎందుకుఎవరి ఆదేశాలతో తొలగిస్తున్నారు? నకిలీ ఓట్ల నమోదును ఎందుకు అడ్డుకోలేకపోతున్నారు. విపక్షాలను ఈసీ ఎందుకు భయపెడుతోంది. భాజపా ఏజెంట్‌గా ఈసీ మారిపోయిందా?అంటూ ప్రశ్నించారు. ఈ ప్రశ్నలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. భారత ప్రజాస్వామ్యం ఎంతో అమూల్యమైనదని ఈ సందర్భంగా రాహుల్ అన్నారు. 2024 సార్వత్రిక ఎన్నికల సమయంలో బెంగళూరు సెంట్రల్ లోక్‌సభ స్థానంలోని మహాదేవపుర అసెంబ్లీ స్థానంలో లక్ష కంటే ఎక్కువ దొంగ ఓట్లున్నాయి. ఎన్నికల సంఘం బిజెపితో కుమ్మక్కయ్యిందని రాహుల్ ఆరోపించారు. 40 మందితో కూడిన బృందం ఆరు నెలలపాటు నిర్వహించిన విశ్లేషణలో వేలాది నకిలీ ఎంట్రీలు, నకిలీ చిరునామాలు చెల్లని ఫొటోలు, అనుమానాస్పద ఫారం 6 దరఖాస్తులు బయట పడ్డాయని రాహుల్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మల్లికార్జున ఖర్గే, కెసి వేణుగోపాల్, సిఎం సిద్దరామయ్య, డిప్యూటి సిఎం డికె శివకుమార్ తదితరులు పాల్గొన్నారు. ఇదిలావుంటే రాహుల్ ఆరోపణలపై ఎన్నికల సంఘం స్పందించింది. తను చేసే వాదనలను ధృవీకరిస్తూ అధికారిక ప్రకటనపై సంతకం చేయాలి లేదా దేశానికి క్షమాపణ చెప్పాలని కాంగ్రెస్ నేత రాహుల్‌గాంధీకి ఎన్నికల సంఘం సవాల్ విసిరింది. రాహుల్ గాంధీ దగ్గర రెండు ఆప్షన్‌లే ఉన్నాయి. ఒకటి ఆయన చేసే ఆరోపణలు నిజమనుకుంటే.. డిక్లరేషన్‌పై సంతకం చేయడం లేదా.. ఇసిఐపై అసంబద్ధ ఆరోపణలు చేసినందుకు దేశానికి క్షమాపణలు చెప్పడం అని ఎన్నిక సంఘం వర్గాలు తెలిపాయి.

# షాంఘై సదస్సుకు ప్రధాని మోడీ

### స్వాగతించిన చైనా విదేశాంగ శాఖ ప్రతినిధి



**న్యూఢిల్లీ, ఆగస్ట్ 8:** ఆగస్టు చివరలో తియాంజిన్ వేదికగా జరగనున్న షాంఘై సహకార సదస్సు లో పాల్గొనేందుకు ప్రధాని మోదీ వెళ్లనున్నారని వార్తలు వచ్చాయి. ఇందుకు సంబంధించి షెడ్యూల్ ఖరారైనట్లు- తెలుస్తోంది. ఈ పరిణామాలపై స్పందించిన బీజింగ్.. ప్రధాని మోదీ పర్యటనను స్వాగతించింది. ఈ శిఖరాగ్ర సమావేశం సభ్యదేశాల మధ్య సంఘీభావం, స్నేహం, ఫలవంతమైన ఫలితాలకు వేదిక కానుందని ఆశాభావం వ్యక్తం చేసింది. ద్వైపాక్షిక వార్షిక సదస్సులో భాగంగా ప్రధాని మోదీ ఆగస్టు 30న జపాన్‌లో పర్యటించనున్నారు. అనంతరం ఆగస్టు 31, సెప్టెంబర్ 1 తేదీల్లో షాంఘై సహకార సంస్థ సదస్సులో పాల్గొనేందుకు చైనా వెళ్లనున్నారు. ఇదే విషయంపై చైనా విదేశాంగ అధికార ప్రతినిధి గువా జియాకున్ స్పందిస్తూ.. ఎస్‌సీవో సభ్యదేశాలు సహా 20 దేశాల నేతలు, 10 అంతర్జాతీయ సంస్థల అధిపతులు ఇందుకు హాజరుకానున్నారని చెప్పారు. అయితే, ప్రధాని జపాన్, చైనా పర్యటనలకు సంబంధించి అధికారికంగా ఇప్పటివరకు ఎటువంటి ప్రకటన వెలువడలేదు. ప్రధాని మోదీ చైనాలో చివరిసారిగా 2018లో పర్యటించారు. అనంతరం చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్ 2019లో భారత్‌లో పర్యటించారు. ఆ తర్వాత 2020లో లద్దాఖ్ సరిహద్దుల్లో భారత్-చైనా సైనికుల మధ్య ఘర్షణతో ఇరుదేశాల మధ్య దౌత్య సంబంధాలు పూర్తిగా దెబ్బతిన్నాయి. వీటి పునరుద్ధరించేందుకు సైనిక, దౌత్యాధికారుల మధ్య అనేక దఫాల్లో చర్చలు జరుగుతున్నాయి. ఈ క్రమంలోనే గతేడాది రష్యాలో జరిగిన బ్రిక్స్ శిఖరాగ్ర సదస్సులో చైనా అధ్యక్షుడితో ప్రధాని మోదీ భేటీ అయ్యారు. తాజాగా మోడీ షాంఘై సదస్సులో పాల్గొనడానికి వెళ్లనుండడం ప్రాధాన్యం సంతరించుకుంది.

# కూనంనేని ఎన్నికపై పిటిషన్ తిరస్కరణ




**న్యూఢిల్లీ,ఆగస్ట్8 :** కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు ఎన్నికను సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్‌ను సుప్రీంకోర్టు డిస్మిస్ చేసింది. గతంలోనే కూనంనేని ఎన్నికపై దాఖలైన పిటిషన్‌ను తెలంగాణ హైకోర్టు కొట్టివేసింది. దీంతో హైకోర్టు తీర్పును సవాల్ చేస్తూ జలగం వెంకట్రావు సుప్రీంకోర్టులో అప్పీల్ చేశారు. కాగా.. అడ్మిషన్ స్థాయిలోనే ఈ పిటిషన్‌ను ద్విసభ్య ధర్మాసనం డిస్మిస్ చేసింది.

# ట్రంప్ సుంకాల వడ్డింపు వేళ

### పుతిన్‌తో ప్రధాని మోడీ ఫోన్ సంభాషణ

### ఉక్రెయిన్ యుద్ధ పరిస్థితిపై చర్చించట్లు ప్రకటన



**న్యూఢిల్లీ, ఆగస్ట్ 8:** ట్రంప్ సుంకాల బెదిరింపుల వేళ రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్‌కు ప్రధాని మోదీ ఫోన్ చేశారు. ఈ సందర్భంగా ఉక్రెయిన్‌కు సంబంధించి తాజా పరిస్థితులను ప్రధాని మోదీకి పుతిన్ వివరించినట్లు తెలిసింది. ఈ సంక్షోభం ముగింపునకు శాంతియుత చర్చలే పరిష్కార మార్గమని భారత్ తన వైఖరిని మరోసారి స్పష్టం చేసినట్లు ప్రధానమంత్రి కార్యాలయం వెల్లడించింది. భారత్-రష్యాల మధ్య ద్వైపాక్షిక సంబంధాలపైనా ఇరువురు నేతలు చర్చించారు. ఇరుదేశాల మధ్య ప్రత్యేక, వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేయడంపై ఇరువురు నేతలు తమ నిబద్ధతను చాటుకున్నట్లు- తెలిసింది. ఈ సందర్భంగా 23వ భారత్-రష్యా వార్షిక సదస్సులో భాగంగా ఈ ఏడాది చివరలో భారత్‌లో పర్యటించాలని పుతిన్‌కు ప్రధాని మోదీ ఆహ్వానించినట్లు- పీఎంవో వెల్లడించింది. అయితే, రష్యా నుంచి చమురు కొనుగోలు నేపథ్యంలో భారత్‌పై అమెరికా అధ్యక్షుడు ట్రంప్ సుంకాలు విధించిన వేళ ప్రధాని మోదీ పుతిన్‌తో సంభాషించడం ప్రాధాన్యం సంతరించుకుంది. ఇకపోతే ఇదే అంశంపై చర్చించేందుకు పుతిన్‌తో భారత భద్రతా సలహాదారు అజిత్ దోబల్ ఇప్పటికే మాస్కోలో ఉన్నారు. ఆయన పుతిన్‌తో భేటీ అయ్యారు. ఇరు దేశాలకు సంబంధించిన తాజా పరిస్థితులను వారు చర్చించారు.

# అందరి దృష్టి.. పులివెందుల పైనే




**అమరావతి:** పులివెందులలో గత నాలుగు దశాబ్దాలుగా వైఎస్‌ కుటుంబానిదే ఆధిపత్యం. టీడీపీ అక్కడ ఎన్నడూ గెలిచిందే లేదు. జెడ్పీటీసీగా ఉన్న సి.మహేశ్వర్‌రెడ్డి మ-రణించడంతో ఉప ఎన్నిక అనివార్యమైంది. జగన్ కోటను ఎలాగైనా బద్దలుకొట్టాలనే సంకల్పంతో ఉన్న చంద్రబాబు.. అధికార బలాన్ని మొత్తం పులివెందులలో కేంద్రీకృతం చేశారు. పులివెందులలో ఎలాగైనా గెలిచి తీరాలని తెలుగు తమ్ముళ్లకు చంద్రబాబు దిశానిర్దేశం కావించారు. జగన్ సైతం ఈ ఎన్నికను ప్రతిష్టాత్మకంగా తీసుకున్నారు. దీంతో ఈ ఎన్నిక రెండు పార్టీలకు అత్యంత కీలకంగా మారిపోయింది. పులివెందులలో తమ ఆధిపత్యాన్ని నిలవెత్తుకునేందుకు జగన్ పావులు కదుపుతుండగా.. జగన్మోహన్ రెడ్డిని రాజకీయంగా దెబ్బ తీసేందుకు ఇదో మంచి అవకాశంగా భావిస్తున్న చంద్రబాబు తన వ్యూహాలకు పదును పెడుతున్నారు. కడప జిల్లాలోని పులివెందుల కేవలం ఒక అసెంబ్లీ నియోజకవర్గం మాత్రమే కాదు.. వైఎస్ఆర్ కుటుంబానికి రాజకీయ కేంద్రం. 1978 నుంచి ఈ సీటు ఆ కుటుంబానిదే. 2024లో జగన్ ఇక్కడ మూడోసారి గెలిచారు. 2019లో 90,110 ఓట్ల మెజారిటీ రాగా 2024లో అది 61,687కి తగ్గింది. జెడ్పీటీసీ ఉప ఎన్నిక వైఎస్సార్‌సీపీ ఆధిపత్యాన్ని సవాలు చేసే అవకాశంగా టీడీపీ భావిస్తోంది. 2024 అసెంబ్లీ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ 151 సీట్ల నుంచి 11 సీట్లకు పడిపోయిన నేపథ్యంలో, జగన్‌కు ఈ ఎన్నిక అత్యంత కీలకం. ఈ ఎన్నికల్లో ఓడిపోతే ఆయన రాజకీయ ప్రతిష్టకు మచ్చగా మారుతుంది. చంద్రబాబు నాయుడు పులివెందులను గెలవడం త ప్రధాన లక్ష్యంగా పెట్టుకున్నారు. టీడీపీ తరపున పులివెందుల ఇన్‌చార్జ్ మారెడ్డి రవీంద్రనాథ్ రెడ్డి (బీటెక్ రవి) భార్య లతా రెడ్డిని బరిలోకి దించారు. బీటెక్ రవి గతంలో కడపలో వైఎస్ కుటుంబీకుడైన వైఎస్. వివేకానందరెడ్డిని ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓడించిన వ్యక్తి. ఆగస్టు ఒకటో తేదీన కడప పర్యటన సందర్భంగా జమ్మలమడుగు బీజేపీ ఎమ్మెల్యే సి. ఆదినారాయణ రెడ్డి, టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు రెడ్డెప్పగారి శ్రీనివాస రెడ్డిలతో కలిసి వ్యూహ రచన చేశారు. ప్రధానంగా వైఎస్సార్‌సీపీకి చెందిన ద్వితీయ శ్రేణి నాయకులను తమ వైపునకు తిప్పుకోవడం ద్వారా జగన్‌ను దెబ్బతీయాలని ప్రయత్నిస్తున్నారు. అందులో భాగంగానే విశ్వనాథ్‌రెడ్డి, పుష్పనాథ్‌రెడ్డి వంటి కొందరు నాయకులను టీడీపీలో చేర్చుకున్నారు. అది స్థానికంగా రాజకీయ సమీకరణలను కొంతవరకూ మార్చింది. జగన్‌కు వ్యతిరేకంగా మారిన వైఎస్ వివేకానందరెడ్డి కుమార్తె సునీత కూడా ఇప్పుడు రంగంలోకి దిగారు. ఏడాదిగా పెద్దగా బయటకు రాని ఆమె ఇప్పుడు పులివెందుల జెడ్పీటీసీ ఉప ఎన్నిక సందర్భంగా బయటకు వచ్చి మాట్లాడడాన్ని రాజకీయంగానే చూడాల్సివుంటుంది. జగన్‌ను దెబ్బకొట్టడం కోసం టీడీపీ ఆమెను రంగంలోకి దింపిందని వైఎస్సార్‌సీపీ నేతలు ఆరోపిస్తున్నారు. వైఎస్సార్‌సీపీ పులివెందులను నిలబెట్టుకోవడం కోసం మరణించిన మహేశ్వర్‌రెడ్డి కుమారుడు తుమ్మల హేమంత్‌రెడ్డిని అభ్యర్థిగా నిలిపింది. సానుభూతి ఓటర్లను ఆకట్టుకునే ప్రయత్నంలో హేమంత్‌ను ఎంపిక చేసింది. తన కుటుంబానికి చెందిన కడప ఎంపీ వై.ఎస్.అవినాష్ రెడ్డి, జిల్లా అధ్యక్షుడు, తన మామ పి. రవీంద్రనాథ్‌రెడ్డిలకు గ్రామస్థాయిలో మద్దతు సమీకరించే బాధ్యత అప్పగించారు పులివెందులలో జగన్ చేసిన అభివృద్ధిని చెబుతూ, యోగి వేమన యూనివర్సిటీ, రాజీవ్ గాంధీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ వంటి వైఎస్ రాజశేఖరరెడ్డి అభివృద్ధి వారసత్వాన్ని హైలైట్ చేస్తూ ప్రచారం చేస్తున్నారు. అయితే వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీ రమేష్ యాదవ్, వేముల మండల ఇన్‌చార్జ్ వెల్పుల రామలింగపై టీడీపీ దాడులు చేయడం సంచలనంగా ఉంది. పులివెందులలో టీడీపీ అడుగు పెట్టడమే కష్టమనుకునే స్థితి నుంచి అధికారాన్ని ఉపయోగించుకుని ఆ పార్టీ ప్రజాప్రతినిధిపై దాడి చేయడం కడప జిల్లాలో చర్చనీయాంశమైంది. వైఎస్సార్‌సీపీ నేతలను సైలెంట్ చేయడం కోసం టీడీపీ పోలీసులను ఉపయోగించి, వారిపై కేసులు పెడుతోందని ఆరోపణలు వస్తున్నాయి. రెండు వర్గాలు దాడులు చేసుకుని పోలీసులకు ఫిర్యాదులు చేస్తుంటే వైఎస్సార్‌సీపీ నేతలపైనే కేసులు పెడుతున్నట్లు ఆ పార్టీ నేతలు చెబుతున్నారు. వివేకానందరెడ్డి హత్య కేసులో నిందితుడైన యడతి సునీల్ యాదవ్ అభ్యర్థిగా ఉండటం. టీడీపీ ఒక వ్యూహం ప్రకారం వివేకా హత్య కేసుపై చర్చ జరగాలనే ఉద్దేశంతో అతన్ని రంగంలోకి దించినట్లు తెలుస్తోంది. 15 పోలింగ్ స్టేషన్లలో 10,601 ఓటర్లు ఈ ఎన్నిక ఫలితాన్ని నిర్ణయించనున్నారు. టీడీపీకి పులివెందులలో విజయం ఒక అవసరంగా మారింది. 2024లో 175 అసెంబ్లీ సీట్లలో 164 సాధించిన వేగంతో టీడీపీ దూసుకెళుతోంది. ఆగస్టు 14న ఫలితాలు వెలువడనున్న నేపథ్యంలో పులివెందులపై అందరి దృష్టి నెలకొంది.

# నేడు ప్రపంచ ఆదివాసీ దినోత్సవం

**పాడేరులో పెద్ద ఎత్తున**
**గిరజిన సంక్షేమ కార్యక్రమాలు**
**హాజరువుతున్న ముఖ్యమంత్రి చంద్రబాబు**
**గిరిజనుల సంక్షేమమే**
**కూటమి ప్రభుత్వ లక్ష్యం**
**రూ.7557 కోట్లు షెడ్యూల్డ్ -ట్రైబ్**
**కాంపోనెంట్ కింద ఖర్చు**



**అమరావతి :** కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తూనే గిరిజన ప్రాంతాల్లో నూతన అధ్యాయం ఆరంభమైంది. ఏజెన్సీ జిల్లాల్లోని ఆదివాసీల జీవితాల్లో వెలుగులు నింపేందుకు రాష్ట్ర ప్రభుత్వం నిత్యం కృషి చేస్తోంది. గతంలో ఇచ్చిన హామీలను నెరవేరుస్తూ ప్రభుత్వం ఏజెన్సీ ప్రాంతాలను మైదాన ప్రాంతాలతో సమానంగా అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తోంది. ఇందులో భాగంగా ఆగస్టు 9వ తేదీన ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని పురస్కరించుకుని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పాడేరులో జరుగనున్న కార్యక్రమానికి హాజరు కానున్నారు. గిరిజనుల హక్కుల పరిరక్షణ- కృత్రిమ మేధస్సు, ఆదివాసీల భవిష్యత్తు అనే థీమ్ తో ఈ ఏడాది ఐక్యరాజ్యసమితి అంతర్జాతీయ గిరిజన దినోత్సవ నిర్వహణకు పిలుపునిచ్చింది. ఈమేరకు రాష్ట్ర ప్రభుత్వం అల్లూరి జిల్లా పాడేరులో అంతర్జాతీయ గిరిజన దినోత్సవాన్ని నిర్వహిస్తోంది. పాడేరు మండలం వంజంగి గ్రామంలో నిర్వహించే ఈ కార్యక్రమానికి ముఖ్యమంత్రి చంద్రబాబు హాజరు కానున్నారు. తొలుత మోదకొండమ్మ ఆలయాన్ని దర్శించుకున్న అనంతరం స్థానిక గిరిజన సంప్రదాయ వేడుకలకు హాజరు అవుతారు. ఆదివాసీల ఇళ్లకు వెళ్లి వారి కష్టసుఖాలను ముఖ్యమంత్రి స్వయంగా తెలుసుకోనున్నారు. అనంతరం కాఫీ ప్లాంటేషన్ పెంపకందారులతో సీఎం మాట్లాడనున్నారు. ఆ తర్వాత లగిసపల్లె వద్ద ఏర్పాటు- చేసిన ప్రజా వేదిక కార్యక్రమంలో ముఖ్యమంత్రి చంద్రబాబు పాల్గొంటారు. గిరిజన ప్రాంతాల్లో అభివృద్ధి కార్యక్రమాలకు సీఎం అక్కడి నుంచే శంకుస్థాపన చేయనున్నారు. అలాగే గిరిజన ప్రాంతాల్లో ప్రాజెక్టులకు సంబంధించిన అంశంపై సీఎం సమక్షంలో ఎంఓయూలను కుదుర్చుకోనున్నారు. అనంతరం కొద్దిసేపు పార్టీ శ్రేణులతోనూ ముఖ్యమంత్రి మాట్లాడనున్నారు. మారుమూల గిరిజన ప్రాంతాలు, ఆవాసాలను ఏజెన్సీలోని ప్రధాన కేంద్రాలు, ఇతర మైదాన ప్రాంతాలతో అనుసంధానించేలా ప్రభుత్వం రహదారుల నిర్మాణ ప్రాజెక్టుల్లో వేగం పెంచింది. గిరిజన ప్రాంతాల్లో రోడ్లు, వంతెనలు నిర్మాణంతో పాటు- ఆదివాసీల ప్రాంతాలు, నివాసాలకు కనెక్టివిటీ- కోసం రూ. 2404 కోట్లు- ఖర్చు చేయనుంది. వచ్చే ఐదేళ్లలో 2075కు పైగా గిరిజన గ్రామాలకు, నివాసాలను రోడ్లు, వంతెనలతో అనుసంధానించాలని నిర్ణయించారు. అల్లూరి సీతారామరా జు జిల్లాలోని రోడ్ల కారిడార్లను రూ.41 కోట్లతో చేపట్టనుంది. ఐటీ-డీఏ చింతూరులో కమ్యూనిటీ- హెల్త్ సెంటర్ ను 50 నుంచి 100 పడకల ఆస్పత్రికిగా మార్చడంతో పాటు- సీతంపేట, పార్వతీపురం, రంపచోడవరం, కేఆర్ పురం, శ్రీశైలం ఐటీ-డీఏ ప్రాంతాల్లో మల్టీ స్పెషాలిటీ- ఆస్పత్రుల నిర్మాణాల కోసం రూ.50 కోట్ల చొప్పున ప్రభుత్వం నిధులు విడుదల చేసింది. త్వరలోనే నిర్మాణాలు పూర్తై ఆస్పత్రులు అందుబాటు-లోకి రానున్నాయి. పాడేరులో మెడికల్ కళాశాల నిర్మాణ పనులు కూడా శరవేగంగా జరుగుతున్నాయి. అలాగే జల్ జీవన్ మిషన్ కింద గిరిజన ప్రాంతాల్లోని 13,816 ఆవాసాలకు మంచినీటి సరఫరా కోసం రూ. 2,373 కోట్లతో ప్రభుత్వం పనులు చేపట్టింది. 2026 నాటికి ఈ పనులు పూర్తి చేసి ఆదివాసీలు అందరికీ తాగునీరు అందుబాటు-లోకి తెచ్చేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తోంది. డీఎస్సీ సహా వివిధ పోటీ- పరీక్షలకు గిరిజన యువతీ యువకులు సన్నద్ధం చేసేందుకు విశాఖ, విజయవాడ, తిరుపతి తదితర ప్రాంతాల్లో స్టడీ సర్కిళ్లను ప్రభుత్వం ఏర్పాటు- చేసింది. అలాగే గిరిజన ప్రాంతాల్లో రెసిడెన్షియల్ పాఠశాల భవనాలను వసతి గృహాలుగా మార్చేందుకు రూ.150 కోట్లను ప్రభుత్వం ఖర్చు చేస్తోంది. 520కి పైగా రెసిడెన్షియల్ పాఠశాల భవనాలను వసతి గృహాలుగా మార్చటం కోసం రూ.150 కోట్లను కూడా ప్రభుత్వం మంజూరు చేసింది. 520కి పైగా పాఠశాల భవనాల నిర్మాణం కోసం రూ.64 కోట్లను కూడా ప్రభుత్వం వ్యయం చేస్తోంది. పార్వతీపురం మన్యంలో పూర్ణపాడు- కొమరాడ మధ్య నాగావళి నదిపై రూ.10 కోట్లతో హై లెవల్ వంతెనను కూడా చేపట్టేందుకు ప్రభుత్వం సిద్ధమైంది. మరోవైపు ప్రపంచ బ్రాండ్ గా మారిన అరకు కాఫీని మరింత విస్తరించేందుకు వీలుగా మన్యంలో ఎ÷-లాంటేషన్ను పెంచేందుకు కూడా ప్రభుత్వం కార్యాచరణ చేపట్టింది. కాఫీ పల్పింగ్, ప్రాసెసింగ్ యూనిట్లను ఏర్పాటు- చేయటంతో పాటు- ప్లాంటేషన్ విస్తరణ కోసం రూ.202 కోట్లను ప్రభుత్వం వ్యయం చేయనుంది. ఏజెన్సీ ప్రాంతాల్లోని యువతీ యువకులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభించేలా పర్యాటక ప్రాజెక్టులను చేపట్టనున్నారు. గిరిజనుల సంక్షేమమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తోంది. అధికారంలోకి వచ్చిన అనంతరం 2024-25 ఆర్థిక సంవత్సరానికి రూ.7557 కోట్ల రూపాయల్ని షెడ్యూల్డ్ -ట్రైబ్ కాంపోనెంట్ కింద కూటమి ప్రభుత్వం వ్యయం చేసింది. అధికారంలోకి వస్తూనే రాష్ట్రవ్యాప్తంగా వివిధ ఏజెన్సీ ప్రాంతాల్లో ఉన్న 4.82 లక్షల మంది గిరిజన కుటు-ంబాలకు నెలకు 200 యూనిట్ల వరకూ ఉచిత విద్యుత్ ను ప్రభుత్వం అందిస్తోంది. అలాగే త్వరలోనే సోలార్ రూఫ్ టాప్ ద్వారా ఇంటిపై సౌరఫలకాలను ఏర్పాటు- చేసేందుకు కూడా ప్రభుత్వం కార్యాచరణ చేపట్టింది. ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా 3,77,051 మంది గిరిజనులకు ప్రతి నెలా ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల ద్వారా ప్రభుత్వం రూ.1,595 కోట్లు- ఖర్చు చేస్తోంది. అలాగే తల్లికి వందనం పథకం ద్వారా 4,86,803 మంది గిరిజన విద్యార్థుల తల్లుల ఖాతాల్లో రూ.642 కోట్లను ప్రభుత్వం జమ చేసింది.

## సృష్టి ఫెర్టిలిటీ కేసు వ్యవహారం
### ఆరుగురిని అరెస్ట్ చేసిన పోలీసులు

**విశాఖపట్నం :** సృష్టి ఫెర్టిలిటీ- కేసు రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టిస్తోంది. శిశువుల అక్రమ రవాణా, మధ్యవర్తుల హస్తంతో నడిచిన ఈ అమానవీయ ఘటనలో అరెస్టుల పర్వం కొనసాగుతోంది. విశాఖ కేం ద్రంగా జరిగిన ఈ స్కాంలో ఇప్పటి వరకూ ఆరుగురిని పోలీసులు అరెస్ట్ చేశారు. తాజాగా, హైదరాబాద్ పోలీ సులు విచారణలో భాగంగా విశాఖలో ముగ్గురు మధ్యవర్తులు అయిన విజయ్, సరోజ, రత్నాను అరెస్టు చేశారు. ఈ మధ్యవర్తులు శిశువుల కొనుగోలు, అమ్మకా ల్లో కీలకంగా వ్యవహరించినట్లు- ఆధారాలు లభిం చాయని సమాచారం. సృష్టి ఫెర్టిలిటీ- సెంటర్ వ్యవహా రంలో నవజాత శిశువులను పేద కుటు-ంబాల నుంచి తీసుకొని దరఖాస్తు చేసుకున్న జంటలకు పెద్ద మొత్తాలకు విక్రయించినట్లు- పోలీసులు గుర్తించారు. ఇది పూర్తిగా వ్యాపార ధోరణితో నడిచిన శిశువుల అక్రమ ము ఠాగా భావిస్తున్నారు. ఈ కేసులో మరొక షాకింగ్ విషయమేమిటంటే, డాక్టర్ నమ్రత స్నేహితులు అయిన డాక్టర్ రమ్య, డాక్టర్ రవిలను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వీరిద్దరూ శిశువుల అక్రమ రవాణా వ్యవహారంలో ప్రత్యక్ష, పరోక్షంగా భాగమయ్యారన్న ఆరోపణలపై అరెస్ట్ చేశారు. డాక్టర్ రవి, ప్రస్తుతం కేజీహెచ్ ఆసుపత్రిలో అనస్థీషియా విభాగంలో పని చేస్తున్నారు. ఇటు-వంటి బాధ్యత గల స్థాయిలో ఉన్న వైద్యులు కూడా అక్రమ కార్యకలాపాల్లో నిమగ్నమ య్యారన్న ఆరోపణలు ప్రస్తుతం చర్చనీయాంశమవుతు న్నాయి. ఈ కేసులో ఇంకా పలువురిపై అనుమానాలు ఉన్నాయని, వీరిలో కొంతమంది రాజకీయ, సామాజికంగా బలమైన వారిగా ఉన్నారని పోలీసులు భావిస్తున్నారు. విశాఖలో ఇంకా అరెస్టులు పెరిగే అవకాశం ఉందని పోలీస్ వర్గాలు వెల్లడించాయి.

# వైఎస్ఆర్ గారు వైసీపీ సొంతం కాదు

మొదటి పేజీ తరువాయి



చేశాయి. అలాంటి మహానేత పేరు పెట్టుకున్నంత మాత్రాన వైఎస్ఆర్... వైసీపీ సొంతం కాదు, పేటెంట్ హక్కు కాదు. తెలుగు ప్రజల గుండెల్లో చెరగని ముద్ర వేసుకున్న నాయకుడి విగ్రహాలను కూల్చడం ఎక్కడి దిక్కుమాలిన చర్య?" అని షర్మిల ప్రశ్నించారు. నందిగామ గాంధీ సెంటర్‌లో వైఎస్ఆర్ విగ్రహం చుట్టూ వైసీపీ ఏర్పాటు చేసిన అక్రమ నిర్మాణాలను తొలగించడంపై తమకు అభ్యంతరం లేదని, కానీ అదే సాకుతో విగ్రహాన్ని తొలగించడం దుర్మార్గమని ఆమె స్పష్టం చేశారు. "మహానేత మరణం తర్వాత నాటి ప్రభుత్వం గాంధీ సెంటర్‌లో వైఎస్ఆర్ విగ్రహాన్ని ప్రతిష్టించింది. ఇప్పుడు ఆ విగ్రహాన్ని తొలగించడం కూటమి ప్రభుత్వ దిగజారుడుతనానికి నిదర్శనం" అని ఆమె వ్యాఖ్యానించారు. వైఎస్ఆర్ విగ్రహాలను కూల్చడం ద్వారా ప్రజాభిమానాన్ని దెబ్బతీయాలన్న ఉద్దేశం స్పష్టమవుతోందని షర్మిల విమర్శించారు. "వైసీపీకి వైఎస్ఆర్ విగ్రహాలకు సంబంధం లేదు. ఆ విగ్రహాలను కూల్చడం ద్వారా ప్రజల మనోభావాలను అవమానపరుస్తున్నారు. తొలగించిన చోట వెంటనే రాజశేఖర్ రెడ్డి గారి విగ్రహాన్ని తిరిగి ఏర్పాటు చేయాలి. లేకపోతే ఉద్యమం తప్పదని హెచ్చరిస్తున్నాం" అని ఆమె హితవు పలికారు.

# జడ్పీటీసీ ఓటమి భయంలో వైకాపా

మొదటి పేజీ తరువాయి

చేశారో ప్రజలకు తెలుసన్నారు. శుక్రవారం ఆమె మీడియాతో మాట్లాడారు. వైసీపీకి పులివెందుల జెడ్పీటీసీ ఓడిపోతామని భయం పట్టుకుందని ఆరోపించారు. ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికలు జరపడానికి తమ ప్రభుత్వం సిద్ధంగా ఉందని ధీమా వ్యక్తం చేశారు. తెలుగుదేశం పార్టీ ఫ్లెక్సీలు చించడం వైసీపీ నాయకుల అవివేకానికి నిదర్శనమని మంత్రి సవిత విమర్శించారు. పోలీసులను అసభ్యకరంగా మాట్లాడడం హేయమైన చర్యగా అభివర్ణించారు. వైసీపీ నాయకులు పులివెందుల ప్రజలను భయ భ్రాంతులకు గురి చేస్తున్నారు పేర్కొన్నారు. పోలీస్ డిపార్ట్‌మెంట్‌పై జగన్ దారుణంగా మాట్లాడుతున్నారని మండిపడ్డారు. పులివెందులలో డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నారని ఆరోపించారు. వివేకానంద రెడ్డి జయంతికి కుటు-ంబ సభ్యులు రావాలన్న భయపడుతున్న పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. వైసీపీ ఎన్ని డైవర్షన్ పాలిటిక్స్ చేసినా ఎన్నికల్లో అత్యధిక మెజార్టీతో తామే గెలుస్తామని మంత్రి సవిత ధీమా వ్యక్తం చేశారు.

# 14మందికి ఐపిఎస్‌లుగా పదోన్నతి

**అమరావతి :** కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఆంధ్రప్రదేశ్ పోలీసు శాఖకు చెందిన 14 మందికి ఐపీఎస్‌లుగా పదోన్నతులు కల్పిస్తూ..కేంద్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఐపీఎస్‌లుగా ఎన్ని-కై-నా అభ్యర్థులు ఒక సంవత్సరం పాటు- ప్రొబేషన్‌లో ఉండాలని సూచించింది. యూపీఎస్సీ ఛైర్మన్ అధ్యక్షతన పదోన్నతి కమిటీ- పదోన్నతులకు ఆమోదం తెలిపింది. 2010 గ్రూప్-1 బ్యాచ్‌కు చెందిన చౌడేశ్వరి, లక్ష్మీనారాయణ, ఈశ్వర్‌రావు, హిమావతి, లావణ్య లక్ష్మి, వెంకటరత్నం, లత మాధురి, సురేష్ బాబు, కరీముల్లా షరీఫ్, సత్తిబాబు, సుప్రజ, కృష్ణ ప్రసన్న, శ్రీనివాస్, కె.శ్రీనివాస్‌లకు కన్ఫర్డ్ ఐపీఎస్‌లుగా పదోన్నతి ఇచ్చింది.దీనికి సంబంధించిన అధికారిక గెజిట్ నోటిఫికేషన్‌ను ఇవాళ కమిటీ- విడుదల చేసింది.

# నలుగురు జడ్జిలకు పదోన్నతి

**అమరావతి :** కేంద్ర ప్రభుత్వం మరో సంచలన నిర్ణయం తీసుకుంది. పలు హైకోర్టుల్లో అదనపు న్యాయమూర్తులుగా పనిచేస్తున్న 16 మందిని పూర్తికాలం న్యాయమూర్తులుగా నియమిస్తూ.. కేంద్ర ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ఆంధ్రప్రదేశ్ సహా.. ఆరు రాష్ట్రాల్లో న్యాయమూర్తులకు పదోన్నతి ఇస్తూ.. కేంద్ర న్యాయశాఖ నుంచి ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఇందులో భాగంగా ఏపీ హైకోర్టులో నలుగురు అదనపు న్యాయమూర్తులకు పదోన్నతి లభించింది. జస్టిస్ హరనాథ్ నూనెపల్లి, జస్టిస్ కిరణ్మయి, జస్టిస్ సుమతి, జస్టిస్ న్యాపతి విజయ్‌లకు పూర్తి స్థాయి జడ్జిలుగా పదోన్నతి కల్పిస్తూ కేంద్ర న్యాయశాఖ ఉత్తర్వులు వెలువరించింది. 16 మంది హైకోర్టు జడ్జిలకు పదోన్నతి కల్పించాల్సిందిగా సుప్రీం కోర్టు కొలీజియం ఇటీవల సిఫార్సు చేసింది. అందుకు రాష్ట్రపతి ఆమోదం తెలపడంతో తాజాగా కేంద్ర న్యాయశాఖ ఉత్తర్వులు విడుదల చేసింది.

# ఆటో డ్రైవర్ దాష్టీకం
### భక్తుడిపై దాడి చేసిన వీడియో వైరల్



**తిరుమల :** తిరుపతి రైల్వే స్టేషన్‌లో భక్తుడిపై ఆటో డ్రైవర్లు దాడికి దిగిన ఘటన భక్తుల్లో భయాందోళనలకు కారణమైంది. కలియుగ ప్రత్యక్ష దైవం తిరుమల వెంకన్నను దర్శించుకోవడానికి వందల కిలోమీటర్లు ప్రయాణం చేసి భక్తులు తిరుమలకు వెళుతుంటారు. అలాంటి భక్తులపై శ్రీనివాస మంగాపురం, శ్రీవారి మెట్టుకు వెళ్లే ఫ్రీ బస్ స్టాప్ వద్ద ఆటోడ్రైవర్లు దాడికి దిగారు. దాడికి సంబంధించిన వీడియోని కొందరు సోషల్ మీడియాలో పోస్ట్ చేయడంతో ఈ ఘటన వెలుగులోకి వచ్చింది. ఆటో డ్రైవర్ చెప్పిన రేటుకు భక్తుడు నిరాకరించడంతో అతడిపై తీవ్రంగా దాడి చేసి ఆటో డ్రైవర్లు గాయపరిచారు. తిరుపతి రైల్వే స్టేషన్ దగ్గర ఆటోవాలాల దందా రోజురోజుకు పెరిగిపోతుండటం గమనార్హం. తిరుపతి బస్టాండ్, రైల్వే స్టేషన్ల దగ్గర నుంచి శ్రీవారి మెట్టు- వరకు తిరుమల తిరుపతి దేవస్థానం భక్తుల కోసం ఉచిత బస్సులు ఏర్పాటు- చేసింది. అయితే సమాచార లోపం కారణంగా భక్తుల్లో గందరగోళం నెలకొంది. ఉచిత బస్సుల -టైమింగ్ భక్తులకు తెలియకపోవడంతో శ్రీవారి మెట్టు- వరకు భక్తులు ఆటోలను ఆశ్రయిస్తున్నారు. ఇదే అదునుగా ఆటోవాలాలు భక్తులను నిలువు దోపిడీ చేస్తున్నారు.

# ఒక కొమ్మ పువ్వులు..
# ఒక గూటి దివ్వెలు

ప్రేమానురాగాలకు ప్రతీక రక్షాబంధన్



**అన్నా చెల్లులు, అక్కాతమ్ముళ్లు జరుపుకునే ప్రత్యేక పండుగ నేడు రాఖీ పౌర్ణమి**



వెలకట్టలేని బంధాలను, వదులుకోలేని అనుబంధాలను గుర్తు చేసే మధుర బంధమే రక్షాబంధన్..సోదరీ సోదరుల అనురాగం, ఆప్యాయత, అనుబంధాల ప్రతీక రక్షాబంధన్. పేగుతో పంచుకున్న అనుబంధాన్ని దారంతో ముడి వేసి తోబుట్టువుగా గుర్తుచెప్పే చిన్న దారానికే వెన్నెలా కరిగిపోయే అన్నదమ్ముల ఆప్యాయతను కలబోసుకున్న అపురూపమైన పండుగ రాఖీ పౌర్ణమి. శ్రావణ మాసం వచ్చిందంటే చాలు సోదర సోదరీమణుల మధ్య ఆనందోత్సాహాలు వెల్లివిరుస్తాయి. వీరి అనుబంధానికి ప్రతీకగా నిలుస్తుంది రక్షాబంధన్, కుటుంబంలో అన్నా చెల్లెళ్లు, అక్కా తమ్ముళ్ల అనుబంధం చాలా గొప్పది. పండు వెన్నెల చల్లదనంలా పదికాలాల పాటు నిలుస్తుంది. ఈ బంధం లో ఆనందమే కాకుండా కుటుంబ కీర్తి వంశ మర్యాదలు దాగి ఉంటాయి. సామాజిక క్షేమాభిలాష ఉంటుంది. పరస్పర స్నేహంతో సాగే సంస్కార సంపన్నత ఉంటుంది. సహృదయాల భావనలు ఉంటాయి. ఇవన్నీ కలిసి పోగులుగా కూర్చుకొని దీక్షగా కట్టుకునేదే రాఖీ పండుగ. సోమవారం రాఖీ పౌర్ణమి ఉండటంతో ఇప్పటికే గ్రామాల్లో పట్టణాల్లో సందడి నెలకొంది. మార్కెట్లో వివిధ రకాల రాఖీలతో విక్రయాలు ఊపందుకున్నాయి. 'రక్షా బంధన్'నే రాఖీ పౌర్ణమి అని పిలిచే ఈ పండుగను కొన్ని ప్రాంతాల్లో శ్రావణ పౌర్ణమి, జంధ్యాల పౌర్ణమి అని కూడా పిలుస్తారు. అన్నాచెల్లెళ్లు అక్కాతమ్ముళ్ల మధ్య ప్రేమానురాగాలకు సూచకంగా రక్షా బంధన్ ను జరుపుకుంటారు. కొంత కాలం క్రితం వరకూ ఉత్తర, పశ్చిమ భారతదేశాలలో ఈ పండుగను చాలా వైభవంగా జరుపుకునేవారు. ఇప్పుడు దేశమంతా జరుపుకుంటున్నారు. అన్నకుగాని తమ్మునికి కానీ ప్రేమ సూచకంగా సోదరి కట్టే రాఖీ జీవితాంతం ఒకరికొకరు రక్షాగా ఉండాలనే సందేశాన్ని ఇస్తుంది ఈ పండుగ. సోదరి తన తోబుట్టువులు మహోన్నత శిఖరాలకు ఎదగాలని మనస్ఫూర్తిగా కోరుకుంటుంది.



### మహాలక్ష్మిగా భావించి..

ఆడపడుచులను తమ ఇంటి మహాలక్ష్మిగా, పరాశక్తి ప్రతీకకగా భావించే గొప్ప సంస్కృతి మనది. అక్కాచెల్లెళ్లకు అన్ని సమయాల్లో, కష్ట సుఖాల్లో అండగా ఉంటామని భరోసా కల్పించేందకు ప్రతీకగా నిలిచే రక్షాబంధన్ వేడకలు జిల్లా వ్యాప్తంగా నిర్వహించేందుకు అన్నివర్గాల వారు సిద్ధమయ్యారు.

### మార్కెట్ లో సందడే.. సందడి..

రక్షాబంధన్ వేడుకల్లో కీలకమైన రాఖీలు వివిధ రకాల ఆకృతుల్లో దర్శనమిస్తున్నాయి. విరివిగా రాఖీల విక్రయ స్టాల్స్ జిల్లా వ్యాప్తంగా వెలిశాయి. రాఖీల అమ్మకాలు, కొనుగోళ్లతో మార్కెట్ కళకళ లాడింది. స్థానిక వ్యాపారులు గుజరాత్, మహా రాష్ట్ర, ఒడిశా హైదరాబాద్ ప్రాంతాల నుంచి వివిధ రకాల ఆకర్ష ణీయమైన రాఖీలను తీసుకువచ్చి హెూల్సేల్ ధర లకు అమ్మకాలు చేపడుతున్నారు. ఈ ఏడాది ఆకర్ష జీయ-ుమైన బాక్స్ రాఖీలు, రంగు పూసలతో కూడిన, చేనేత కళాకారులు రూపొందించిన రాఖీలు ఆకట్టుకుంటున్నాయి. జ్యూయలరీ షాపుల్లో వెండి, బంగారు రాఖీలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. అలాగే గిఫ్ట్ షాపులు, స్వీట్ దుకాణాలు కొనుగోలుదారులతో కిటకిటలాడాయి.





## శ్రావణ పౌర్ణమియే రాఖీ పండగ

శ్రావణమాసంలో అనేక పర్వదినాలు వస్తుంటాయి. విష్ణుమూర్తి జన్మనక్షత్రం శ్రవణం. ఈ నక్షత్రం చంద్రునితో కూడిన మాసం కావడంతో శ్రావణమాసం అంటారు. ఈ మాసంలో వర్షాలు ఎక్కువగా కురుస్తాయి. ఆకాశం మబ్బులతో వెండికొండలను తలపిస్తుంటుంది. పూర్వకాలం వేద అధ్యయనం శ్రావణమాసంలోనే ప్రారంభమయ్యేది. విష్ణత్‌పురాణంలో రక్షాబంధన్ గురించి వివరించారు. బలి చక్రవర్తిని విష్ణుమూర్తి దేవతల కోరిక మేరకు బంధిస్తాడు. అయితే ఈ బంధం అతనికి రక్షణగా నిలుస్తుందని వరమిచ్చినట్టు తెలుస్తోంది. పాల్కురికి సోమనాధుడు ఈ పౌర్ణమిని నూలి పున్నమిగా అభివర్ణించాడు. కర్ణాటకలో నారికేళ పున్నమిగా పండగ నిర్వహిస్తారు. శ్రావణ పూర్ణిమను భారతదేశమంతా

స్థానిక సంప్రదాయాల నేపథ్యంలో వేడుకగా నిర్వహిస్తుంటారు. నార్లీ పండగ, నూలి పున్నమి ఇలా రకరకాల పేర్లతో పిలుస్తుంటారు. భారతావనిలో శ్రావణ పౌర్ణమిని పర్వదినంగా పాటించడం వేదకాలం నుంచీ ఉంది. వేదాధ్యయనం చేసేవారు ఉపాకర్మ అనే పేరుతో శ్రావణ పౌర్ణమి రోజున విశేష కార్యాలను నిర్వర్తిస్తుం దేవారు. వారి నియమాలలో ఒకటైన యజ్ఞోపవీతధారణకు ఈ రోజున ప్రాధాన్యాన్ని ఇస్తుండేవారు. ఉపనయనం అనే విధి సంస్కారం దీనికి ఆధారంగా ఉండేది. యజ్ఞోపవీతాన్నే యజ్ఞ సూత్రం అని కూడా అంటారు. ఈ పౌర్ణమినాడు మహారాష్ట్ర, కర్ణాటక వంటి రాష్ట్రాల్లో సముద్రతీర వాసులు సముద్రం దగ్గరకు వెళ్లి సముద్రుడిని పూజించి కొబ్బరికాయలను కొడతారు. అందుకే దాన్ని నార్లీ పౌర్ణమి అనిపిలుస్తారు. వేదకాలంలో ఇది సాక్షాత్తు విష్ణుశక్తి స్వరూపంగా ఉన్నట్లు తెలుస్తోంది. రక్షా బంధాన్ని ఇప్పట్లోలా సోదరి, సోదరుడికి కట్టడమనేది తొలిరోజుల్లో ఉండేది కాదు. భర్త చేతికి భార్య కట్టేది. శత్రు జయాన్ని కలిగిస్తాయన్న నమ్మకంతో ఆవాలు, అక్షతలను వేసి పొట్లం కట్టేవారు. ఆవాలు, అక్షితలను రక్షాద్రవ్యం అనేవారు. ఈ రక్షాద్రవ్యాలున్న పొట్లాన్ని ఒక పరిశుభ్రమైన వస్త్రంలో ఉంచి మూటకట్టేవారు. దాన్ని పీఠంపై ఉంచి పూజించిన తర్వాత దాన్ని పురోహితుడితో చేతికి కట్టించుకునేవారు. పూజ చేసిన ఆ పొట్లం విష్ణుశక్తికి ప్రతిరూపమని నమ్మకం. ఆరోజుల్లో రాక్షసులకు, దేవతలకు చాలాకాలం యుద్ధం జరిగింది. రోజురోజుకూ దేవతల శక్తి సన్నగిల్లడం చూసిన ఇంద్రుని భార్య శచీదేవి శ్రావణ పౌర్ణమి నాడు విధివిధానంగా రక్షను రూపొందించి విష్ణుశక్తి స్వరూపమైన ఆ రక్ష మహిమను, శ్రావణ పౌర్ణమి విశేషాలను వివరించి దాన్ని ఇంద్రుడి చేతికి కట్టింది. ఆ తర్వాతే ఇంద్రుడు రాక్షసులను జయించగలిగాడు... ఇలా ఆనాడు ఒక భార్య భర్త చేతికి రక్షా బంధాన్ని కట్టిన సందర్భం ఉంది. కాలక్రమంలో ఆవాలు, అక్షతలు వేసి పూజించి కట్టిన పొట్లం నేడు రాఖీకి మధ్యలో పువ్వుగానో, కుచ్చుగానో మారిపోయి ఉండవచ్చని చెబుతారు. తర్వాత కాలంలో ఇది అన్నకు చెల్లెలు రాఖీగా కట్టే సంప్రదాయంగా మారిపోయి ఉండవచ్చు.

## బలి చక్రవర్తికి రాఖీ పండుగకి సంబంధమేంటి?

పురాణాలు ఏం చెబుతున్నాయి?

అన్నా చెల్లెలి అనుబంధం.. జన్మజన్మలా సంబంధం.. జాబిలమ్మకిది జన్మదినం.. కోటి తారకల కోలాహలం' అంటూ ఎన్నో పాటలు అన్నాచెల్లిలి అనుబంధం గురించి వివరిస్తున్నాయి. అన్నయ్య లేదా తమ్ముడు తనకు ఎలాంటి కష్టం వచ్చినా తోడుగా నిలుస్తాడని చెల్లెలి నమ్మకం. తన అన్నకు ఎలాంటి నష్టం రాకూడదని, సమస్యల చిక్కుముడి నుంచి విడుదల కలగాలని, జీవితాంతం సుఖసంతోషాలతో ఉండాలని కోరుకుంటూ చెల్లెలు రాఖీని కడుతుంది. తన సంతోషాన్ని కోరుకొని రాఖీ కట్టిన చెల్లిలికి అన్నయ్య ఏదో ఒక కానుకను బహుకరించి చెల్లెలి ముఖంలో సంతోషాన్ని చూస్తాడు.. నీకు ఎలాంటి కష్టం వచ్చినా ఈ అన్నయ్య ఉన్నాడమ్మ... నన్ను గుర్తు చేసుకో.. నీకు ఒక ధైర్యంగా ఉంటాను అంటూ అన్నయ్య తన చెల్లెలికి ధైర్యం చెప్తాడు.. సొంత తోబుట్టువులు లేకపోతే కుటుంబంలో లేదా తెలిసిన వారిలో ఎవరినైనా అన్నా అని పిలిచి రాఖీ కడితే వారి మధ్య అన్నాచెల్లిలి బంధం ఏర్పడుతుంది. అది రాఖీకి ఉన్న గొప్పతనం..

మానవీయ సంబంధాలను పటిష్టం చేసేందుకు పరస్పర సోదర భావాన్ని, స్నేహ సౌరభాలను విరజిమ్ముతూ శాంతి సౌభ్రాతృత్వాలను పరిమళింపజేసే అపురూప వేడుక రక్షాబంధనం. ఏటా శ్రావణ పౌర్ణమి రోజున దేశవ్యాప్తంగా జరుపుకునే ఈ పండుగను రాఖీ పౌర్ణమిగా కూడా పిలుస్తారు. తోబుట్టువుల మధ్య కల్మషం లేని బంధానికి గుర్తుగా, ఆత్మీయత అనురాగాల నడుమ అట్టహాసంగా జరుగుతోంది. సహోదర ప్రేమకు ప్రతిరూపంగా, ఆత్మీయ బంధాలకు సంకేతాత్మకంగా రక్షాబంధనం నిలుస్తోంది. నిద్రావస్థలో ఉన్న మానవీయ విలువలను తిరిగి సాక్షాత్కరింపజేస్తుంది. సభ్య సమాజానికి సంస్కారాన్ని అందిస్తుంది. మానవత్వపు విలువలు కనుమరుగవుతున్న తరుణంలో రాఖీ సాటి మనుషులను ఓదర మానులుగా చూడాలన్న ఆకాంక్షను బలపరుస్తుంది. సంప్రదాయాలు ఉట్టిపడేలా దేశవ్యాప్తంగా రాఖీ పౌర్ణమిని ఘనంగా జరుపుకోనున్నారు.

### అసలు నేపథ్యం

దేవ దానవులకు ఉధృత స్థాయిలో యుద్ధం జరుగుతోంది. త్రిలోకాధిపత్యమే లక్ష్యంగా సాగుతున్న రణరంగంలో రాక్షసుల ధాటికి దేవతలే తల్లడిల్లుతున్న సమయం. అమరావతికి అధిపతి దేవేంద్రుడు సైతం నిస్సహాయస్థితికి లోనై తరు-ణమది. అసహాయ స్థితిలో తన పరివారంతో సహా అమరావతిలో తలదాచుకున్న దేవేంద్రుడి నిశ్చేష్టతను గమనించిన ఆయన సతీమణి శచీదేవికి ఓ ఉపాయం తడుతుంది. రాక్షస రాజుతో తలపడేందుకు భర్తను సమాయత్తపర్చాలని తలుస్తుంది. లయకారుడైన పరమేశ్వరుడిని, లక్ష్మీనారాయణున్ని ఆరాధిస్తుంది. అనంతరం భర్త దేవేంద్రుని చేతికి రక్షా కంకణం కడుతుంది. ఆ ఉత్తేజంతో రాక్షసులతో యుద్ధం చేసి త్రిలోకాధిపత్యం సాధిస్తాడు దేవేంద్రుడు. అలా శచీదేవితో ప్రారంభమైన రక్షాబంధనం కాలక్రమంలో పరిణామం చెందుతూ ప్రస్తుత దశకు చేరుకుంది.

బలిచక్రవర్తి కోరిక మేరకు శ్రీమహావిష్ణువు అతనితో పాటే పాతాళ లోకవాసానికి అంగీకరిస్తాడు. భర్త సాహచర్యం కోసం శ్రీమహాలక్ష్మి రక్షను రూపొందించి బలిచక్రవర్తి చేతికి కట్టి సోదర భావంతో అభ్యర్థించి భర్తను వైకుంఠానికి తీసుకెళ్తుంది. ఈ కారణంగా రక్షాబంధనానికి అంతటి ప్రాధాన్యత ఏర్పడింది. అందుకే రక్షాబంధనం చేసే సమయంలో 'యేనబద్ధో బలీ రాజా దానవేంద్రో మహాబూబలః తేన త్వా మభీబద్నామి రక్షే మ చలమా చల' అనే శ్లోక పఠనం చేస్తారు.

### శ్రావణపౌర్ణమి రోజునే హయగ్రీవ జయంతి

మరణమే లేకుండా వరం అనుగ్రహించేలా తపస్సు చేసిన ఓ రాక్షసుడిని లక్ష్మీదేవి కటాక్షిస్తుంది. హయగ్రీవ ముఖాకృతి (గుర్రం రూపంలో ఉన్న తల) రూపంలో ఉన్న వ్యక్తి నుంచి మాత్రమే మరణం సంభవించేలా ఆ రాక్షసుడిని అనుగ్రహిస్తుంది. వర గర్వంతో దేవతలను తీవ్ర ఇక్కట్లు పాలు చేస్తుంటాడు. చివరికి శివుడు ఉపాయంతో మహావిష్ణువు విల్లుకు బాణాన్ని సంధించి తీవ్ర అలసటతో వాలిపోయాడు. అతన్ని నిద్ర లేపేందుకు దేవతలెవరూ సాహసించలేదు. చివరికి ఓ కీటకాన్ని పంపి వింటి నారిని కొరికేలా ప్రోత్సహిస్తాడు. తద్వారా విష్ణువుకు మెలకువల వస్తుందని భావిస్తాడు. కీటకం తాడును కొరకగానే పొరపాటున వింటిని ఉన్న బాణం తగిలి విష్ణువు తల ఎగిరిపోతుంది. దేవీ అనుగ్రహంతో గుర్రం తలను తెచ్చి విష్ణుమూర్తి శరీరానికి అతికించమని చెప్తుంది. అలా పునర్జన్మించిన విష్ణుమూర్తి హయగ్రీవుడి రూపంలో ఆ రాక్షసుని సంహరిస్తాడు. శ్రావణపౌర్ణమి రోజున హయగ్రీవ జయంతి నిర్వహిస్తారు.



# గజ్వేల్ జిజ్ఞాస హైస్కూల్ లో ముందస్తుగా రాఖీ పండగ వేడుకలు.




**రాయపోల్,ఆగస్టు7:** జిజ్ఞాస హైస్కూల్ గజ్వేల్ లో గురువారం ముందస్తుగా మానవియా సంబందాలను పటిష్ఠం చేస్తూ ప్రేమానురాగాలను పంచే రాఖీ పండుగా వేడుకలు విద్యార్థులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల క్లాస్ రూములలో విద్యార్థులు ఒకరికొకరు రాఖీలు కట్టించు కొని,స్వీట్లు పంచుకున్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు,ఉపాద్యాయులు తదితరులు పాల్గొన్నారు.

# శ్రీలంక జూనియర్ ఇంటర్నేషనల్ టోర్నిలో చదరం హంసినికి బంగారు పథకం



**క్రీడా ప్రతినిధి, ఆగస్టు 8 :** భారత బ్యాడ్మింటన్ అభిమానులకు గర్వకారణంగా, చదరం హంసిని శ్రీలంక జూనియర్ ఇంటర్నేషనల్ సిరీస్ 2025లో గర్ల్స్ సింగిల్స్ U15 టైటిల్‌ను గెలుచుకుంది. ఆగస్టు 5 నుంచి 8 వరకు కొలంబోలో జరిగిన ఈ టోర్నమెంట్‌లో ఆమె ఈ విజయం సాధించింది. ఇది హంసినికి మొదటి అంతర్జాతీయ విజయం కావడం విశేషం. ఈ విజయం ఆమె ప్రతిభను, పట్టుదలని, కృషిని ప్రతిబింబిస్తోంది. ప్రస్తుతం హంసిని శ్రీ భాస్కర్ బాబు సారథ్యంలో భాస్కర్ బాబు R3 బ్యాడ్మింటన్ అకాడమీలో శిక్షణ పొందుతోంది. ఈ విజయాన్ని పురస్కరించుకుని BBBA మరియు R3 మేనేజ్‌మెంట్ ఆమెను హృదయపూర్వకంగా అభినందించాయి. అంతర్జాతీయ స్థాయిలో పతకం సాధించి దేశానికి గౌరవం తీసుకురావడం పట్ల ఆనందం వ్యక్తం చేశారు. ఈ విజయం ఆమె శిక్షణా సంస్థకు గౌరవం తీసుకురావడమే కాకుండా, దేశవ్యాప్తంగా ఉన్న యువ ఆటగాళ్లకు ప్రేరణగా నిలుస్తుంది. ఎంతో ఉన్నత లక్ష్యాలవైపు దూసుకెళ్లాలని, కష్టపడి సాధించాలని ఈ విజయ గాథ చాటి చెబుతోంది.

# తెలంగాణ రాబిన్ వుడ్, ప్రజా వీరుడు పండుగ సాయన్న జయంతి వేడుకలు

**ఘనంగా నిర్వహించిన జిల్లా ముదిరాజ్ సంఘం నాయకులు**



**సమయం న్యూస్ వరంగల్ జిల్లా రిపోర్టర్...** ఆగస్టు 8 న పండుగ సాయన్న జయంతి సందర్భంగా వరంగల్ జిల్లా పర్వతగిరి మండల ముదిరాజ్ సంఘం అధ్యక్షులు య-ంవత పిట్టల రాజు ముదిరాజ్ గారి ఆధ్వర్యంలో ఘనంగా పండుగ సాయన్న జయంతి వేడుకలు జరుపుకోవడం జరిగింది ఈ సందర్భంగా జిల్లా నాయకులు రాజు ముదిరాజ్ గారు మాట్లాడుతూ పండుగ సాయన్న జయంతి మరియు వర్ధంతిలను తెలంగాణ ప్రభుత్వం అధికారికంగా నిర్వహించేలా చేయాలని గౌరవం శాసనసభ్యురాలు కె ఆర్ నాగరాజు గారికి, రాష్ట్ర పశుసంవర్ధక, క్రీడాల, మాత్స్య శాఖ మరియు యువజన సర్వీసుల మంత్రివర్యులు ముదిరాజ్ ముద్దుబిడ్డ డాక్టర్ వాకిటి శ్రీహరి గారికి త్వరలో కలిసి వినతి పత్రం ఇవ్వాలని ఈ సందర్భంగా తెలిపారు. అదేవిధంగా జిల్లాలో ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో త్వరలో పండుగ సాయన్న విగ్రహాన్ని ఏర్పాటుకు తగిన స్థలాన్ని పరిశీలించి విగ్రహాన్ని ఏర్పాటు చేసే విధంగా ముదిరాజ్ సంఘం చేస్తుందని ఈ సందర్భంగా తెలిపారు.ఇదే కార్యక్రమంలో ముదిరాజ్ మండల అధ్యక్షుడు రావుల రాజు గారు మాట్లాడుతూ ముదిరాజు ల కు పండుగ సాయన్న జీవితం ఆదర్శప్రాయంగా ఉం

# ఆక్స్ఫర్డ్ పాఠశాలలో ఘనంగా ముందస్తు రక్షాబంధన్








బాన్సువాడలోని ఆక్స్ఫర్డ్ పాఠశాలలో ముందస్తు రక్షాబంధన్ కార్యక్రమం ఎంతో ఉత్సాహంగా జరిగింది. అన్నదమ్ముల బంధానికి ప్రతీకగా చిన్నారులు ఒకరికి ఒకరు రాఖీలు కట్టుకుని సోదర సోదరీమణుల అనుబంధాన్ని చాటారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు కలిసి స్వయంగా తయారు చేసిన రాఖీలను వినియోగించడం ఈ కార్యక్రమంలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఈ వేడుకలో ప్రిన్సిపాల్ లావణ్య మేడం తో పాటు ఉపాధ్యాయులు పద్మ, వీణ, తేజస్విని, సౌభాగ్య, సుష్మా, మౌనిక, సవిత తదితరులు పాల్గొన్నారు. విద్యార్థుల ఉత్సాహం, ఉపాధ్యాయుల అంకిత భావం ఈ కార్యక్రమానికి మరింత అందం చేకూర్చాయి.

# ప్రభుత్వ నియమాలకు గండి

- రాజకీయ అండదండలతో
- దర్జాగా తరగతులు నిర్వహిస్తున్న శ్రీ చైతన్య





బాన్సువాడ పట్టణంలో గుర్తింపు లేకుండానే తరగతులు నిర్వహిస్తున్న శ్రీ చైతన్య హైస్కూల్ పై వివాదం మరింత ముదురుతోంది. గుర్తింపు లేకపోవడంతో విద్యాశాఖ అధికారులు సీజ్ చేసిన తరగతులకూ, కోర్టు ఉత్తర్వుల ద్వారా అనుమతులు రాకపోయినా, దర్జాగా క్లాసులు కొనసాగించడం పట్టణం లో చర్చనీయాంశంగా మారింది.

**క్రమంగా గుర్తింపు నిరాకరణ**

06.06.2025 న డీఈవో కార్యాలయం శ్రీ చైతన్య గుర్తింపు దరఖాస్తును తిరస్కరించింది. హైకోర్టు ద్వారా మళ్లీ గుర్తింపు కోసం ప్రయత్నించినా, 04.07.2025 న రెండోసారి కూడా డీఈవో కార్యాలయంతేల్చి చెప్పింది .అయినప్పటికీ, తరగతుల నిర్వహణను ఆపకుండా, సంస్థ దర్జాగా కార్యకలాపాలు కొనసాగిస్తోంది. ఇంత ధైర్యంగా నియమ నిబంధనలకు విరుద్ధంగా తరగతులు ఎలా నిర్వహిస్తారని విద్యావేత్తలు ప్రశ్నిస్తున్నారు.

**ఉదర గొట్టే ప్రచారం...**

హైదరాబాద్ నుండి వచ్చిన ఉపాధ్యాయుల బోధన పేరుతో ప్రచారం చేస్తూ, వాస్తవానికి స్థానికులతోనే బోధన నిర్వహించడం పై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఈ తీరుతో తల్లిదండ్రుల్లో, ముఖ్యంగా స్థానిక నిరుద్యోగ ఉపాధ్యాయుల్లో తీవ్ర అసంతృప్తి నెలకొంది. కార్పొరేట్ స్థాయి ఫీజులు వసూలు చేస్తూ, స్థానిక సిబ్బందిని తక్కువ జీతాలతో ఉంచడం పై కూడా ఆగ్రహం వ్యక్తమవుతోంది




కార్యాలయం సీజ్ చేసిన ...వేరేగాదుల్లో తరగతులు

సీజ్ చేసిన పాఠశాల గదుల పక్కనే, అదే ప్రాంగణంలో కోచింగ్ పేరుతో తరగతులు నిర్వహిస్తున్న ఈ వ్యవహారంపై విద్యార్థి సంఘాలు ఘాటుగా స్పందిస్తున్నాయి. "విద్యాశాఖ ఏం చేస్తున్నట్లు? కార్యాలయానికి సీజ్ చేసిన గదుల పక్కనే బోధన కొనసాగుతోంది. ఈ పాఠశాల దర్జాగా తరతులునిర్వహిస్తున్నా విద్యాశాఖ మాత్రం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడం అర్థం కావడం లేదు" అని విద్యార్థి సంఘాల నాయకులు ప్రశ్నిస్తున్నారు. ఇకనైనా అధికారులు స్పంచంకుంటే సోమవారం నుండి పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమాలు చేస్తామని పలువురు విద్యార్థి సంఘాల నాయకులు తెలిపారు.

**ఆ నాయకుడి అనుచరులు అధికారులకు ఫోన్ లు...?**

పక్క నియోజకవర్గం నుండి వచ్చిన ఒక కీలక నాయకుడి ప్రోద్బలంతోనే ఈ తంతు సాగుతుందని పట్టణంలో చర్చనీయాంశమైంది. ఇటీవల ఆ నాయకుడి అనుచరులు కొంత మంది విద్యాశాఖ ఉన్నతాధికారులతో ఫోన్ లో మాట్లాడి, "శ్రీ చైతన్యకు ఎందుకు అనుమతులు ఇవ్వడం లేదు?" అని ప్రశ్నించినట్లు సమాచారం. రాజకీయ అండదండలతో బరితెగించి కోచింగ్ పేరుతో తంగతులు నడపడం, అధికారులు మాత్రం చూసీ చూడనట్టుగా వ్యవహరించడం స్థానిక ప్రజల్లో చర్చనీయాంశంగా మారింది.

**తమకు కూడా అవకాశం కల్పించాలని నిరుద్యోగుల డిమాండ్...**

తమకు కూడా ఇలాగే గుర్తింపు లేకపోయినా అనుమతులు ఇవ్వాలని పలువురు నిరుద్యోగులు విద్యాశాఖను ప్రశ్నిస్తున్నారు. "ఒకరికి ప్రత్యేక రాయితీలు, మరొకరికి కఠిన నియమాలు" అనే విధానం పై సమాజంలోని ప్రతి వర్గం అసంతృప్తి వ్యక్తం చేస్తోంది. ఈ వివాదంపై విద్యాశాఖ ఎప్పుడు కఠిన చర్యలు తీసుకుంటుందో చూడాలి.

# అమృత్ 2.0 ద్వారా త్రాగునీటిని అందించేందుకు చర్యలు తీసుకోవాలి



**జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్**



**చెన్నూరు ఆగస్టు8( సమయం న్యూస్). :** అమృత్ 2.0 పథకంలో నీటి ట్యాంకు నిర్మాణ పనులను త్వరగా పూర్తిచేసి త్రాగునీటిని అందించే విధంగా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. శుక్రవారం జిల్లాలోని చెన్నూర్ పట్టణంలో కొనసాగుతున్న అమృత్ 2.0 నీటి ట్యాంక్ నిర్మాణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ మిషన్ భగీరథ పథకంలో ప్రతి ఇంటికి నల్లా కనెక్షన్ ద్వారా త్రాగునీటిని అందించడం జరుగుతుందని, ఈ క్రమంలో ప్రజలకు ఎలాంటి నీటి సమస్య లేకుండా అమృత్ 2.0 పథకం ద్వారా త్రాగునీటిని అందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని తెలిపారు. ఈ పథకం లో భాగంగా చేపట్టిన నీటి ట్యాంక్ నిర్మాణ పనులను వేగవంతం చేసి త్వరగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# గ్రేటర్ వర్షానంతర చర్యలు వేగవంతం చేయండి

- - క్షేత్ర అధికారులు, సిబ్బందికి జీహెచ్ఎంసీ కమిషనర్ ఆదేశం



**హైదరాబాద్, ఆగస్టు 8,( సమయం న్యూస్). :** గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో వర్షానంతర చర్యలు వేగవంతం చేయాలని జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్ వి కర్ణన్ క్షేత్ర అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఉదయ నగరంలో వర్ష ప్రభావిత ప్రాంతాలను జీహెచ్ఎంసి కమిషనర్ ఆర్‌వీ కర్ణన్, కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్ మోయినుద్దీన్‌తో కలిసి పరిశీలించారు. టోలిచౌకి ఎక్స్ రోడ్, హకీంపేట్ కేజీఎన్ నల్లా, మోతి దర్వాజా, అహ్మద్ కాలనీ, లంగర్‌హౌస్ హుడా చెరువు తదితర ప్రాంతాల్లో వర్షం ప్రభావాన్ని క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. అనంతరం ట్రాఫిక్ జాయింట్ సీపీ గజరావ్ భూపాల్‌తో కలిసి మల్కం చెరువును పరిశీలించి చెరువు నీటి మట్టాలు, ట్రాఫిక్ పరిస్థితులను సమీక్షించారు.

జీహెచ్ఎంసీ క్షేత్ర అధికారులు, సిబ్బంది నీటి పారుదల, ట్రాఫిక్ పోలీసు, హైడ్రా, జల మండలి, డీఆర్‌ఎఫ్ బృందాలతో సమన్వయంగా చేసుకుంటూ వర్షానంతర చర్యల్లో భాగంగా నీరు తొలగింపు, సిల్ట్ ,చెత్త తొలగింపు, రోడ్ల భద్రత పరమైన చర్యలను చేపట్టారు. నగర ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా నిరంతర పర్యవేక్షణ కొనసాగించాలని సూచించారు. వర్షపు నీరు నిలిచిన ప్రాంతాల్లోకి వెళ్లకూడదని, ప్రత్యామ్నాయ మార్గాలు వినియోగించుకోవాలని ప్రజలకు కమిషనర్ సూచించారు. క్షేత్ర స్థాయిలో ఏమైనా సమస్యలు ఉంటే వెంటనే జీహెచ్ఎంసి హెల్ప్‌లైన్ 040-21111111 కి తెలియజేయాలని ప్రజలను కోరారు. ఈ పర్యటనలో ఈ ఈ లాల్ సింగ్, డీసీ సైఫుల్లా, ఏఎంఓహెచ్ ఇర్షాద్ ఇక్బాల్ పాల్గొన్నారు.

**జీహెచ్ఎంసి కంట్రోల్ రూమ్ ఆకస్మిక తనిఖీ**

జీహెచ్ఎంసి ప్రధాన కార్యాలయంలోని కంట్రోల్ రూమ్‌ను కమిషనర్ ఆర్‌వీ కర్ణన్ శుక్రవారం సందర్శించారు. వర్షాల నేపథ్యంలో ప్రజల నుండి వచ్చిన ఫిర్యాదులపై ఓఎస్‌డీ అనురాధను ప్రశ్నించారు. వర్ష సంబంధిత ఫిర్యాదులను వెంటనే పరిష్కరించడంతో పాటు, ఫీల్డ్ టీంలకు త్వరగా తెలియజేయాలనీ కమిషనర్ ఆదేశించారు. రియల్-టైమ్ మానిటరింగ్ ద్వారా పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేస్తూ ప్రజలకు ఇబ్బందులు కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారూ.

# ప్రైమరీ హెల్త్ సెంటర్ ను ఆకస్మిక తనిఖీ

## జిల్లా కలెక్టర్ హనుమంత్ రావు



బీబీ నగర్ ఆగస్టు08( సమయం న్యూస్). : యాదాద్రి భువనగిరి జిల్లా బీబీనగర్ మండల కేంద్రంలో నూతన ప్రైమరీ హెల్త్ సెంటర్ భవన నిర్మాణ పనులను పరిశీలించిన యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంత రావు. శుక్రవారం రోజు బీబీనగర్ నిర్మాణంలో ఉన్న ప్రైమరీ హెల్త్ సెంటర్ ను పరిశీలించారు. బిల్డింగ్ లో ఉన్న రూమ్ ల లో ఇంకా పెండింగ్ లో ఏం పనులు ఉన్నాయి అని పరిశీలించారు. బిల్డింగ్ ముందు ప్లేస్ లో లెవల్ చేసి ,కొత్త గేటు ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులకు తెలిపారు. మిగిలిన పనులు త్వరగా పూర్తిచేసి వారం రోజుల్లోగా ప్రారంభోత్సవానికి సిద్ధం చేయాలని సదరు కాంట్రాక్టర్ ని ఆదేశించారు. అనంతరం బీబీనగర్ మండలం కేంద్రంలో ప్రైమరీ హెల్త్ సెంటర్ ని ఆకస్మికంగా జిల్లా కలెక్టర్ తనిఖీ చేయడం జరిగింది. అటెండెన్స్ రిజిస్టర్ ను పరిశీలించి డాక్టర్, సిబ్బంది ఎంత మంది విధులకు హాజరు అయ్యారా పరిశీలించారు. ఈరోజు ఓపికి ఎంత మంది పేషెంట్లు వచ్చారని అని వైద్యాధికారులను అడిగి తెలుసుకున్నారు. గత నెల లో ఎన్ని నార్మల్ డెలివరీ అయ్యాయని , ఇంకా ఎన్ని ఈ డి డి లు ఉన్నాయి అని సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ ఆసుపత్రి లో నార్మల్ డెలివరీ ల సంఖ్య పెరగాలని అన్నారు. ప్రజలకు ప్రభుత్వ ఆసుపత్రుల మీద నమ్మకం కలిగేలా వైద్యం చేయాలన్నారు. మందుల స్టాక్ ను పరిశీలించారు. అన్ని మందులను అందుబాటులో ఉండేలా చూడాలన్నారు.

అనంతరం బీబీనగర్ మండలం రహీంఖాన్ గూడ గ్రామంలో నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ ఇంటిని జిల్లా కలెక్టర్ పరిశీలించడం జరిగింది. గ్రామంలో మొత్తం ఎన్ని ఇందిరమ్మ ఇండ్లు మంజూరు అయ్యాయని,ఎన్ని ఇందిరమ్మ ఇండ్లు నిర్మాణాలు జరుగుతున్నాయ సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఇప్పటివరకు జరిగిన



నిర్మాణ పనులుకు డబ్బులు పడ్డాయా లేదా, ఏమి అయినా పెండింగ్ ఉన్నాయా అని ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులను అడిగి తెలుసుకున్నారు. ఇందిరమ్మ ఇంటి లబ్ధిదారురాలు అయిన లక్ష్మమ్మ గారి ఇంటి పనులు పరిశీలించడం జరిగింది. మేస్త్రీకి ఇంటి నిర్మాణానికి ఎంత డబ్బులు తీసుకుంటున్నాడని అడగడం జరిగింది. స్కేర్ ఫీట్ కి 300 రూపాయల కంటే ఎక్కువ ఇవ్వవద్దని కలెక్టర్ సూచించారు. ఇందిరమ్మ ఇంటి లబ్ధిదారులకు ఇటుక,సిమెంట్ తక్కువ ధరకే ఇవ్వాలని ఎంపీడీఓ, ఎం ఆర్ ఓ లు షాప్ యజమానులతో మాట్లాడి ధర నిర్ణయించారు అని చెప్పారు. ఇంటి నిర్మాణం పనులు త్వరగా పూర్తి చేసుకోవాలని లక్ష్మమ్మ కి సూచించారు. డబ్బులు విషయంలో ఆందోళన చెందాల్సిన అవసరం లేదు అని ప్రతి సోమవారం లబ్ధిదారుల అకౌంట్ లలో డబ్బులు జమ అవుతున్నాయి అని అన్నారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# మూసీ పరివాహక ప్రాంతాల్లో రవాణా ను డైవర్షన్ చేయండి.

**యాదాద్రి భువన గురి జిల్లా ఆగస్టు8(:సమయం న్యూస్,).**

మూసీ పరివాహక ప్రాంతంలో కాజ్ వేలు, వాగులు, బ్రిడ్జిల రాకపోకలపై అప్రమత్తంగా ఉంటూ, డైవర్షన్ ఏర్పాట్లు పక్కాగా నిర్వహించాలని , వరద ఉధృతి ఉన్నప్పుడు ఎవరినీ అనుమతించవద్దని యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంతరావు సంబంధిత అధికారులను ఆదేశించారు.



శుక్రవారం రోజు బీబీనగర్ పోచంపల్లి మధ్యలో ఉన్న రుద్రవెల్లి వద్ద మూసి కాలువ వద్ద వరద ఉద్ధృతిని పరిశీలించడం జరిగింది. నిన్న కురిసిన భారీ వర్షాల వల్ల జిల్లాలో ఎలాంటి నష్టం జరగకుండా ఉండేందుకు జూమ్ మీటింగ్ ద్వారా జిల్లా అధికారులను అప్రమత్త చేయడం జరిగిందన్నారు. జిల్లాలో ఇప్పటివరకు ఎలాంటి నష్టం జరగలేదని వర్షాలు ఆగిపోయేంతవరకు అన్ని శాఖలు అప్రమత్తంగా ఉంటూ ప్రజలకు ఇబ్బంది లేకుండా చూడాలన్నారు. హిమాయత్ సాగర్ లో నీటిని విడుదల చేసిన నేపథ్యంలోహైదరాబాద్ జిల్లాలో కురిసిన భారీ వర్షానికి మూసి వరద ప్రవాహం ఎక్కువ గా ఉందని నిన్న రాత్రి రోడ్డు పై నుండి వరద ప్రవాహం ఎక్కువ గా ఉ ఒడటంతో రోడ్డు ను కూడా మూసివేశారని అన్నారు. రెవెన్యూ,పోలీస్ యంత్రాంగమంతా అప్రమత్తంగా ఉంటూ ఓవర్ ఫ్లో అవుతున్న చెరువులు వాగుల వద్ద అప్రమత్తంగా ఉండాలన్నారు. వాగులు వంకలు దాటనియ్యరాదని, ప్రవహిస్తున్న వరదనీటిలో వెళ్లకుండా చూస్తున్నారని తెలిపారు. ప్రజలు కూడా అప్రమత్తంగా ఉండాలి

వరద ప్రవాహం ఎక్కువ గా ఉన్నపుడు రోడ్డు దాటడం లాంటివి చేసి ప్రమాదాలు తెచ్చుకోకూడదు అని తెలిపారు.

ఇంకా భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున జిల్లా రెవెన్యూ యంత్రంగా మొత్తంకూడా ఎలాంటి ప్రమాదాలు జరగకుండా ముందస్తు చర్యలు తీసుకుంటున్నారని తెలిపారు. మూసీ నది నుండి ప్లాస్టిక్ సీసాలు, ప్లాస్టిక్ సంచులు వ్యర్ధాలు తూముల వద్ద అడ్డుగా వచ్చాయని వాటిని వెంటనే క్లియర్ చేయాలని అధికారులను కోరారు. మనం ఎంత ప్లాస్టిక్ వ్యర్ధాలు ఉపయోగిస్తున్నామో తెలుస్తుందని



అన్నారు. గ్రామపంచాయతీలలో శిధిలావస్థలో ఉన్న ఇండ్లలో నివాసాలు ఉండొద్దని అన్నారు. వ్యాధులు ప్రబలకుండా ముందస్తుగా ప్రజలు కాచి చల్లార్చిన వాటర్ నే త్రాగాలన్నారు. గ్రామపంచాయతీ అధికారులు గ్రామాలపై నిరంతరం దృష్టి పెట్టి దోమలు ప్రబలకుండా వర్షపు నీరు నిలిచిన చోట ఆయిల్ బాల్స్ వేయాలన్నారు. మూగజీవాలకు కూడా ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఉ ఒడేందుకు వ్యాక్సిన్ వేయడం జరుగు తుందన్నారు. అనంతరం పోచంపల్లి మండల తహసీల్దార్ కార్యాలయాన్ని సందర్శి ంచిభూ భారతి రెవెన్యూ సదస్సులో ఎన్ని దరఖాస్తులు వచ్చాయో పరిశీలించారు. ఇప్పటివరకు ఎన్ని ఫైల్స్ క్లియర్ చేశారని, ఇంకా ఎన్ని పెండింగ్ ఉన్నాయో పరిశీలించారు. పెండింగ్ లో ఉ న్న దరఖాస్తులను వేగంగా క్లియర్ చేయాలని తహసీల్దార్ ని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# అగ్నిపథ్, ఎన్.ఎస్.సి.జి.డి పరీక్షల్లో పాసైన జిల్లా అభ్యర్థులకు ఉచిత గ్రౌండ్ శిక్షణ

## జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష



**పెద్దపల్లి, ఆగస్టు-08( సమయం న్యూస్). :-** అగ్నిపథ్, ఎన్.ఎస్.సి.జి.డి పరీక్షల్లో పాసైన జిల్లా అభ్యర్థులకు ఉచిత గ్రౌండ్ శిక్షణ అందిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో అగ్నిపథ్ , ఎస్ ఎస్ సి జి డి ఎగ్జామ్ పాస్ అయిన అభ్యర్థులకు ఆగస్టు 10 నుండి ఉచిత గ్రౌండ్ శిక్షణ ఇవ్వనున్నట్లు కలెక్టర్ తెలిపారు. ఈ శిక్షణలో భాగం గా అభ్యర్థులకు ఉచిత భోజనం ,వసతి సౌకర్యాలు కల్పిస్తామని, 45 రోజులపాటు శిక్షణ ఉంటుందని అన్నారు. అగ్నిపథ్ అభ్యర్థులకు 1600 మీటర్ల పరుగు పందానికి, ఎస్ ఎస్ సి జిడి అభ్యర్థులకు 5 కిలోమీటర్ల పరుగు పందానికి సంబంధించిన శిక్షణ ఉంటుందని, ఈ శిక్షణ తీసుకున్న అభ్యర్థులు ఆర్మీ ఎస్ ఎస్ సి జి డి ఫిజికల్ టెస్ట్ లో పాసై మిలిటరీ పారామిలిటరీ ఫోర్సెస్ లోకి వెళ్లాలనేది లక్ష్యమని , ఈ శిక్షణ జిల్లాకు చెందిన అభ్యర్థులు సద్వినియోగం చేసుకోవాలని మరిన్ని వివరాలకు 9949725997, 8333044460 నెంబర్ లో నందు సంప్రదించాలని కలెక్టర్ ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

# కొండాపూర్ న్యూ బ్లూమ్ పాఠశాలలో రక్షక బంధన్ వేడుకలు.





**శేరిలింగంపల్లి ఆగస్టు 8 సమయం న్యూస్, :** రక్ష బంధన్ పురస్కరించుకొని శేరిలింగంపల్లి నియోజకవర్గంలోని కొండాపూర్ న్యూ బ్లూ హైస్కూల్లో విద్యార్థిని విద్యార్థులు రాఖీలు సంబరాలు ఘనంగా జరుపుకున్నారు, రక్ష బంధన్ శుక్రవారం నిర్వహించుకున్నారు, విద్యార్థులు ఒకరికి ఒకరు రాఖీ కట్టుకుని విద్యార్థి నాకు నీవు రక్ష... నేను నీకు రక్ష.... మనము ఇద్దరము దేశానికి రక్ష అనే పరమార్ధాన్ని గుర్తు చేసుకున్నారు, రక్షక బంధన్ రక్ష ప్రధానంగా ఆత్మీయ అనురాగాల అనుబంధ ఆప్యాయతలకి అద్దం పడుతుందని సందేశాన్ని ఉపాధ్యాయులు విద్యార్థులకు వివరించారు, ఈ రక్షకబంధన్ కార్యక్రమంలో న్యూ బ్లూమ్ ప్రిన్సిపాల్. కిరణ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు

# ప్రభుత్వ ఆసుపత్రుల పట్ల ప్రజలకు నమ్మకం కలిగించాలి

## జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి



**ఖమ్మం, ఆగస్టు 8 : ( సమయం న్యూస్ ) :** ప్రభుత్వ ఆసుపత్రుల పట్ల ప్రజలకు నమ్మకం కలిగించాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు. జిల్లా ప్రధాన ఆసుపత్రిలో జిల్లా కలెక్టర్ అధ్యక్షతన శుక్రవారం హాస్పిటల్ డెవలప్మెంట్ సొసైటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూ సుడా క్రింద జిల్లా ఆసుపత్రిలో 13 అభివృద్ధి పనులు 25 కోట్ల రూపాయలతో చేపట్టామని అన్నారు. 23 కోట్ల 75 లక్షలతో చేపట్టిన 50 పడకల క్రిటికల్ కేర్ బ్లాక్ పెండింగ్ పనులు వేగవంతంగా పూర్తి చేయాలని అన్నారు. తక్కువ ఖర్చుతో రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు ఉపయోగపడే యంత్రాల కొనుగోలు, ఇతర సౌకర్యాల కల్పనకు ప్రతిపాదనలు అందించాలని, అవసరమైన నిధులను తప్పనిసరిగా మంజూరు చేస్తామని కలెక్టర్ తెలిపారు. ఖమ్మం ఆసుపత్రి నందు పేషెంట్లకు ఉపయోగపడే విధంగా టాయిలెట్స్ మరమ్మత్తు పనులను వేగంగా పూర్తి చేయాలని అన్నారు. జిల్లా ఆసుపత్రిలోని వివిధ విభాగాల్లో అందుబాటులో ఉన్న యంత్రాలు, వాటి ప్రస్తుత స్థితి గతులపై రిపోర్ట్ తయారు చేయాలని, మరమ్మత్తుకు గురైన యంత్రాలను బాగు చేసేందుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. ఆసుపత్రికి అవసరమైన ఇన్ ఫ్రా సౌకర్యాలపై ప్రభుత్వానికి నివేదిక అందించాలని అన్నారు. ఈ సమావేశంలో ఖమ్మం నగరపాలక సంస్థ కమీషనర్ అభిషేక్ అగస్త్య, జిల్లా ఆసుపత్రి సూపరింటెండెంట్ డా. ఎం. నరేందర్, జిల్లా వైద్య ఆరోగ్య అధికారిణి డా. కళావతి బాయి, డిసిహెచ్ఎస్ డా. రాజశేఖర్, వివిధ విభాగాల అధిపతులు, వైద్య శాఖ ఇఇ ఉమామహేశ్వరరావు, వైద్య అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# భారీవర్షాల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి



**బాన్సువాడ (సమయం న్యూస్) :** జిల్లాలో కొనసాగుతున్న భారీవర్షాల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ సూచించారు. పాల్వంచ మండలంలోని భవానీపేట్ నుండి పోతారం దారి మధ్య ఉన్న వాగు ఉధృతిని అదనపు కలెక్టర్ విక్టర్‌తో కలిసి ప్రత్యక్షంగా పరిశీలించారు. నీటి ప్రవాహం వంతెనకు చేరుకునే లోపే వాహన రాకపోకలు నిలిపివేయాలని ఆర్ % బీ ఈఈ మోహన్, డీఈలను కలెక్టర్ ఆదేశించారు. జిల్లాస్థాయి నుండి గ్రామస్థాయి వరకు అధికారులు ఎప్పటికప్పుడు లోతట్టు ప్రాంతాలను పరిశీలించి, ప్రజలకు ముందస్తు హెచ్చరికలు జారీ చేసి తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. అదేవిధంగా, జిల్లా కార్యాలయం నుండి అందే వర్ష సూచికలను వెంటనే గ్రామాల వాట్సాప్ గ్రూపులు, దండోరా వంటి మార్గాల ద్వారా ప్రజలకు చేరవేసి, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు.

# ప్లాస్టిక్ నియంత్రణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలి,

## పట్టణంలో ఆకస్మిక పర్యటన చేసిన :: (ఇన్చార్జి) జిల్లా కలెక్టర్ లెనిన్ వత్సల్ టోప్పో,



**మహబూబాబాద్ ఆగస్టు 8 ( సమయం న్యూస్() :** శుక్రవారం ఉదయం ఇంచార్జీ జిల్లా కలెక్టర్ లెనిన్ వత్సల్ టోప్పో మహబూబాబాద్ పట్టణంలోని వార్డులను, మార్కెట్, జక్షన్లు ప్రాంతాలలో జరుగుతున్న శానిటేషన్ పనులను ఆకస్మికంగా తనిఖీ చేశారు,పట్టణంలో ప్లాస్టిక్ నియంత్రణకు మున్సిపల్ సిబ్బంది, ప్రతి ఒక్కరూ కృషి చేయాలనీ, షెడ్యూల్ ప్రకారం ప్రతీ రోజూ వార్డులు మార్కెట్ జక్షన్లు ప్రాంతాలలో శానిటేషన్ చెయ్యాలని, నీరు నిలువ ఉండే ప్రదేశాలలో ఆయిల్ బాల్స్ వేయాలని, వ్యర్థాలను వెంట వెంటనే తరలించి, తడి చెత్త, పోడి చెత్త ను వేరు చేసి సెగ్రిజేషన్ చేయాలన్నారు,ప్రస్తుతం వర్షాలు కురుస్తునందున, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ముందస్తు జాగ్రత్తలు చర్యలు తీసుకోవాలని,ప్రజలు మున్సిపల్ ఆస్తి పన్నులు చెల్లించి పట్టణ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఆయన కోరారు, పెండింగ్ లో ఉన్న జంక్షన్లు, అంతర్గత రోడ్ల నిర్మాణం, కాలువలు, తదితర అభివృద్ధి పనులను పూర్తి చేయాలని సూచించారు,ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ టి. రాజేశ్వర్, శానిటరీ ఇన్స్పెక్టర్ సుధాకర్, తదితరులు ఉన్నారు.

# జిల్లా లో ముమ్మరంగా ఫ్రైడే ఫుడ్ విత్ చిల్డ్రన్ కార్యక్రమం.

**జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ..**



జయశంకర్ భూపాల పల్ల ఆగస్టు8(బీసమయం న్యూస్). : జిల్లాలోని ప్రభుత్వ వసతి గృహాల్లో ఆహార పదార్థాల నాణ్యత, మెనూ అమలు పరిస్థితులను స్వయంగా పరిశీలించేందుకు జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ చేపట్టిన Friday Food with Children కార్యక్రమం కొనసాగుతోంది. ఈ కార్యక్రమంలో భాగంగా, ప్రతి శుక్రవారం ప్రత్యేక అధికారులు వసతి గృహాలను సందర్శించి విద్యార్థులతో సహపంక్తి భోజనం చేస్తున్నారు. భోజన పదార్థాల నాణ్యత, రుచి, మెనూ ప్రకారం వంటవిధానం, పరిశుభ్రత తదితర అంశాలను పరిశీలిస్తున్నారు. విద్యార్థుల నుండి భోజనంపై అభిప్రాయాలు సేకరించి, తక్షణ సవరణ చర్యలు తీసుకోవాలని సంబంధిత సిబ్బందికి సూచిస్తున్నారు. జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థుల ఆరోగ్య పరిరక్షణలో భాగంగా పోషకాహారంతో కూడిన నాణ్యమైన భోజనం అందించడమే ఈ కార్యక్రమ ప్రధాన లక్ష్యమని తెలిపారు. అలాగే వసతి గృహాల నిర్వహణలో ఎటువంటి నిర్లక్ష్యం జరిగినా కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన స్పష్టం చేశారు.

# ప్రజలందరికీ శ్రావణ శుక్రవారం వరలక్ష్మి వ్రత మహాత్య శుభాకాంక్షలు...

**కార్పొరేటర్ రాగం నాగేందర్ యాదవ్...**





**శేరిలింగంపల్లి ఆగస్టు 8 సమయం న్యూస్.** :శేరిలింగంపల్లి కార్పొరేటర్ రాగం సుజాత నాగేందర్ యాదవ్ నల్లగండ్లలోని వర్టెక్స్ కింగ్ స్టన్ పార్క్ విల్లాస్ లోని స్వగృహంలో రాగం కుటుంబ సమేతంగా "శ్రావణ శుక్రవారం వరలక్ష్మి వ్రతాన్ని" విశేషమైన పుష్పలంకరణతో, పండిత శ్రేష్ఠులతో సాంప్రదాయబద్ధంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీ వరలక్ష్మి వ్రత వేడుకలో శేరిలింగంపల్లి శాసనసభ్యులు ఆరెకపూడి గాంధీ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు, ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన అమ్మవారి అన్న ప్రసాదాలను స్వీకరించి స్వీకరించారు, ఈ సందర్భంగా రాగం నాగేందర్ యాదవ్ మాట్లాడుతూ ప్రజలందరిపై శ్రీ వరలక్ష్మీ అమ్మవారి కృపాకటాక్షాలు ఎల్లవేళలా ఉండాలని ఆకాంక్షిస్తూ ప్రజలందరికీ శ్రీ శ్రావణ శుక్రవారం వరలక్ష్మి వ్రతం శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పటాన్చెరు కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్, సీనియర్ నాయకులు మారబోయిన రాజు యాదవ్, చందానగర్ సీఐ విజయ్, ఆనంద్, మాజీ కౌన్సిలర్ సోమదాస్, మాజీ కౌన్సిలర్ రవీందర్ రావు, మాజీ కౌన్సిలర్ మోహన్ గౌడ్, సీనియర్ నాయకులు రామ్ మోహన్ రెడ్డి, కొండల్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి రవీందర్ గౌడ్, కృష్ణ రెడ్డి, రవి యాదవ్, కొయ్యాడ లక్ష్మణ్ యాదవ్, గోపాల్ యాదవ్, శ్రీనివాస్, బస్వరాజ్, రాగం వారి కుటుంబ సభ్యులు, ముఖ్య నాయకులు బంధు మిత్రులు తదితరులు పాల్గొన్నారు.

# గ్రేటర్ లో ముమ్మరంగా రోడ్ సేఫ్టీ స్పెషల్ డ్రైవ్

**ఇప్పటి వరకు 8583 మరమ్మత్తులు**

**వాహనదారులకు ఇబ్బంది లేకుండా సురక్షిత రోడ్ల లను మార్చడమే లక్ష్యంగా రోడ్ సేఫ్టీ**

**.కమీషనర్ ఆర్ వి కర్ణన్**

**హైదరాబాద్, ఆగస్టు 08** వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని నగరంలో ట్రాఫిక్‌కు ఆటంకం కలిగించే రోడ్డుపై ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా సాఫీగా ప్రయాణం చేసుకునే విధంగా రోడ్డు పై ఏర్పడిన గుంతలు (పాట్ హోల్స్), క్యాచ్ పిట్స్ మరమ్మత్తులు, సెంట్రల్ మీడియన్ చిన్న పనులపై జీహెచ్ఎంసీ ప్రత్యేక డ్రైవ్ చేపట్టింది..ఇప్పటి వరకు గురించిన 11,642 కు గాను కు గాను, 8583 మరమ్మత్తులు పూర్తి చేసారు. నేపథ్యంలో శుక్రవారం నాడు 423 క్యాచ్ పిట్స్ మరమ్మతులు చేయగా క్యాచ్ పిట్స్ కవర్ రీప్లేస్మెంట్ 225 చేశారు. 3 లోకేష్ లలో సెంట్రల్ మీడియం ను మరమ్మతులు చేసినట్లు సి ఈ సహదేవ్ రత్నాకర్ తెలిపారు. ఈ ప్రత్యేక డ్రైవ్ లో భాగంగా ప్రజల ప్రయాణానికి ఇబ్బంది కలగకుండా చర్యలు తీసుకుంటున్నామని జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్.వి. కర్ణన్ తెలిపారు. రోడ్లను సురక్షితంగా మార్చడమే లక్ష్యంగా రోడ్డు సేఫ్టీ ఈ చర్యలు కొనసాగుతాయని పేర్కొన్నారు..

# ఇంకుడు గుంతలు మన జిల్లా మన నీరు కి కేంద్రం నుండి ప్రశంసల వెల్లువలు

- **విభిన్నమైన ఆలోచన కి శ్రీకారం చుట్టిన కలెక్టర్ ని అభినందించిన జల శక్తి సెక్రెటరీ అర్చన వర్మ ఐఏఎస్**



**జనగాం ఆగస్టు8( సమయం న్యూస్).:** భవిష్యత్ తరాల వారికి నీటి ఏద్దడి సమస్య లు రావద్దన్న బృహత్ ఆలోచనతో... మన జిల్లా మన నీరు అనే కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ రిజ్వాన్ భాషా షేక్ శ్రీకారం చుట్టారు ఇందులో భాగంగా ప్రభుత్వ కార్యాలయాల్లో, పాఠశాలలో, ఆసుపత్రిలో... ఇలా ప్రతి ప్రభుత్వ సంస్థలలో ఇంకుడు గుంతను నిర్మించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు

అధికారులను ఆదేశించడానికి ముందుగా.. కలెక్టరేట్లో అలాగే క్యాంప్ ఆఫీస్ ఆవరణలో అతి తక్కువ ఖర్చు తో ఇంకుడు గుంతను ఎలా నిర్మించవచ్చో..కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ , అదనపు కలెక్టర్ పింకేష్ కుమార్ వివిధ శాఖలకు చెందిన అధికారులు భాగస్వామ్యం అయ్యి... ఇంకుడు గుంతను నిర్మించి చూపించారు కలెక్టర్ ఆదేశాలను ఒక సామాజిక బాధ్యతగా తీసుకున్న వివిధ శాఖల అధికారులు వారికి ఇచ్చిన టార్గెట్ ని అతి తొందరగా పూర్తి చేశారు అలా ఇప్పటి వరకు 7175 ఇంకుడు గుంతల నిర్మాణాలను పూర్తి చేశారు ఇప్పుడు ఈ అంశం రాష్ట్ర, కేంద్ర స్థాయిలో ఒక చర్చనీయంశంగా మారింది సెక్రటరీ మినిస్ట్రీ అఫ్ జలశక్తి, నేషనల్ వాటర్ మిషన్ డైరెక్టర్ అర్చన వర్మ ఐఏఎస్ తన సోషల్ మీడియా % వేదికగా కలెక్టర్ అలాగే జిల్లా యంత్రాంగాన్ని అభినందిస్తు పోస్ట్ చేసారు ఒక్క నీటి బొట్టు వృధా కాకుండా చేపట్టిన ఇంకుడు గుంత నిర్మాణలు అందరికి స్ఫూర్తి దాయకమని అభినందించారు

ఇంతటి మంచి కార్యక్రమం లో భాగస్వామ్యం చేసినందుకు... కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ కి జిల్లా అధికారులు కృతజ్ఞతలు తెలిపారు

ఎప్పుడు రొటీన్ గా ఉండే కార్యాలయం విధులతో పాటు ఇలాంటి కార్యక్రమాలు చేయడం వల్ల సామజిక బాధ్యత పెంపొందుతుందిఏదైనా మంచి పని చేయండి అని చెప్పే ముందు మనం దాన్ని ఆచరించాలి అని తెలిసేలా చేసిన కలెక్టర్ గారికి ధన్యవాదములు అలాగే ఇంత మంచి కార్యక్రమాలు చేసిన అధికారులు...వారు భవిష్యత్ లో ఎక్కడ పని చేస్తున్న జిల్లా ప్రజలు గుర్తు చేసుకుంటారు

మాధురి షా, జడ్పీ సీఈఓ ఇంకుడు గుంతల నిర్మాణం ప్రాధాన్యత గురించి ప్రజలకు క్షుణ్ణం గా తెలియాలి అంటే... ప్రభుత్వ అధికారులు గా ముందు మనం పని చేసే చోట నిర్మించాలి.. అని కలెక్టర్ గారు చెప్పడం మా అధికారులందరికి చాలా బాగా నచ్చింది అందుకే దీన్ని ఒక ఆఫీస్ టార్గెట్ లా తీసుకోకుండా... వ్యక్తిగత, సామాజిక బాధ్యత గా తీసుకోని..మాకు ఇచ్చిన టార్గెట్ కంటే దాదాపు అన్ని శాఖల అధికారులం ఎక్కువ గా చేసాం. ఇంత గొప్ప కార్యక్రమానికి కేంద్ర స్థాయిలో గుర్తింపు రావడం చాలా సంతోషం గా ఉంది విభిన్న ఆలోచన లతో ముందుకు పోతున్న జిల్లా కలెక్టర్ గారు నిజం గా మాకు రోల్ మాడల్ గా నిలుస్తున్నారు

# బిపి మండల్ జయంతి ఉత్సవాలలో జగదీశ్వర్ గౌడ్

- **తెలంగాణ రాష్ట్ర బీసీ ఐక్యవేదిక అధ్యక్షులు బేరి రామచంద్ర యాదవ్...**



**శేరిలింగంపల్లి ఆగస్టు 8 సమయం న్యూస్.** : ఐక్యవేదిక కార్యవర్గం ఆమోదంతో మండల్ జయంతి ఉత్సవాలు జరుపుకొనుటకు నిశ్చయించటం జరిగిందని తెలంగాణ రాష్ట్ర బీసీ ఐక్యవేదిక అధ్యక్షులు భేరి చందర్ యాదవ్ తెలిపారు .బీహార్ మాజీ ముఖ్యమంత్రి బిందెశ్వర్ ప్రసాద్ మండల్ జయంతిని పురస్కరించుకొని వారోత్సవాలు ఈనెల 7 నుండి 25 ఆగస్టు వరకు జయంతి వేడుకలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు, విశ్వనాథ్ ప్రతాప్ సింగ్ ప్రధానమంత్రిగా ఉన్న కాలంలో బిసి కమిషన్ బిపి మండల్ చైర్మన్ఆధ్వర్యంలో భారతదేశ వ్యాప్తంగా తిరిగి బీసీలకున్న సమస్యలు, కష్టాలను పేదరికాన్ని దృష్టిలో ఉంచుకొని 42 సిఫార్సులను ప్రభుత్వానికి అందజేయడం జరిగిందన్నారు. అందులో కేవలం కొన్ని సిఫార్సులను మాత్రమే అమలు చేయడం జరిగిందని. మండల్ వారోత్సవాలలో భాగంగా శేరిలింగంపల్లి నియోజకవర్గ కాంగ్రెస్ ఇంచార్జ్ బీసీ ప్రముఖ నాయకుడు కార్పొరేటర్ జగదీశ్వర్ గౌడ్ ద్వారా బేరి రామచంద్రర్ యాదవ్ ఆధ్వర్యంలో బీపీ మండల్ చిత్రపటానికి పూలమాలతో సత్కరించి ఘనంగా నివాళు లర్పించడం జరిగిందన్నారు. ముఖ్యంగా ఈ సందర్భంలో బేరీ రామచంద్ర యాదవ్ మాట్లాడుతూ బీసీలకు రాజ్యాధికారమే ముఖ్యమని పేదరికం దూరమవ్వటానికి అధికారమే అవసరమని బీపీ మండల్ గారి 42 సిఫార్సులను అమలు పరచాలని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు కోరడం జరిగింది. బిసి కులాలు, కుల సంఘాలు బీసీలందరు ఏకమై మన సమస్యలను తీర్చుకోవడానికి పేదరికాన్ని నిర్మూలించడానికి అదేవిధంగా విద్య వైద్యం ఉపాధి ఉద్యోగం మరెన్నో మరెన్నో ..ప్రజల జీవన విధానంలో పేదరికము, ఆత్మహత్యలు ఆకలి చావులు లేని రాజ్యం తీసుకొని రావటానికి ఎస్సీ ఎస్టీ బీసీలను కలుపుకొని బహుజన రాజ్యమును స్థాపిద్దామని అధికారం గెలుచుకుందామని దానికి అందరూ సహకరించాలని బీసీలు ఏ పార్టీలో ఉన్న బీసీల ఉద్యమాన్ని గుర్తించి సహాయ సహకారాలు అందించాలని పిలుపునిచ్చారు. ముఖ్య నాయకులు కూడా సహాయ సహకారాలు అందించాలని జగదీశ్వర్ గౌడ్ గారిని కోరడం జరిగింది.



అదేవిధంగా ప్రజలందరూ పోరాటం చేసి ఏకమై ఐకమత్యంతో అధికారం సాధించడమే లక్ష్యంగా పెట్టుకోవాలని ఇందుకు బీసీలందరూ పాల్గొని ఎస్సీ, ఎస్టీ బీసీ మైనార్టీలను కలుపుకొని మన సమస్యలను దూరం చేసుకుందామని తెలియజేయడం జరిగింది . శేరి లింగంపల్లి నియోజకవర్గకాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కార్పొరేటర్ జగదీశ్వర్ గౌడ్ గారిని విన్నవిస్తూ బీసీ పోరాటంలో మీరు కాంగ్రెస్ పార్టీలో ఉన్న మాకు సహకరించి సహాయ పడాలని కోరడం జరిగింది. బీపీ మండల్ జయంతి వారోత్సవాలు పురస్కరించుకొని శేరిలింగంపల్లి కాంగ్రెస్ ఇంచార్జ్ కార్పొరేటర్ జగదీశ్వర్ గౌడ్ గారు తన సందేశంలో

నిన్ననే ఢిల్లీలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ ఇవ్వాలని పేదరిక నిర్మూలనలో భాగంగా బీసీలకు న్యాయం చేద్దామని జంతర్ మంతర్ వద్ద ధర్నా చేయడం జరిగింది అనేకమంది కాంగ్రెస్ ఎంపీలు నాయకులు అందరూ పాల్గొని బీసీలకు మద్దతుగా నిలబడి ముఖ్యమంత్రి అయిన రేవంత్ రెడ్డి గారు బిసి ధర్నాలో పాల్గొని 42 శాతం రిజర్వేషన్ తప్పకుండా ఇస్తామని పేర్కొనడం జరిగింది. జగదీశ్వర్ గౌడ్ బీసీలు ఉద్యమం చేసిన సహాయ సహకారాలు ఎప్పటికీ మీ వెంట ఉంటాయని అదేవిధంగా మీరందరూ ఐకమత్యంతో ఏకంగా ఉండి పోరాటం చేయాలని బీసీలు ఎస్సీ ఎస్టీ మైనార్టీ అందరిని కలుపుకొని పోవాలని ఐకమత్యంతో చేసిన ఉద్యమాలు అన్ని సక్సెస్ అవుతాయని తెలియజేసుకుంటూ ప్రజలు కూడా సహకరించాలని పిలుపునిచ్చారు, ఈ సమావేశంలో శ్రీలత సెక్రటరీ వాసు అభిమాన మహిళలు పాల్గొనడం జరిగింది. బీసీ సంఘాల నాయకులు బీసీ పెద్దలు నాయకులు కార్యకర్తలు అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొని కార్యక్రమం జయప్రదం చేశారు .

# రైతు బజార్ లను వినియోగించుకోవాలి

- **కలెక్టర్ టి వినయ్ కృష్ణారెడ్డి**
- **నగరంలోని రైతు బజార్ లను సందర్శించిన కలెక్టర్**
- **బస్తీ దవాఖాన, అమృత్ పథకం పనుల పరిశీలన**



**నిజామాబాద్, ఆగస్టు 08( సమయం న్యూస్).** రైతులకు మెరుగైన మార్కెట్ సదుపాయాలు, వినియోగదారులకు నేరుగా తక్కువ ధరలకే కూరగాయలు, పండ్లను అందించాలనే ఉద్దేశ్యంతో ప్రభుత్వం ఏర్పాటు చేసిన రైతు బజార్ లను వర్తకులు, వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ టి.వినయ్ కృష్ణారెడ్డి సూచించారు. నిజామాబాద్ నగరంలోని పులాంగ్, వీక్లీ మార్కెట్, సుభాష్ నగర్, శివాజీ నగర్ ప్రాంతాలలోని రైతు బజార్ లను కలెక్టర్ శుక్రవారం సందర్శించారు. వీటితో పాటు హమాల్వాడిలోని వీధి వ్యాపారుల వర్తక సముదాయం, పాత గంజులో కొనసాగుతున్న మార్కెట్ లను, ఖలీల్ వాడిలో నిర్మితం అవుతున్న సమీకృత వెజ్, నాన్ వెజ్ మార్కెట్ సముదాయ భవనాన్ని పరిశీలించారు. చాలా చోట్ల రైతు బజార్లను కూరగాయల విక్రేతలు వినియోగించడం లేదని గమనించిన కలెక్టర్, అందుకు గల కారణాలను ఆరా తీశారు. వినియోగదారులు రైతు బజార్ల లోపలికి రావడం లేదని, రోడ్లకు ఆనుకుని ఇరువైపుల గల దుకాణాల నుండే కూరగాయలు కొంటున్నారని, దీనివల్ల తాము కూడా రోడ్ల పక్కన అమ్మకాలు జరపాల్సి వస్తోందని పలువురు కలెక్టర్ దృష్టికి తెచ్చారు. అయితే, రోడ్ల పక్కన విక్రయాలు జరపడం వల్ల ట్రాఫిక్ కు అంతరాయం ఏర్పడుతుందని, పెద్ద మొత్తంలో నిధులు వెచ్చిస్తూ ప్రభుత్వం ఏర్పాటు చేసిన రైతు బజార్లను వినియోగించుకోవాలని కలెక్టర్ హితవు పలికారు. కూరగాయలు, పండ్ల విక్రేతలు అందరూ రోడ్ల పక్కన కాకుండా రైతు బజార్ లలో అమ్మకాలు జరిపేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. నిర్ణీత ధరలకు అమ్మకాలు, నాణ్యత, శుభ్రత వంటివి పాటిస్తూ, అందరూ రైతు బజార్లలోనే విక్రయాలు జరిపితే, వినియోగదారులు ఇక్కడికే వచ్చి కొనుగోలు చేస్తారని అన్నారు. ట్రాఫిక్ సమస్యలు, పార్కింగ్ వసతులు తదితర అంశాల గురించి కలెక్టర్ అధికారులతో చర్చించి, సూచనలు చేశారు. మధ్యవర్తుల జోక్యం లేకుండా నేరుగా వినియోగదారులకు తాజా కూరగాయలు అందేందుకు రైతు బజార్లు వేదికగా నిలవాలని సూచించారు. రైతు బజార్ల అభివృద్ధికి, అవసరమైన మౌలిక సదుపాయాల కల్పన కోసం ప్రతిపాదనలు సిద్ధం చేయాలని మున్సిపల్, మార్కెటింగ్ శాఖల అధికారులను ఆదేశించారు. పాత గంజు ప్రాంతంలో ఆక్రమణలను గుర్తించి, వాటిని తొలగించేందుకు డీ-మార్కింగ్ చేయాలని సూచించారు. అన్ని రైతు బజార్లు ఉపయోగంలోకి వచ్చేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. కాగా, అమృత్ పథకం కింద తాగునీటి సరఫరాను మెరుగుపర్చేందుకు నగరంలోని నాందేవ్ వాడ, గౌతంనగర్ లలో కొనసాగుతున్న మంచినీటి ట్యాంకుల నిర్మాణ పనులను కలెక్టర్ తనిఖీ చేశారు. పనులు మందకొడిగా సాగడం పట్ల అసంతృప్తి వ్యక్తం చేశారు. పనులను వేగంగా చేపట్టాలని కాంట్రాక్ట్ కంపెనీ ప్రతినిధులకు సూచించారు. అంతకుముందు నాగారం 300 క్వార్టర్స్ లోని బస్తీ దవాఖానను కలెక్టర్ తనిఖీ చేశారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ, మెరుగైన వైద్య సేవలు అందించాలని మెడికల్ ఆఫీసర్ కు సూచించారు. కలెక్టర్ వెంట నగర పాలక సంస్థ కమిషనర్ దిలీప్ కుమార్ తదితరులు ఉన్నారు.

# ఖబర్దార్ దుబ్బాక.. ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి.

- టీఎన్జీవోస్ అధ్యక్షులు & జేఏసీ చైర్మన్ దొంత నరేందర్
- జిల్లా పాలనాధికారికి , ఇతర ప్రభుత్వ అధికారులకు నాన్ గెజిటెడ్, గెజిటెడ్, ఫోర్త్ క్లాస్ ఎంప్లాయిస్ యూనియన్ ,అండగా ఉంది.
- మెదక్ పాలనాధికారి మనోభావాలు దెబ్బతిస్తే అనుచిత వ్యాఖ్యలు చేస్తే ఎటువంటి వారైనా సహించం
- నిరసనలు నినాదాలతో మారుమోగిన కలెక్టరేట్ కార్యాలయ ప్రాంగణం
- బహిరంగ క్షమాపణ చెప్పాలి , అనుచిత వ్యాఖ్యలను వెనక్కు తీసుకోవాలి. లేదంటే రాజీనామా చేయాలి.



**మెదక్ ఆగస్టు8( సమయం న్యూస్). :** కలెక్టరేట్ కార్యాలయం ప్రాంగణంలో భోజన విరామ సమయంలో దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి పై నిరసనలు తెలియజేస్తూ టీఎన్జీవోస్ ఎంప్లాయిస్ యూనియన్ తెలంగాణ నాన్ గెజిటెడ్, గెజిటెడ్, ఫోర్త్ క్లాస్ ఎంప్లాయిస్ యూనియన్, ఉపాధ్యాయ సంఘాల నాయకులు ముక్తకంఠంతో నినాదాలు చేశారు. ఈనెల 7వ తేదీన మెదక్ కలెక్టరేట్ కార్యాలయ ధర్నా చౌక్ వద్ద టిఆర్ఎస్ పార్టీ రైతు ధర్నా నిర్వహించారు ఆ సమావేశంలో దుబ్బాక శాసనసభ్యులు మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ గారి మీద చేసిన అనుచిత వ్యాఖ్యలను తెలంగాణ నాన్ గెజిటెడ్ ఆఫీసర్స్ యూనియన్ తీవ్రంగా ఖండించింది. ఈ వ్యాఖ్యలకు నిరసనగా ముక్తకంఠంతో ఖండిస్తూ తెలంగాణ ఉద్యోగ జేఏసీ శుక్రవారం కలెక్టరేట్ కార్యాలయం ప్రాంగణంలో పెద్ద ఎత్తున ఆందోళన చేశారు.. మెదక్ జిల్లా టిఎన్జీవోస్ యూనియన్ అధ్యక్షులు దొంత నరేందర్ మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ ప్రభుత్వం ప్రవేశపెట్టే ప్రజా సంక్షేమ పథకాల పట్ల జవాబుదారితనం పారదర్శకత లక్ష్యంగా మెదక్ జిల్లాలో ప్రగతి పాలన అందిస్తున్నారని అన్నారు. ప్రభుత్వ అధికారులు రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లేందుకు వివిధ శాఖల అధికారులతో సమన్వయం చేస్తూ సమిష్టిగా కృషి చేస్తారని అటువంటి సమర్ధ వంతమైన పాలన అందిస్తున్న జిల్లా కలెక్టర్ గారి మీద అనుచిత వ్యాఖ్యలు చేయడం సబబు కాదని తెలిపారు. ఇకముందు ఏ ప్రభుత్వ అధికారికైనా అన్యాయం జరిగితే వారిపై అనుచిత వ్యాఖ్యలు చేస్తే వారికి అండగా మెదక్ జిల్లా తెలంగాణ ఎంప్లాయిస్ జేఏసీ అండగా ఉండటంతో పాటు వారిని రక్షించడం జరుగుతుందన్నారు. రాజకీయాలకతీతంగా ఏ ప్రభుత్వం అధికారంలో ఉన్న ఆ ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలను చిత్తశుద్ధితో ప్రభుత్వ అధికారులు అమలు చేస్తారన్నారు. మెదక్ జిల్లా ప్రభుత్వ అధికారులు విధుల పట్ల చిత్తశుద్ధి అంకితభావంతో పనిచేస్తారని తెలిపారు. ఇకముందు ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా పటిష్ట చర్యలు తీసుకుంటామన్నారు. ఈ నిరసన కార్యక్రమంలో జేఏసీ సెక్రెటరీ జనరల్ విటల్, టీఎన్జీవో సెక్రెటరీ రాజ్ కుమార్, క్లాస్ ఫోర్త్ అధ్యక్ష కార్యదర్శులు జలగం ప్రసాద్, రిజ్వాన్ అలీ, ఎస్ టి యు అధ్యక్షులు రాజగోపాల్ గౌడ్, టి టి యు అధ్యక్షులు శివయ్య, టిఎన్జీవో జిల్లా సహాధ్యక్షులు ఇక్బాల్ పాషా, కోశాధికారి చంద్రశేఖర్, ఉపాధ్యక్షులు ఫజాలుద్దీన్, సంయుక్త కార్యదర్శులు శంకర్, శివాజీ, పంచాయతీ కార్యదర్శుల ఫోరం అధ్యక్షులు జంగం నగేష్, గోపాల్, శ్రీ హర్ష ధనుంజయ్, జిల్లా అధికారులు, పెద్ద ఎత్తున ఉద్యోగులు పాల్గొన్నారు.

## సిపిఐ తెలంగాణ రాష్ట్ర నాలుగవ మహాసభలను జయప్రదం చేయండి...

### జిల్లా కార్యవర్గ సభ్యులు సిపిఐ రామకృష్ణ పిలుపు.



**శేరిలింగంపల్లి. ఆగస్టు 8 సమయంన్యూస్. :** తెలంగాణ రాష్ట్ర నాలుగో మహాసభలు ఈనెల 19 నుండి 22 వరకు మేడ్చల్ జిల్లా కుత్బుల్లాపూర్ గాజులరామారంలో జరుగు మహాసభల గోడపత్రికను శుక్రవారం శేరిలింగంపల్లి సిపిఐ పార్టీ. కార్యాలయంలో మహాసభల వాల్ పోస్టర్ జిల్లా కార్యవర్గ సభ్యులు సిపిఐ రామకృష్ణ ఆవిష్కరించారు,భారతదేశా స్వాతంత్రం ఉద్యమంలో నేటి తెలంగాణ ఉద్యమంలో. ఎంతోమంది కమ్యూనిస్టులు ప్రాణాలు పణంగా పెట్టి పోరాడినారన్నారు.

ప్రజా సమస్యలు ఉన్నంతవరకు కమ్యూనిస్టు పార్టీ ఉంటుంది.దేశంలోనే 100 సంవత్సరాల నిండిన పార్టీ ఏదైనా ఉంది అంటే. భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ ఒకటే తెలంగాణలో నిజాం సర్కారుకు వ్యతిరేకంగా పోరాడిన పార్టీ సిపిఐ. వందల ఎకరాలు భూములు పంచి తెలంగాణ ప్రాంతాన్ని భారతదేశంలో విలీనం చేయుట కొరకు కమ్యూనిస్టులు ఎంతో క్రియాశీలమైన పోరాటాలు నిర్వహించినారని ఆ ఫలితమే తెలంగాణ ప్రాంతం భారత దేశంలో విలీనమైనదన్నారు,తెలంగాణ రాష్ట్ర నాలుగో మహాసభలు. రాష్ట్ర భవిష్యత్తు నిర్ణయాలు చేయబోతోంది రాష్ట్ర ప్రజలకు కావలసిన హక్కుల కోసం వాటి పరిష్కార కోసం ఉద్యమ ప్రణాళిక చేయాలని పిలుపునిచ్చారు, ఈ కార్యక్రమంలో సిపిఐ రంగారెడ్డి జిల్లా కౌన్సిల్ సభ్యులు కె చందు యాదవ్ శేరిలింగంపల్లి నియోజకవర్గం సహాయ కార్యదర్శి. కే సుధాకర్ మండల నాయకులు తుపాకుల రాములు. ఎస్ నారాయణ.సురేష్ ముదిరాజ్. రఘు భాస్కర్ ఎం వెంకటేష్ కే.కాం మహిళా కామ్రేడ్ సురేఖ ఏఐఎస్ఎఫ్ నాయకులు నితీష్.తేజ. దేవేందర్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు

## ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో అర్ధ వార్షిక మహాజన సభ

### హాజరైన రైతులు సహకార సంఘ డైరెక్టర్లు



**వెల్దుర్తి ఆగస్టు 08, (సమయం న్యూస్ ):** వెల్దుర్తి మండల కేంద్రంలో శుక్రవారం సహకార సంఘంలో అర్ధవార్షిక మహాజన సభ నిర్వహించారు. ఇందులో భాగంగా పిఎసిఎస్ చైర్మన్ అనంతరెడ్డి మాట్లాడుతూ సహకార సంఘం సభ్యుల సహకారంతో 20 ఏళ్లుగా చైర్మన్ గా కొనసాగుతున్నానని ఈ సందర్భంగా ఆయన తెలిపారు.రైతులకు సంఘం నుండి 15 కోట్ల రుణాలు ఇచ్చి, తిరిగి పొందడం కూడా జరుగుతుందని, గోదాంల నిర్మాణానికి 20 శాతం సబ్సిడీ కుడా వచ్చిందన్నారు. కోల్డ్ స్టోరేజ్ కోసం రెండు కోట్లు మంజూరు కాగా కోటి రూపాయలు సబ్సిడీ ఉందని, ఈ కోల్డ్ స్టోరేజ్ నీ త్వరలో వెల్దుర్తి మండల కేంద్రంలో నిర్మిస్తామని ఈ సందర్భంగా ఆయన తెలిపారు. శెట్టిపల్లి కలాన్ గ్రామంలో సంఘం తరఫున నాబార్డ్ నిధులతో రైస్ మిల్లు నిర్మాణం చేపడుతున్నామన్నారు.ఈ కార్యక్రమంలో సహకార సంఘం సీఈఓ అశోక్, మేనేజర్ రవీందర్, వైస్ చైర్మన్ మురళి, సహకార సంఘం డైరెక్టర్లు మరియు సహకార సంఘం సభ్యులు పాల్గొన్నారు.

## అక్రమ మట్టి తరలింపును ఆపేదెవరు ?



**పటాన్ చెరు (జిన్నారం), ఆగస్ట్ 8, సమయం న్యూస్ :** సంగారెడ్డి జిల్లా మండల కేంద్రమైన జిన్నారంలో సర్వే నంబరు 1లో123 ఎకరాల భూమిని రైతుల నుండి ప్రభుత్వం తీసుకొని హెచ్ఎండిఏ కు, కొన్ని పరిశ్రమలకు కేటాయించడం జరిగింది. పరిశ్రమలకు కేటాయించిన స్థలంలో చదునుకోసమని మైనింగ్ పర్మిషన్లు తీసుకొని, బయటి వారికి యదేచ్ఛగా మట్టిని విక్రయించడం జరుగుతుంది. ఇట్టి విషయమై స్థానికులు, భూ బాధిత రైతులు ప్రశ్నించగా ప్రభుత్వం మాకు అనుమతులు ఇచ్చిందంటూ బుకాయిస్తున్నారు. ఈ విషయంలో భూములు కోల్పోయిన రైతులకు నేటికీ న్యాయం జరగలేదు. భూములు కోల్పోయిన రైతులు స్థానిక మండల రెవెన్యూ అధికారులకు, జిల్లా కలెక్టర్ కు విన్నవించుకున్న ఫలితం మాత్రం లేకుండా పోయింది. దీంతో రైతులు వాహనాలను ఆపి మాకు న్యాయం జరిగే వరకు పనులు జరగనివ్వమని అంటున్నారు. పరిశ్రమలకు కేటాయించిన స్థలంలో మైనింగ్ అధికారులు అనుమతులు ఇస్తే రాత్రి సమయంలో గుట్టుచప్పుడు కాకుండా బయట వ్యక్తులకు అక్రమ మట్టి రవాణా జరిపించడం ఇంతవరకు సమంజసమని స్థానిక మాజీ ఎంపీటీసీ అంతిరెడ్డి గారి శ్రీనివాస్ రెడ్డి డిమాండ్ చేశారు. స్థానిక రెవెన్యూ అధికారులు చూసి చూడనట్టు ఉండడం దేనికి సంకేతం అని ఆయన అన్నారు. ఇకనైనా అధికారులు రైతులకు న్యాయం చేయాలని, లేని పక్షంలో పెద్ద ఎత్తున పోరాటం చేస్తామని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాస్ గౌడ్, నిఖిల్ గౌడ్, మ్యాదరి రమేష్, విట్టలయ్య, పాల్గొన్నారు.

## యూరియా వాడకంపై రైతులకు అవగాహన

### వ్యవసాయ అధికారి ఝూన్సీ ఆధ్వర్యంలో



**వెల్దుర్తి ఆగస్టు 08, ( సమయం న్యూస్ ): :** వెల్దుర్తి మండల కేంద్రంలో వ్యవసాయ అధికారి ఝూన్సీ ఆధ్వర్యంలో రైతులకు యూరియా వాడకం పైన అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగావ్యవసాయ విస్తరణ అధికారి మాజిద్ అలీ మాట్లాడుతూ ఈ పద్ధతిలో యూరియా ఎకరానికి 60కిలోలు వాడాలని సూచించారు. అది కూడా 3 దఫాలుగా వాడాలని, మొదటి సారి ఎకరానికి 20కిలోలు, రెండోసారి 20 రోజుల తర్వాత 20కిలోలు, మళ్ళీ మూడోసారి మరో 20రోజులకు 20కిలోలును ఒక్క ఎకరానికి వాడాలని సూచించారు. ఇలా చేయడం ద్వారా ముఖ్యంగా మొక్కకు నత్రజని డిమాండ్ ఎక్కువగా ఉన్నప్పుడు, వివిధ విధానాల ద్వారా నష్టానికి గురయ్యే నత్రజని మొత్తాన్ని తగ్గిస్తుందని, పంట తీసుకునే విధానంతో నత్రజని లభ్యతను సమలేఖనం చేయడం ద్వారా, విభజించి వాడటం వలన మొక్క ఎక్కువ నత్రజనిని గ్రహించేలా చేస్తుంది. దీని వలన అధిక దిగుబడి మరియు మెరుగైన పోషక వినియోగం లభిస్తుంది. మరియు వరికు సోకే చీడపీడల నష్టం తగ్గిస్తుంది.అధికంగా యూరియా వాడకం వల్ల నేల నిస్సారంగా మారుతుంది.మొక్కకు కావలసిన పోషకాలు సమతౌల్యత దెబ్బతింటుంది. సూక్ష్మ పోషకాల లోపాలు అధికమవుతాయి. యూరియా వాడటం వల్ల మొక్కల్లో శాకీయోత్పత్తి పెరిగి చీడపీడలో ఉధృతి పెరుగుతుంది. మరియు భూగర్భ జలాలు నైట్రేట్, నత్రజనితో కాలుష్యమైతాయి. అందుకే యూరియాను విడతల వారిగా ఉపయోగించాలని రైతులకు వ్యవసాయ విస్తరణ అధికారి మాజిద్ అలీ వివరించారు.అధిక మోతాదులో యూరియా ను వాడొద్దని అన్నారు.ఈ కార్యక్రమంలో ఏఈఓ మాజిద్ అలీ, రైతులు సిద్ధిరాములు, తదితరులు పాల్గొన్నరు.

## ఎరువుల కృత్రిమ కొరతను సృష్టించొద్దు కలెక్టర్

### డిమాండ్కు అనుగుణంగా నిలువలు ఉన్నాయి,

### మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్



**మెదక్ ఆగస్టు08( సమయం న్యూస్) :** ఎరువులు కుత్రిమ కొరత సృష్టించద్దని

డిమాండ్కు అనుగుణంగా నిలువలు ఉన్నాయని జిల్లా కలెక్టర్ . రాహుల్ రాజ్ స్పష్టం చేశారు. శుక్రవారం మెదక్ జిల్లా హవేలీ ఘన్పూర్ మండల కేంద్రంలో తెలంగాణ ఆగ్రో రైతు సేవా కేంద్రం ను కలెక్టర్ అకస్మికంగా తనిఖీ చేశారు డిమాండ్కు అనుగుణంగా ఉన్న నిలువలను పరిశీలించారు, స్టాక్ వివరాలను, ఆన్లైన్ తదితర వివరాలను డీలర్లు అడిగి తెలుసుకున్నారు, ప్రస్తుత సీజన్కు అనుగుణంగా జిల్లాలో తగినన్ని ఎరువులు విత్తనాలు ఉన్నాయని కొంతమంది కృత్రిమ కొరత సృష్టించాలని చూస్తే కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఆయన అన్నారు,

రైతులతో స్వయంగా మాట్లాడుతూ వారికి కావలసిన సమాచారాన్ని అందించారు రైతులు జిల్లాలో ముందస్తుగా ఎరువులు విత్తనాలు యూరియా డిఏపి తదితర ఫర్టిలైజర్స్ లో వ్యవసాయ శాఖ సిద్ధంగా ఉంచుకోవడం జరిగిందని తెలిపారు, కల్తీ విత్తనాలు అమ్మిన, అధిక ధరలకు విక్రయించిన, ప్రభుత్వం సూచించిన ప్రకారం సంబంధిత వ్యక్తులపై శాఖపరమైన చర్యలు తీసుకుని లైసెన్సులు రద్దు చేయడం జరుగుతుందని అన్నారు, టాస్క్ ఫోర్స్ సిబ్బంది క్రమం తప్పకుండా సంబంధిత అధికారులతో కలిసి ఎరువుల దుకాణాలను తనిఖీ చేయాలని సూచించారు, ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు

## జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవాన్ని విజయవంతం చేయాలి

- 1 సంవత్సరం నుండి 19 సంవత్సరాల
- వయసు గల పిల్లలందరికి ఆల్బెండజోల్
- మాత్రలు తప్పనిసరిగా వేయించాలి
- ఆగస్ట్ 11 నుండి 18 వరకు



ఆదిలాబాద్ ఆగస్టు8( సమయం న్యూస్) : ఈ నెల 11 న జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవం సందర్భంగా జిల్లా కలెక్టర్ రాజర్షి షా క్యాంప్ కార్యాలయం లో వైద్య ఆరోగ్య, ఇతర శాఖల అధికారులతో కలెక్టర్ సమన్వయ సమావేశం నిర్వహించారు నులిపురుగుల నిర్మూలన కోసం 1 నుండి 19 సంవత్సరం లోపు వారందరికీ ఈ నెల 11 న ఆల్బెండోజల్ మాత్రలు తప్పకుండా వేయించాలని జిల్లా కలెక్టర్ అన్నారు.జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ 1 నుండి 19 ఏళ్ల వయసున్న ప్రతి ఒక్కరికీ నులిపురుగుల నిర్మూలనకు ఆల్బెండజోల్ మాత్రలను వైద్య ఆరోగ్యశాఖ తో పాటు సంబంధిత ప్రభుత్వ విభాగాలు , ప్రైవేట్ పాఠశాలలు ,కళాశాలల యాజమాన్యాలు తప్పకుండా శ్రద్ధ తీసుకోవాలని ఆదేశించారు. పిల్లలలో నులిపురుగులు ఉండటం వలన వారిలో పోషకాహార లోపం ,రక్తహీనత ,ఆకలి మందగించడం తదితర ఆరోగ్య సమస్యలు ఏర్పడతాయని, వీటివల్ల చదువుపై ఏకాగ్రత కోల్పోతారని అన్నారు. అన్ని పాఠశాలలు, హాస్టల్స్, అంగన్వాడీ కేంద్రాలలో ఈ మాత్రలు అందుబాటులో ఉన్నాయని పిల్లలందరికి కేంద్రాల లోనే మాత్రలు తప్పకుండా ఇప్పించాలన్నారు. ప్రతి అంగన్వాడీ కేంద్రం ,పాఠశాల, కళాశాల కు ఒక అంగన్వాడీ కార్యకర్త ,ఆశా కార్యకర్త,ఏఎన్ఎం లను అనుసంధానం చేయాలని , రెసిడెన్షియల్ పాఠశాలలు కళాశాలలో ఉన్న ఏఎన్ఎంలు లేదా నర్సింగ్ ఆఫీసర్లు సంబంధిత ఇన్స్టిట్యూషన్ లో అందరికీ అందించాలన్నారు.జిల్లాలో ఒకటి నుండి 19 సంవత్సరాల లోపు 2,06,127 మంది పిల్లలు ఉన్నారన్నారు. రెసిడెన్షియల్ విద్యా సంస్థల రీజనల్




కో ఆర్డినేటర్లను కార్యక్రమంలో భాగస్వాములుగా చేయాలన్నారు. ఈ సందర్భంగా జాతీయ నులి పురుగుల దినోత్సవ పోస్టర్ ను ఆవిష్కరించారు.ఈ సమావేశం లో జిల్లా వైద్య శాఖాధికారి రవీందర్ రాథోడ్, మాట్లాడుతూ మాత్రల వలన ఎలాంటి ఆరోగ్య సమస్యలు రావని, ఎలాంటి అపోహలు ఉండకూడదన్నారు.

మధ్యాహ్నం భోజనం అనంతరం మాత్రలు విద్యార్థులకు చేయాలనీ, ఒక సంవత్సరం నుండి రెండు సంవత్సరాల వారికి సగం మాత్ర , రెండు సంవత్సరాలు ఆ పై 19 సంవత్సరాల వయసు గల వారికి ఒక పూర్తి మాత్ర నమిలి మింగించాలన్నారు.ప్రోగ్రాం అధికారులు, ఆర్బీఎస్కే బృందాలు ఈ కార్యక్రమాన్ని పర్యవేక్షిస్తాయని, ఏదైనా కారణంతో 11 వ తేదీన మాత్రలు వేసుకోలేని వారికోసం 18వ తేదీన మాపప్ రౌండ్ నిర్వహించడం జరుగుతుందన్నారు.ఈ సమావేశంలో adl dmho, సంబధిత శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.జిల్లా పౌర సంబంధాల అధికారిణి అదిలాబాద్ గారి చే జారీ చేయనైనది.

# ఆసియాకప్‌లో పలువురు ఆటగాళ్లు ఆడటంపై సందిగ్ధత!?



ఇటీవల ఇంగ్లాండ్ తో జరిగిన ఐదు టెస్టుల అండర్సన్-టెండూల్కర్ ట్రోఫీలో భారత్ అద్భుతమైన పోరాట పటిమ ప్రదర్శించిన సంగతి తెలిసిందే. 2-2తో సిరీస్ సమం చేయడంతో పాటు సిరీస్ లో తన ఆధిపత్యాన్ని ప్రదర్శించింది. ఓవరాల్‌గా 33 సెషన్లలో భారత్ ఆధిక్యం దక్కించుకోగా. ఇంగ్లాండ్ కేవలం 21 సెషన్లకే పరిమితమైంది. మరో 18 సెషన్లలో ఇరుజట్లు ఉమ్మడిగా ఆధిక్యంలో నిలిచాయి. అయితే ఈ సిరీస్ లో విశేషంగా రాణించిన కొంతమంది భారత స్టార్లు వచ్చే నెల నుంచి జరగబోయే ఆసియాకప్ లో ఆడటం లేదు. వర్క్‌లోడ్ మేనేజ్మెంట్‌లో భాగంగా ఇంగ్లాండ్‌పై 3 టెస్టులు మాత్రమే ఆడిన బుమ్రా.. 14 వికెట్లతో రాణించాడు. తనను మెయిన్‌గా టెస్టులకు, అదికూడా ముఖ్యమైన సిరీస్ లలోనే ఆడిస్తుండటంతో టీ20 ఫార్మాట్ లో జరుగుతున్న ఆసియాకప్‌కు తను దూరమయ్యే అవకాశముంది. హెడ్‌కోచ్‌గా గౌతం గంభీర్ శకం మొదలయ్యాక, టీ20లలో యువరక్తంతో ఉరకలెత్తుతోంది. ఈ క్రమంలో భారత టెస్టు కెప్టెన్ శుభమాన్ గిల్‌కు ఓపెనింగ్ పొజిషన్‌లో చోటు దక్కడం లేదు. సంజూ శాంసన్, అభిషేక్ శర్మ కుదురుకోవడంతో ఫస్ట్ చాయిస్ ఓపెనర్లుగా వారినే ఆడిస్తున్నారు. కాస్త స్లోగా ఆడే గిల్.. టీ20 ప్రణాళికల్లో ప్రస్తుతానికి లేడు. అలాగే దులీప్ ట్రోఫీలో నార్త్ జోన్‌కు తను కెప్టెన్‌గా ఎన్నికవడంతో ఆసియాకప్ నుంచి తను తప్పుకోక తప్పదు. తను కూడా ఓపెనర్ కాబట్టి, ప్రస్తుతానికి ఓపెనింగ్ పొజిషన్ లో ఖాళీ లేకపోవడంతో తను ఆసియా కప్ లో ఆడలేడు. అలాగే తను వెస్ట్ జోన్ కు ఎంపికవడంతోపాటు దులీప్ ట్రోఫీలో ఆడటంతో జైస్వాల్ ఆసియా కప్ ను మిస్సవ్వక తప్పదు. 2022 ప్రపంచకప్ తర్వాత టీ20 జట్టులో రాహుల్ అంతగా ఆడటం లేదు. ఫస్ట్ చాయిస్ వికెట్ కీపర్ గా సంజూ శాంసన్ ఆడుతుండటంతో తనకు చాన్స్ దొరకడం లేదు. అలాగే రిజర్వ్ లుగా ధ్రువ్ జురెల్, జితేశ్ శర్మ ఉండటంతోపాటు వయసు పైబడటం కూడా రాహుల్ ను ఈ ఫార్మాట్ కు దూరం చేస్తోంది. అయితే ఐపీఎల్లో తను ఈ ఏడాది 500కుపైగా పరుగులు సాధించాడు. ఇంగ్లాండ్ పర్యటనలో పాదం గాయంతో ఐదో టెస్టుకు దూరమైన వికెట్ కీపర్ బ్యాటర్ రిషభ్ పంత్ .. ఆసియా కప్ కు కూడా దూరమవడం ఖాయం. అయితే గత కొంతకాలంగా తను టీ20 ప్రణాళికల్లో లేడు. ఫస్ట్ చాయిస్ వికెట్ కీపర్ గా సంజూ ఉండటంతో పంత్ కు చాన్స్ దక్కడం లేదు. అయితే టెస్టుల్లో మాత్రం పంతే ఫస్ట్ చాయిస్ వికెట్ కీపర్ గా ఉన్నాడు. ఇక ఈ ఏడాది ఐపీఎల్లో పేలవ ఫామ్ రిత్యా, కొంతకాలంపాటు టీ20ల్లో జాతీయ జట్టు తరపున చోటు దక్కక పోవచ్చు.

# టెస్టు ర్యాంకింగ్స్‌లో దిగజారిన గిల్ ర్యాంకు



ఇంగ్లాండ్ తో జరిగిన అండర్సన్-టెండూల్కర్ ట్రోఫీలో భారత టెస్టు కెప్టెన్ శుభమాన్ గిల్ విశేషంగా రాణించిన సంగతి తెలిసిందే. ఇంగ్లాండ్ గడ్డపై రాణించలేడని, అతని అత్యధిక స్కోరు కేవలం 30 మాత్రమే అని ఎద్దేవా చేసిన వారికి, తన బ్యాటింగ్ తో సమాధానమిచ్చాడు. ఈ సిరీస్ లో నాలుగు సెంచరీలతోపాటు 754 పరుగులు సాధించి, సిరీస్ లీడింగ్ రన్ స్కోరర్ గా నిలిచాడు. అలాగే ఒక టెస్టు సిరీస్ లో అత్యధిక పరుగులు చేసిన టీమిండ్షియా కెప్టెన్ గా కూడా గిల్ రికార్డులకెక్కాడు. అయినప్పటికీ, ఇటీవల ప్రకటించిన ఐసీసీ టెస్టు ర్యాంకింగ్స్ లో తన ర్యాంకు దిగజారింది. ఏకంగా నాలుగు స్థానాలు కోల్పోయాడు. ఇందుకు గల కారణం.. అతను ఐదో టెస్టులో విఫలం కావడమేనని తెలుస్తోంది. ఈ టెస్టులో కేవలం 32 రన్స్ మాత్రమే చేసిన గిల్ ఏకంగా టాప్-9 నుంచి 13కి పడి పోయాడు. అయినా కూడా ఈ మ్యాచ్ లో ఇండియా ఆరు పరుగులతో థ్రిల్లింగ్ విక్టరీ నమోదు చేసి, సిరీస్ ను 2-2తో సమం చేసింది. ఇక ఈ సిరీస్ లోనే ఐదు టెస్టులు ఆడిన ఏకైక భారత పేసర్ గా నిలిచిన మహ్మద్ సిరాజ్.. లీడింగ్ వికెట్ టేకర్ గా నిలిచాడు. ఆఖరి టెస్టులో ఒక ఫైఫర్ తో సహా తొమ్మిది వికెట్లు తీశాడు. దీంతో తన కెరీర్ బెస్ట్ ర్యాంకుకు చేరుకున్నాడు. తాజాగా ప్రకటించిన ర్యాంకుల్లో 15వ ర్యాంకును దక్కించుకున్నాడు. అదే టెస్టులో విశేషంగా రాణించిన మరో పేసర్ ప్రసిధ్ కృష్ణ కూడా తన కెరీర్ బెస్టు ర్యాంకును దక్కించుకున్నాడు. తను 59వ ర్యాంకును దక్కించుకున్నాడు. ఇక ఈ సిరీస్ లో ఐదో టెస్టులో ఆడిన గస్ అట్కిన్సన్ టాప్ -10 బౌలర్ల జాబితాలో చోటు దక్కించుకోగా, ఇంగ్లీష్ లీడింగ్ వికెట్ టేకర్ జోష్ టంగ్ కూడా కెరీర్ బెస్టు ర్యాంకును దక్కించుకున్నాడు. మరోవైపు ఐదో టెస్టులో సెంచరీతో దుమ్ము రేపిన యువ ఓపెనర్ యశస్వి జైస్వాల్ కెరీర్ బెస్టు ర్యాంకును దక్కించుకన్నాడు. ఈ సిరీస్ లో తొలి టెస్టులో శతకం బాదిన ఈ యువ ఓపెనర్.. ఆ తర్వాత కీలకమైన ఐదోటెస్టు రెండో ఇన్నింగ్స్ లోనూ సెంచరీని బాదాడు. నిజానికి ఈ టెస్టులో టాప్ స్కోరర్ తనే. ఈక్రమంలో అటు ఆస్ట్రేలియా, ఇటు ఇంగ్లాండ్ లోనూ ఆడిన తొలి టెస్టులోనే సెంచరీ చేసిన భారత క్రికెటర్ గా గుర్తింపు పొందాడు. ఇప్పుడీ టాప్-5 ర్యాంకుతో తనలో మరింతగా ఆత్మవిశ్వాసం పొందిందనడలో సందేహం లేదు. జో రూట్, హేరీ బ్రూక్ వరుసగా తొలి రెండు స్థానాలలో కొనసాగుతున్నారు.

## అత్యాచారం కేసులో చిక్కుకున్న క్రికెటర్ హైదర్ అలీ



పాకిస్తానీ క్రికెటర్ హైదర్ అలీని అత్యాచారం కేసులో భాగంగా గ్రేటర్ మాంచెస్టర్ పోలీసులు అరెస్టు చేశారు. అతను పాకిస్తాన్ ఎ జట్టుతో కలిసి ఇంగ్లాండ్ పర్యటనలో ఇంగ్లాండ్ లయన్స్‌తో ఆడటానికి వెళ్ళాడు. మాంచెస్టర్ పోలీసులు ఇమెయిల్ ద్వారా, "సోమవారం, ఆగస్టు 4, 2025న అత్యాచారం గురించి ఫిర్యాదు అందిన తర్వాత, మేము 24 ఏళ్ల వ్యక్తిని అరెస్టు చేశాము" అని తెలిపారు. పాకిస్తానీ క్రికెటర్ హైదర్ అలీ 2 అక్టోబర్ 2000న పాకిస్తాన్ పంజాబ్‌లో జన్మించాడు. 24 ఏళ్ల ఈ క్రికెటర్ పాకిస్తాన్ తరపున వన్డే, టీ20లలో అంతర్జాతీయ మ్యాచ్‌లు ఆడాడు, అతను భారత్‌తో జరిగిన ప్రపంచ కప్‌లో మ్యాచ్ ఆడాడు. అతనికి ఆటలో రోహిత్ శర్మ ఆదర్శమని చెబుతుంటాడు. అతను పీఎస్ఎల్ లో ఇస్లామాబాద్ యునైటెడ్ తరపున ఆడతాడు. 2023లో ఇంగ్లాండ్ కౌంటీ క్లబ్ డెర్బీషైర్‌లో ఆడాడు. హైదర్ అలీ 2 అక్టోబర్ 2000న పాకిస్తాన్ పంజాబ్‌లోని అటాక్‌లో జన్మించాడు, అతని తండ్రి భూస్వామి. అతని సోదరుడు రావల్పిండి రామ్స్ తరఫున ఆడాడు. 2015లో హైదర్ టేప్ బాల్ క్రికెట్‌తో తన క్రికెట్ కెరీర్‌ను ప్రారంభించాడు, కొన్ని నెలల తర్వాత అతను అల్ ఫైసల్ క్రికెట్ క్లబ్‌లో చేరాడు. హైదర్ అలీ సెప్టెంబర్ 2019లో ఫస్ట్ క్లాస్ క్రికెట్‌లోకి ప్రవేశించాడు. తర్వాత ఏడాది అంటే సెప్టెంబర్ 1, 2020న అంతర్జాతీయ క్రికెట్‌లో అరంగేట్రం చేశాడు. వికీపీడియా ప్రకారం, అలీ భారతీయ క్రికెటర్ రోహిత్ శర్మను తన ఆదర్శంగా తీసుకుంటాడని తెలుస్తోంది. హైదర్ అలీ 35 అంతర్జాతీయ టీ20 మ్యాచ్‌లలో భారత్‌తో కేవలం ఒకే మ్యాచ్ ఆడాడు, అది కూడా ప్రపంచ కప్‌లో. అతను 23 అక్టోబర్ 2022న మెల్‌బోర్న్ క్రికెట్ గ్రౌండ్‌లో జరిగిన టీ20 ప్రపంచ కప్‌లో భారత్-పాకిస్తాన్ మ్యాచ్‌లో ఆడాడు. అయితే, అతను అందులో సరిగా ఫెర్ఫార్మ్‌చేయలేకపోయాడు. అతను కేవలం 2 పరుగులు చేసి హార్దిక్ పాండ్యా బౌలింగ్‌లో అవుట్ అయ్యాడు. ఈ మ్యాచ్‌లో భారత్ 4 వికెట్ల తేడాతో విజయం సాధించింది, ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్ విరాట్ కోహ్లీ 82 పరుగులతో అద్భుతమైన ఇన్నింగ్స్ ఆడాడు. అలీ నవంబర్ 1, 2020న జింబాబ్వేతో జరిగిన మ్యాచ్‌లో తన వన్డే అరంగేట్రం చేశాడు. దీనికి ముందు, సెప్టెంబర్ 1, 2020న, అతను ఇంగ్లాండ్‌తో మాంచెస్టర్‌లో టీ20 అరంగేట్రం చేశాడు. అతను 2023లో చివరిసారిగా అంతర్జాతీయ మ్యాచ్ ఆడాడు, అయితే అతను త్వరలో జాతీయ జట్టులోకి తిరిగి వస్తాడని భావించారు, కాని అంతకు ముందే అత్యాచారం ఆరోపణలు వచ్చాయి. దీని తరువాత, పాకిస్తాన్ క్రికెట్ బోర్డు విచారణ పూర్తయ్యే వరకు అతన్ని సస్పెండ్ చేసింది. హైదర్ అలీ 2 వన్డే మ్యాచ్‌లలో మొత్తం 42 పరుగులు చేశాడు. 35 టీ20 అంతర్జాతీయ మ్యాచ్‌లలో 32 ఇన్నింగ్స్‌లలో అలీ 124.69 స్ట్రైక్ రేట్‌తో 505 పరుగులు చేశాడు, ఇందులో 3 అర్ధ సెంచరీలు ఉన్నాయి.

# జడేజా నిలకడైన బ్యాటర్..

**ఇంగ్లండ్ గడ్డపై అత్యంత నిలకడగా రాణించాడు**

**జడేజాపై మాజీ క్రికెటర్ అజయ్ జడేజా ప్రశంసల జల్లు**



టీమిండియా స్టార్ ఆల్‌రౌండర్ రవీంద్ర జడేజాపై మాజీ క్రికెటర్ అజయ్ జడేజా ప్రశంసల జల్లు కురిపించాడు. ఇంగ్లండ్ గడ్డపై అత్యంత నిలకడగా రాణించిన బ్యాటర్ అని కొనియాడాడు. ఐదు టెస్ట్‌ల అండర్సన్-సచిన్ ట్రోఫీలో రవీంద్ర జడేజా 10 ఇన్నింగ్స్‌ల్లో 86 సగటుతో 516 పరుగులతో రాణించాడు. ఇందులో ఐదు హాఫ్ సెంచరీలతో పాటు ఓ శతకం ఉంది. మరోవైపు శుభ్‌మన్ గిల్ 754 పరుగులతో టాప్ స్కోరర్‌గా నిలిచాడు. ఓ టెస్ట్ సిరీస్‌లో అత్యధిక పరుగులు చేసిన తొలి భారత కెప్టెన్‌గా చరిత్రకెక్కాడు. దాంతో ఈ సిరీస్ 2-2తో సమమైంది. తాజాగా ఈ సిరీస్ గురించి మాట్లాడిన అజయ్ జడేజా.. శుభ్‌మన్ గిల్ కంటే రవీంద్ర జడేజా మెరుగ్గా, నిలకడగా రాణించాడని కొనియాడాడు. ' రవీంద్ర జడేజా గురించి ఏం చెప్పాలి? అతను ఏం చేయగలడో అది చేశాడు. అద్భుత ప్రదర్శన కనబర్చాడు. శుభ్‌మన్ గిల్ 754 పరుగులు చేశాడు. అతను అత్యుత్తమ ప్రదర్శన కనబర్చాడని అందరూ కొనియాడుతున్నారు. జడేజా 500 ప్లస్ రన్స్ చేశాడు. కానీ శుభ్‌మన్ గిల్ కంటే నిలకడగా రాణించాడు. అతను నాలుగు ఇన్నింగ్స్‌ల్లో ఔట్ అవ్వలేదు. మరో ఎండ్‌లో అతనికి సహకారం లభించలేదు. కేవలం రెండు ఇన్నింగ్స్‌ల్లో మాత్రమే త్వరగా ఔటయ్యాడు. రవీంద్ర జడేజా ప్రదర్శనతోనే టీమిండియా ఈ సిరీస్‌ను సమం చేసుకుంది. లార్డ్స్ టెస్ట్‌లోనూ అద్భుత ప్రదర్శన కనబర్చాడు. ఆఖరి టెస్ట్‌లో మెరుగ్గా ఆడాడు.'అని అజయ్ జడేజా చెప్పుకొచ్చాడు.

# 17 ఏళ్లకే కెప్టెన్.. వరల్డ్ రికార్డు నమోదు!



టీమిండియాలో 14 ఏళ్ల వైభవ్ సూర్యవంశి రికార్డుల గురించే ఇటీవల కాలంలో ఎక్కువగా చర్చ జరిగింది. అయితే, క్రికెట్ ప్రపంచంలో సంచలనం సృష్టించిన మరొక యువ కెప్టెన్ జాక్ వుకుసిక్ గురించి తెలుసుకుందాం. ఈ యువ క్రికెటర్ ఇంటర్నేషనల్ క్రికెట్‌లో అత్యంత పిన్న వయస్కుడైన కెప్టెన్‌గా రికార్డు సృష్టించాడు. టీనేజ్ క్రికెటర్లు అంతర్జాతీయ క్రికెట్‌లోకి అడుగుపెట్టడం అనేది ఇప్పుడు సర్వసాధారణం. అయితే, కెప్టెన్సీ బాధ్యతలు చేపట్టడం అనేది చాలా అరుదు. ఇప్పుడు జోక్ వుకుసిక్ అనే 17 ఏళ్ల యువ క్రికెటర్ అంతర్జాతీయ టీ20 క్రికెట్‌లో అతి చిన్న వయసులో కెప్టెన్సీ పగ్గాలు చేపట్టి ప్రపంచ రికార్డు సృష్టించాడు. జోక్ వుకుసిక్ అంతర్జాతీయ క్రికెట్‌లో కెప్టెన్సీ చేసిన అతి చిన్న వయసు ఆటగాడిగా చరిత్ర సృష్టించాడు. కేవలం 17 సంవత్సరాల 311 రోజుల వయసులో క్రొయేషియా తరపున సైప్రస్‌పై కెప్టెన్సీ బాధ్యతలు చేపట్టి ఈ రికార్డును సాధించాడు. 2022లో ఫ్రాన్స్ కెప్టెన్ నోమాన్ అమ్జాద్ (18 ఏళ్ల 24 రోజులు) పేరిట ఉన్న రికార్డును జోక్ బద్దలు కొట్టాడు. కొద్ది రోజుల క్రితం, వైభవ్ సూర్యవంశీ అనే 14 ఏళ్ల యువ క్రికెటర్ టీ20ల్లో అతి చిన్న వయసులో సెంచరీ చేసి రికార్డు సృష్టించాడు. అదే విధంగా, జోక్ వుకుసిక్ కూడా అంతర్జాతీయ క్రికెట్‌లోనే కాదు, టీ20లలో కూడా కెప్టెన్సీ చేసిన అతి చిన్న వయసు క్రికెటర్‌గా నిలిచాడు. వైభవ్ సూర్యవంశీ చిన్న వయసులో సెంచరీ సాధిస్తే, జోక్ వుకుసిక్ చిన్న వయసులో కెప్టెన్‌గా నిలిచి రికార్డు నెలకొల్పాడు. టీ20 క్రికెట్‌లో అత్యంత చిన్న వయసులో కెప్టెన్సీ చేసిన రికార్డు గతంలో పాకిస్తాన్ ఆటగాడు తైమూర్ అలీ పేరిట ఉండేది. అతను 2009లో 17 ఏళ్ల 358 రోజుల వయసులో క్వెట్టా బియర్స్‌కు కెప్టెన్సీ చేశాడు. 16 సంవత్సరాల తర్వాత ఇప్పుడు ఆ రికార్డును జోక్ వుకుసిక్ బద్దలు కొట్టాడు. ఈ యువ క్రికెటర్ భవిష్యత్తులో కూడా ఇలాంటి అద్భుతాలు సృష్టిస్తాడని క్రికెట్ నిపుణులు అభిప్రాయపడుతున్నారు.


# చెన్నైకి గుడ్ బై చెప్పనున్న అశ్విన్!

2026 ఐపీఎల్ సీజన్‌కు చాలా సమయం ఉన్నప్పటికీ ట్రేడింగ్?పై రోజుకో ?చర్చ తెరపైకి వస్తుంది. ఇప్పటికే రాజస్థాన్ రాయల్స్ కెప్టెన్ సంజు శాంసన్ జట్టును వీడేందుకు నిర్ణయించుకున్నాడని రీసెంట్?గా వార్తలు రాగా, సీనియర్ ప్లేయర్లు రవిచంద్రన్ అశ్విన్ కూడా అదే బాటలో నడిచేందుకు డిసైడ్ అయినట్లు తెలుస్తోంది. తాజాగా అతడు కూడా తనను జట్టు నుంచి రిలీజ్ చేయాలని చెన్నై సూపర్ కింగ్స్? ఫ్రాంచైజీకి రిక్వెస్ట్ చేశాడనని సమాచారం. రవిచంద్రన్ అశ్విన్ తనను రిలీజ్ చేయాలని చెన్నై సూపర్ కింగ్స్ మేనేజ్?మెంట్?కు విజ్ఞప్తి చేసినట్లు సమాచారం. అయితే దీనిపై అశ్విన్ నుంచి గానీ లేదా ఫ్రాంచైజీ నుంచి గానీ, అధికారికంగా ప్రకటన రావాల్సి ఉంది. కాగా ఐపీఎల్ తొలి ఎడిషన్? నుంచి ఆడుతున్న అశ్విన్, 2008 నుంచి 2015 వరకు చెన్నైతోనే ఉన్నాడు. ఆ తర్వాత దాదాపు తొమ్మిది సీజన్లలో పంజాబ్ కింగ్స్, రాజస్థాన్ రాయల్స్, పుణె సుపర్ జెయింట్స్ తదితర జట్లకు ఆడాడు. ఇక దాదాపు పదేళ్ల తర్వాత ఈ సీజన్?లోనే అశ్విన్ చెన్నైలో చేరాడు. అశ్విన్?ను చెన్నై 2024లో జరిగిన మెగావేలంలో రూ.9.75 కోట్ల భారీ ధరకు కొనుగోలు చేసింది. 2025 సీజన్?లో 9 మ్యాచ్?లు ఆడిన అశ్విన్ 7 వికెట్లే తీసి నిరాశపర్చాడు. అయితే ఇప్పుడు చెన్నై నుంచి వెళ్లిపోయి, రాజస్థాన్ రాయల్స్‌కు ప్రాతినిధ్యం వహించాలను అనుకుంటున్నట్లు సమాచారం. అయితే అశ్విన్ వచ్చే ఏడాది ట్రేడింగ్ లేదా వేలంలోకి వెళ్లడం అనేది పూర్తిగా చెన్నై ఫ్రాంచైజీ నిర్ణయమే.




# వార్-2..కూలీపై ఆసక్తి

## హీరోల ఎంట్రీపై ఉత్కంఠ కలిగించేలా మేకింగ్



ఎన్టీఆర్ వార్-2. రజనీకాంత్ కూలీ చిత్రాలపై ఇప్పుడు సర్వత్రా ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. ఈ రెండూపోటీగా విడుదలవుతున్నాయి. సినిమా స్టార్ కాగానే హీరో కనిపించే విధానానికి చెక్ పెట్టేస్తున్నారు మేకర్స్. గతంలో ఓ స్పెషల్ సాంగ్ లేదా ఓ చిన్న ఎలివేషన్లతో హీరో ఎంట్రీ ఉండేది. కానీ ఇప్పుడు మాత్రం మినిమం అరగంట గ్యాప్ ఉండాల్సిందే. ఈ మధ్య సలార్, కల్కిలో అరగంట తర్వాతే యంగ్ రెబల్ స్టార్ దర్శన భాగ్యం లభించింది.. జస్ట్ కటౌట్ కనిపిస్తే చాలు అనుకుంటు-న్న ఫ్యాన్స్. ఈ గ్యాప్ పెద్దగా లెక్క చేయడం లేదు. ఇప్పుడు కూలీ, వార్ 2లో రజనీకాంత్, జూనియర్ ఎంట్రీ- కూడా ఇలాగే ఎ÷-లాన్ చేసినట్లు- టాక్ నడుస్తోంది. కూలీలో రజనీకాంత్ స్క్రీన్ పై కనిపించేంది మూవీ స్టార్ట్ అయిన గంట తర్వాత అన్నది బజ్ నడుస్తోంది. ఈ గంటలోనే మిగిలిన క్యారెక్టర్లన్నింటినీ చూపించబోతున్నాడట లోకేశ్ కనగరాజ్. అటు- బాలీవుడ్ ఎంట్రీకి సిద్ధమౌతున్న తారక్ కూడా -టైటిల్ కార్డ్స్ పడిన అరగంట తర్వాతే కనిపించబోతున్నాడట. వార్ 2లో హృతిక్- తారక్ ఫేస్ ఆఫ్ అండ్ సాంగ్ స్క్రీన్ తగలబడి పోతాయంటున్నారు బాలీవుడ్ క్రిటిక్స్. ఇలా హీరోలను సినిమా స్టార్టయిన అరగంటకు, గంటకు చూపించి ప్రేక్షకుడికి అ-టె-న్షన్ క్రియేట్ చేస్తున్నారు మేకర్స్. ఏదేమైనా తమ ఫేవరేట్ హీరోల కోసం ఎంత సేపేనా వెయిట్ చేసేందుకు రెడీగానే ఉన్నారు డై హార్ట్ ఫ్యాన్స్. రెండు హై ఆక్టేన్ మూవీస్ కూలీ, వార్ 2 బాక్సాఫీస్ దగ్గర బిగ్గెస్ట్ వార్‌కు రెడీ అవుతున్నాయి. రెండూ తెలుగు సినిమాలు కాదు కానీ అలా అని పొరుగు సినిమాలనీ తీసేయలేం. ఎందుకంటే ఇద్దరు టాలీవుడ్ బిగ్గెస్ట్ స్టార్ హీరోలు నాగార్జున, జూనియర్ ఎన్టీఆర్ ఈ చిత్రాల్లో భాగం కాబోతున్నారు. సో మన సినిమాలుగా రిసీవ్ చేసుకుంటున్నారు టాలీవుడ్ ఆడియన్స్. మరి ఆగస్టు 14న ఏ సినిమా హిట్ టాక్ తెచుకుంటుందో బాక్సాఫీస్ దగ్గర బ్లాక్ బస్టర్ సౌండ్ చేస్తుందో లెట్స్ వెయిట్.



## మళ్లీ లైన్‌లోకి వచ్చిన అనుపమ

టిల్లు స్క్వేర్‌తో హోమ్లీ లుక్కు నుండి మేకోవర్ అయిన అనుపమ పరమేశ్వరన్ ఈ ఏడాది డ్రాగన్‌తో ఓ మంచి శుభారంభాన్ని ఇచ్చింది. అయితే ఇటీవల వచ్చిన జానకి వి వర్సెస్ స్టేట్ ఆఫ్ కేరళ చెరిపేసింది. -టైటిల్ వివాదం వల్ల సరైన ప్రమోషన్లు చేయక ఏదో రిలీజ్ చేశామంటే చేశాం అని తూతూ మంత్రంగా, వ్యవహారం సాగింది. దీని వల్ల కేరళలో చాలా గ్యాప్ తర్వాత వచ్చిన ఫిల్మ్ తన కెరీర్‌కు యూజ్ కాకుండా పోయింది. ఈ రిజల్ట్ ముందే ఊహించారేమో తెలుగులో కూడా రిలీజ్ చేయాలనుకుని చివరి నిమిషంలో వెనక్కు తగ్గారు మేకర్స్. అనుపమ పరమేశ్వర్ కు ఆఫర్ల కొదవ లేదు కానీ చేసిన సినిమాలన్నీ వాయిదాల బాట పడుతున్నాయి. ఇప్పటికే తమిళ్, మలయాళంలో కంప్లీటైన లాక్ డౌన్ లాస్ట్ ఇయర్, పెట్ డి-టె-క్టివ్ ఈ ఏడాది ఫస్ట్ ఆఫ్‌లో థియేటర్లలో హాయ్ చెప్పాల్సి ఉండగా రిలీజ్ డిలే అవుతున్నాయి. టాలీవుడ ఫిల్మ్ పరదా కూడా ప్రవీణ్ కంద్రేగుల శుభం ప్రాజెక్టుపై ఫోకస్ చేయడంతో పోస్ట్ పోన్ అవుతూ ఎట్టకేలకు ఆగస్టు 22న డేట్ లాక్ చేసుకుంది. పరదా బైలింగ్వల్ మూవీగా రాబోతుంది. ఇటు- తెలుగు, అటు- మలయాళంలో రిలీజ్ చేయనున్నారు మేకర్స్. నెక్ట్స్ త్రీ మంత్స్‌లో త్రీ ఇండస్ట్రీల్లో అనుపమ సందడి చేయనుంది. పరదాతో పాటు- తమిళ పడమ్ బైసన్ రాబోతుంది. మారి సెల్వరాజ్ స్పోర్ట్ డ్రామాలో విక్రమ్ సన్ ధ్రువ్ విక్రమ్ హీరో. అక్టోబర్ 17పై ఇప్పటికే కర్చీఫ్ వేసుకుంది ఈ సినిమా. ఇదే కాకుండా బెల్లంకొండ సాయి శ్రీనివాస్ తో చేస్తున్న కిష్కిందపురి కూడా అదే నెలలో తీసుకు రానున్నారని టాక్. అనేక వాయిదాల అనంతరం బ్యాక్ టు- బ్యాక్ సినిమాలతో వస్తోంది అనుపమ.



## సుధీర్ బాబు జటాధార

'జటాధర'తో ప్రేక్షకుల్ని అలరించేందుకు సిద్ధమవుతున్నారు సుధీర్‌బాబు . ఆయన హీరోగా నటిస్తున్న ఈ పాన్ ఇండియా చిత్రాన్ని వెంకట్ కల్యాణ్ తెరకెక్కిస్తున్నారు. ఆధ్యాత్మిక అంశాలతో ముడిపడి ఉన్న సూపర్ నేచురల్ థ్రిల్లర్‌గా రానుంది. విజువల్ ఎఫెక్ట్స్‌కు ప్రాధాన్యత ఉన్న చిత్రమిది. సోనాక్షి సిన్హా కథానాయిక. తాజాగా ఈ సినిమా టీ-జర్‌ను ప్రభాస్ విడుదల చేశారు. ఇందులో సోనాక్షి పవర్‌ఫుల్ లుక్‌లో కనిపించారు. దురాశకు, త్యాగానికి మధ్య జరిగే పోరాటాన్ని చూసేందుకు అందరూ సిద్ధంగా ఉండాలని చిత్రబృందం పేర్కొంది. ఇప్పటికే చిత్రీకరణ పూర్తి చేసుకున్న ఈ సినిమా త్వరలోనే ప్రేక్షకుల ముందుకు రానుంది.

## కాంతారా నుంచి కనకవతి పరిచయం

కన్నడ నటుడు రిషభ్ శెట్టి స్వీయ దర్శకత్వంలో తెరకెక్కుతున్న తాజా చిత్రం 'కాంతార చాప్టర్ -1. 2022లో రిలీజై బ్లాక్ బస్టర్ హిట్ గా నిలిచిన 'కాంతార' సినిమాకు ప్రీక్వెల్ గా ఈ సినిమా వస్తుంది. ఇప్పటికే షూటింగ్ పూర్తి చేసుకున్న ఈ చిత్రం అక్టోబర్ 2న ప్రేక్షకుల ముందుకు రాబోతుంది. ఈ సందర్భంగా మూవీ నుంచి ప్రమోషన్స్ షురూ చేశారు మేకర్స్. ఇందులో భాగంగా ఈ సినిమాలో నటిస్తున్న కథానాయక రుక్మిణి వసంత్‌ని పరిచయం చేశారు మేకర్స్. రుక్మిణి వసంత్ ఇందులో కనకవతిగా కనిపించబోతున్నట్లు- ప్రకటించారు. హొంబాలే ఫిల్మ్స్ పతాకంపై విజయ్ కిరంగదూర్ ఈ చిత్రాన్ని నిర్మిస్తుండగా.. అజ్నీశ్ లోకనాథ్ సంగీతం అందిస్తున్నారు. ఇక ఈ చిత్రాన్ని కన్నడతో పాటు- తెలుగు, హిందీ, తమిళం, మలయాళం, బెంగాలీ, ఇంగ్లీష్ భాషల్లో విడుదల చేయనున్నారు.



## అషు రెడ్డి.. చీరలో కూడా హై గ్లామర్ ట్రీట్!

ట్రెండ్ సెట్టర్‌గా నిలిచిన అషు రెడ్డి తరచూ సోషల్ మీడియా వేదికగా తన ఫోటోషూట్లతో, స్టైల్ స్టేట్మెంట్లతో అభిమానులను ఆకట్టుకుంటోంది. ఒకవైపు సినిమాలు, వెబ్ షోలు, యాంకరింగ్, మరోవైపు ఇన్‌స్టాగ్రామ్‌లో రకరకాల లుక్స్ తో ఫాలోవర్లను పెంచుకుంటోంది. ఆమె పోస్ట్ చేసే ప్రతి ఫోటో సెకండ్లలో వైరల్ అవుతూ ట్రెండింగ్ లోకి వస్తుంటుంది.

లేటెస్ట్ గా అషు రెడ్డి ఒక ట్రెడిషనల్ లుక్‌లో నెటిజన్లను మెస్మరైజ్ చేసింది. చక్కటి చీరతో క్లాసీ మేకోవర్‌లో ఫోటోషూట్ చేసింది. మెస్మరైజ్ చేసే చిరునవ్వుతో, స్మార్ట్ పోజులతో అషు ఎట్రాక్షన్ పెంచింది. మోడ్రన్ ఎలిగెన్స్‌తో పాటు సాంప్రదాయ హంగు కలిపిన ఈ లుక్స్ కి నెటిజన్లు ఫిదా అయిపోయారు. క్రీమ్ కలర్ కాంబినేషన్‌లో ఉండే ఈ చీరలోని ఫ్లోరల్ డిజైన్, లైట్ మెటీరియల్ స్టైలింగ్ అషు లుక్‌ని మరింత అందంగా చూపించింది.

ఈ ఫోటోలకి "మాయం అయింది నా మనస్సు నీ వల్ల" అంటూ క్యాప్షన్ పెట్టింది. హ్యాష్‌ట్యాగ్స్‌తో పాటు, తన ఫోటోషూట్ బృందానికి క్రెడిట్ ఇస్తూ పోస్ట్ చేసింది. ఆమెను ఫాలో అయ్యే అభిమానులు, స్నేహితులు కామెంట్స్‌లో వర్షంలా ప్రశంసలు కురిపిస్తున్నారు. "సింప్లిసిటీకి, బ్యూటీకి పర్‌ఫెక్ట్ డెఫినిషన్", "గార్జియస్", "ఫెయిరీ టేల్ లుక్" అని కామెంట్స్ వెల్లువెత్తుతున్నాయి. అషు రెడ్డి ట్రెడిషనల్ లుక్‌లోనూ ఎంత స్టన్నింగ్‌గా కనిపించగలదో మరోసారి నిరూపించుకుంది.



Printed, Published by **Mohammed Murthuza.** Printed at Vivek Art Printers APHP SHOP NO.12, OSMANIA UNVERSITY ROAD,HYDERABAD. PUBLISHED ROOM NO.10, Ground Flour, Budha Bhavan, M.G.Road, Secunderabad -03. Ali Publication, Hyderabad. www.samayam.net Mobile No. **98660 19778, 89789 60131**

# వ్యవసాయ రంగంలో కరీంనగర్ జిల్లాకు 2 జాతీయస్థాయి అవార్డులు కైవసం .

- వ్యవసాయ శాఖలో కలెక్టర్ కు
- మత్స్య సంపద అభివృద్ధిలో మత్స్య శాఖకు అవార్డులు



**కరీం నగర్ ఆగస్టు8( సమయం న్యూస్).:** వ్యవసాయ, మత్స్యశాఖ అభివృద్ధికి గాను జిల్లాలో చేపడుతున్న వివిధ కార్యక్రమాలకు జాతీయస్థాయిలో రెండు అవార్డులు వచ్చాయి. "ఇండో అగ్రి", "సస్టైనబిలిటీ మ్యాటర్స్" సంస్థల ఆధ్వర్యంలో న్యూఢిల్లీలో నిర్వహించిన "సస్టైనబుల్ అగ్రికల్చర్ సమ్మిట్"లో ఈనెల 7న జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి తరపున జిల్లా అధికారులు ఈ అవార్డులు అందుకున్నారు. రైతు సంక్షేమం కోసం సుస్థిర వ్యవసాయ విస్తరణ కార్యక్రమాలను జిల్లాలో విజయవంతంగా అమలు చేస్తున్నందుకు జిల్లా కలెక్టర్ పమేలా సత్పతికి ఈ అవార్డు దక్కింది.( దేశవ్యాప్తంగా ఈ అవార్డుకు ఇద్దరు కలెక్టర్లు మాత్రమే ఎంపికయ్యారు. పంజాబ్ రాష్ట్రం ఫిరోజ్ పూర్ కలెక్టర్, కరీంనగర్ కలెక్టర్)

మత్స్య సంపద అభివృద్ధికి, మత్స్యకారుల సంక్షేమానికి కరీంనగర్ జిల్లాలో అవలంబిస్తున్న వివిధ పద్ధతులకు గాను జిల్లా మత్స్య శాఖకు మరో అవార్డు అందింది. వ్యవసాయ శాఖకు వచ్చిన అవార్డును జిల్లా వ్యవసాయ అధికారి భాగ్యలక్ష్మి, కృషి విజ్ఞాన కేంద్రం ప్రోగ్రా కోఆర్డినేటర్ నీలం వెంకటేశ్వర్ రావు, మత్స్యశాఖకు వచ్చిన అవార్డును జిల్లా మత్స్యశాఖ అధికారి డాక్టర్ విజయభారతి న్యూఢిల్లీలో జిల్లా కలెక్టర్ తరపున అందుకున్నారు. సుస్థిర వ్యవసాయ విస్తరణ కోసం జమ్మికుంట కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో జిల్లాలో చేపట్టి విజయవంతమైన కార్యక్రమాల్లో కొన్ని..

- ఎరువులకు ప్రత్యామ్నాయంగా జిల్లాలో 11652 హెక్టార్లలో పచ్చిరొట్ట సాగు. ఈ విధానం ద్వారా సుమారు 13 10 టన్నుల యూరియా ఆదా అయింది
- నేరుగా వరివిత్తే పద్ధతి ద్వారా జిల్లాలో సుమారు 27 వేల హెక్టార్లలో వరి సాగు. ఈ విధానం ద్వారా కూలీలకు కొరత అధికమించడంతోపాటు హెక్టారుకు పదివేల రూపాయలు రైతుకు ఆదా.
- నూతన వరి వంగడాల పరిచయం
- భూమిలో సహజంగా భాస్వరం కలిగించే జీవన ఎరువుల వినియోగం. 12640 హెక్టార్లలో ఈ పద్ధతి ద్వారా సాగు.
- ఈ సాయం వాట్సాప్ గ్రూప్ ద్వారా రైతులకు సంపూర్ణ సమాచారం మత్స్య సంపద అభివృద్ధికి జిల్లాలో చేపడుతున్న కొన్ని చర్యలు..
- కరీంనగర్ జిల్లాలో చెరువులు కుంటలు జలాశయాల్లో మత్స్య సంపద అభివృద్ధి.
- ఇతర జిల్లాల్లోని ప్రభుత్వ చేప పిల్లల ఉత్పత్తి కేంద్రాలకు ఇక్కడి నుంచి సీడ్స్ ఎగుమతి
- మత్స్యకారుల అభివృద్ధికి చర్యలు
- ఎం జి ఎన్ ఆర్ ఈజీఎస్ లో భాగంగా చేపల కొలనుల ఏర్పాటు.
- స్వయం సహాయక సంఘాల సభ్యులకు చేప పిల్లల పెంపకంపై అవగాహన.

# నాగార్జున సాగర్ ఎడమ కాల్వ ఎస్కేప్ ఛానెల్ ను పరిశీలించిన జిల్లా కలెక్టర్.





**నల్గొండ ఆగస్టు08( సమయం న్యూస్). :** నిరంతర వర్షాల దృష్ట్యా భారీ వర్షాలు వస్తే, అత్యవసర సమయంలో అప్రమత్తంగా ఉంటూ సాగునీటిని నియంత్రించాలని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి నీటిపారుదల శాఖ అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఆమె హాలియా 17 వ మైలు రాయి వద్ద, అలాగే 42 వ మైలు రాయి దేవులపల్లి వద్ద నాగార్జున సాగర్ ఎడమకాలువ ఎస్కేప్ ఛానెల్స్ ను పరిశీలించారు. అత్యవసర పరిస్థితులలో నీటి ప్రవాహాన్ని నియంత్రించేందుకు అధికారులు,సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని,తక్షణమే నీటిని ఎస్కేప్ ఛానెల్ ద్వారా స్ట్రీమ్ కు పంపించాలన్నారు. మిర్యాలగూడ సబ్ కలెక్టర్ నారాయణ్ అమిత్, డిప్యూటీ ఎక్జిక్యూటివ్ ఇంజనీర్ గోపీనాథ్ తదితరులు ఉన్నారు.

# ప్రభుత్వ కళాశాలలో నూతన విద్యార్థులకు స్వాగతోత్సవం



**పటాన్ చెరు (జిన్నారం), ఆగస్టు 8, సమయం న్యూస్ :** సంగారెడ్డి జిల్లా మండల కేంద్రమైన జిన్నారం లోని ప్రభుత్వ కళాశాలలో నూతన విద్యార్థులకు స్వాగతోత్సవ కార్యక్రమం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ కళింగ కృష్ణ కుమార్ మాట్లాడుతూ గతంలో ఎన్నడూ లేని విధంగా కళాశాలలోని మొదటి సంవత్సరంలో 148 మంది విద్యార్థులు చేరారని తెలిపారు. ఈ కార్యక్రమానికి జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి గోవింద్ రామ్, స్థానిక తహసిల్దార్ దేవదాస్, స్థానిక ఎస్సై హనుమంతు లు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. కళాశాలలో ద్వితీయ సంవత్సరం, మొదటి సంవత్సరం ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు గోల్డ్ మెడల్స్ ప్రధానం చేశారు. గతంలో కళాశాలలొ పనిచేసిప్రిన్సిపల్ గా పదోన్నతి పై వెళ్లిన కృష్ణారావు, ఐలయ్యలను కళాశాల యాజమాన్యం ఘనంగా సన్మానించి వేడుకలు పలికారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరిని ఆకర్షించాయి. ఈ కార్యక్రమంలో కళాశాల సిబ్బంది, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

# నిరుపేదలకు అండ సీఎంఆర్ఎఫ్

- రెండు లక్షల 50 వేల రూపాయల ఎల్ఓసి అందజేసిన ఎమ్మెల్యే



**పటాన్ చెరు, ఆగస్టు 8, సమయం న్యూస్ :** నిరుపేదలకు కార్పొరేట్ వైద్యం అందించడంలో ముఖ్యమంత్రి సహాయనిధి వరప్రదాయనిగా నిలుస్తోందని పటాన్ చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు.జిన్నారం మండలం మాదారం గ్రామానికి చెందిన టి. స్వప్న గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. మెరుగైన వైద్య చికిత్స కోసం స్థానిక శాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి ద్వారా ప్రభుత్వానికి దరఖాస్తు చేసుకున్నారు ఈ మేరకు ప్రభుత్వం మంజూరు చేసిన రెండు లక్షల 50 వేల రూపాయల ఎల్ఓసిని శుక్రవారం క్యాంపు కార్యాలయంలో స్వప్న కుటుంబ సభ్యులకు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి చేతుల మీదుగా అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీ వైస్ చైర్మన్ కుంచాల ప్రభాకర్, తదితరులు పాల్గొన్నారు.

# 11 అక్రమ ఇసుక డంప్ సీజ్.

జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష

ఇందిరమ్మ ఇండ్ల పేరుతో అక్రమ ఇసుక రవాణా

పాముల పేట, మేడిపల్లి ఇసుక రీచ్ మూసివేత

అక్రమ ఇసుక రవాణాకు పాల్పడితే కఠిన చర్యలు

అక్రమ ఇసుక రవాణా పై పత్రికా ప్రకటన విడుదల చేసిన జిల్లా కలెక్టర్

**పెద్దపల్లి , ఆగస్టు-08:( సమయం న్యూస్).:** జిల్లాలో 11 అక్రమంగా ఇసుక డంప్ లను సీజ్ చేసి మూసివేయడం జరిగిందని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. రామగుండం ప్రాంతంలో 5 ఇసుక డంప్ లు, మంథని ప్రాంతంలో 3 ఇసుక డంప్ లు, శ్రీరాం పూర్, రామగిరి, ధర్మారం మండలాల్లో ఒక్కో అక్రమ ఇసుక డంప్ మొత్తం 11 అక్రమ ఇసుక డంప్ లను గుర్తించి సీజ్ చేయడం జరిగిందని అన్నారు. అక్రమ ఇసుక రవాణా చేసే వారిపై సంబంధిత సెక్షన్లతో ఎఫ్.ఐ.ఆర్ నమోదు చేయడం జరిగిందని అన్నారు.ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం పేరుతో అక్రమ ఇసుక రవాణాకు పాల్పడుతున్న వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ తెలిపారు. జిల్లాలోని పాముల పేట మేడిపల్లి ఇసుక రీచ్ లను శాశ్వతంగా మూసి వేస్తున్నామని అన్నారు.జిల్లాలో అక్రమంగా ఇసుక రవాణా చేస్తే చట్ట ప్రకారం అత్యంత కఠినంగా వ్యవహరిస్తూ చర్యలు తీసుకుంటామని, ఎట్టి పరిస్థితుల్లో ఉపేక్షించేది లేదని కలెక్టర్ అక్రమార్కులను ఆ ప్రకటనలో హెచ్చరించారు.

# జిల్లాలోని విద్యార్థులకు బ్యాంకు ఖాతాలు తెరిచిన అధికారులు.




**నిర్మల్ ఆగస్టు8( సమయం న్యూస్). :** బాలశక్తి కార్యక్రమంలో భాగంగా జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులందరికీ బ్యాంకు ఖాతాలు ఉండాలన్న ఉద్దేశంతో, అధికారులు బ్యాంకు ఖాతాలు తెరుస్తున్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం సోన్ మండలం లెఫ్ట్ పోచంపాడ్ ప్రభుత్వ సాంఘిక సంక్షేమ పాఠశాల, జూనియర్ కళాశాలలో చదువుతున్న విద్యార్థులకు జిల్లా లీడ్ బ్యాంకు మేనేజర్ రామ్ గోపాల్ ఆధ్వర్యంలో 350 బ్యాంకు ఖాతాలు తెరిచి, విద్యార్థినులకు అందివ్వడం జరిగింది. ఇదివరకే సారంగాపూర్ మండలంలో ఎస్బిఐ, టిజిబి బ్యాంకుల సహకారంతో 500 ఖాతాలు తెరిపించినట్లు చెప్పారు.

# తెలంగాణ వైద్య విధాన పరిషత్‌ను డెరెక్టర్ సెకండరీ హెల్త్‌గా అప్ గ్రేడ్ చేస్తాం

## రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహా .





అసోసియేట్ ప్రొఫెసర్స్ నుండి ప్రొఫెసర్స్ గా పదోన్నతులు కల్పించినందుకు మంత్రి దామోదర్ రాజనర్సింహా గారికి కృతజ్ఞతలు తెలిపిన డాక్టర్ల సంఘం ప్రతినిధులు .తెలంగాణ వైద్య విధాన పరిషత్ లో 1690 డాక్టర్ పోస్టుల భర్తీ కీ సానుకూలంగా మంత్రి దామోదర్ రాజనర్సింహా స్పందించారు .డాక్టర్ల పోస్టుల భర్తీకీ తెలంగాణ మెడికల్ బోర్డు త్వరగా విధివిధానాలు రూపొందించాలని మంత్రి దామోదర్ ఆదేశం.డాక్టర్ల ఉద్యోగాల భర్తీలో వయోపరిమితి పెంపు పై నిబంధనలు రూపొందించటానికి కమిటీ నీ నియమిస్తాం. మంత్రి దామోదర్ రాజనర్సింహా .

TVVP లో క్యాడర్ స్ట్రెంత్ పెంపు పై కమిషనర్ డా . అజయ్ కుమార్ తో చర్చించిన మంత్రి దామోదర్ రాజనర్సింహా .TGGDA డాక్టర్ల సంఘం ప్రతినిధులతో సంగారెడ్డి లోని తన నివాసం లో మంత్రి దామోదర్ రాజనర్సింహా సమావేశం . డాక్టర్ల సమస్యల పై అసోసియేషన్ ప్రతినిధులు చేసిన విజ్ఞప్తి పై మంత్రి దామోదర్ రాజనర్సింహా సానుకూలంగా స్పందించారు

ఈ సమావేశం లో తెలంగాణ గవర్నమెంట్ డాక్టర్ల అసోసియేషన్ (TGGDA) అధ్యక్షులు డా . నరహరి , సెక్రెటరి జనరల్ డా . లాలు ప్రసాద్ , డా . రాహుఫ్ , డా . వినయ్ కుమార్ , డా . గోపాల్ , డా . క్రాంతి , డా . అశోక్ , డా . రామ్ సింగ్ లు పాల్గొన్నారు .



ఆరోగ్య పాఠశాల రెండవ విడత కార్యక్రమం లో భాగంగా శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన ఆరోగ్య పాఠశాల సమీక్ష లో వివిధ అంశాల పై జిల్లాలోని 18 మండలాల పాఠశాల విద్యార్థుల ప్రదర్శన తీరును పరిశీలించి స్టూడెంట్ చాంపియన్ లకు సర్టిఫికెట్ అందజేసిన జిల్లా కలెక్టర్ రాజర్షి షా.

సమయం న్యూస్‌బి ఆదిలాబాద్.